




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 113 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ గురువారం 5 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 113 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD THU 5 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## మమ్మల్ని యుద్ధంలోకి లాగొద్దు

ట్రంప్ వార్నింగ్‌పై స్పెయిన్ ప్రధాని కామెంట్

- ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న వారి లక్ష్యాల్లో స్పష్టత లేదన్న పెడ్రో సాంచెజ్
- ఇలాంటి రక్తపాతాన్ని స్పెయిన్ ఎన్నడూ కోరుకోలేదని వ్యాఖ్య
- యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు తీర్మానాలు చేశాయన్న సాంచెజ్

- మిగతా2లో



## శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి...? 101 మంది గల్లంతు...?

- శ్రీలంక తీరంలో మునిగిపోయిన ఇరాన్ నేవీ ఫ్రిగేట్ 'ఐరిస్ డెనా'
- వెంటనే స్పందించి 30 మందిని రక్షించిన శ్రీలంక నావికాదళం
- జలాంతర్గామి దాడి వల్లే నౌక మునిగిందని అనుమానాలు
- 101 మంది సిబ్బంది ఆచూకీ గల్లంతైందన్న వార్తలపై గందరగోళం

- మిగతా2లో

# సింగూర్ డ్యామ్ పనులు వెంటనే పూర్తి చెయ్యాలి




- పెద్దారెడ్డి లిఫ్ట్ స్కీం డీపీఆర్ సమర్పించాలి
- మంత్రులు దామోదర, ఉత్తమ్, వివేక్
- సచివాలయంలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష
- జులై నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందించాలని ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** యుద్ధ ప్రాతిపదికన సింగూరు డ్యామ్ సేఫ్టీ పనులు పూర్తి చేయాలని మంత్రులు దామోదర రాజ నర్సింహా, ఉత్తమ్ కుమార్రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధికారుల ను ఆదేశించారు. పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనుల డీపీఆర్ ను శరవేగంగా రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలన్నారు. సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి అధ్యక్షతన సిందూరు ప్రాజెక్టు రాష్ట్రం పేపీపై ఇరిగేషన్ శాఖ ముఖ్య అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. డ్యామే సేఫ్టీ ప్రభుత్వానికి చాలా ముఖ్యమని మంత్రులుపేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సెక్యూరిటీ సంస్థ రూపొందించిన నిబంధనల మేరకు డ్యామ్ ను పరిరక్షించాలని, డ్యామ్ సేఫ్టీ నిర్మాణ పనులపై టెక్నికల్ కమిటీని నియమించాలని సూచించారు. ఆంరోల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించే పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులకు ఉగా దిలోగా శంకుస్థాపన చేసేలా చూడాలని ఆదేశించారు. సింగూరు ప్రాజెక్టు కాలువల లైనింగ్ పనులను జూన్ 26 లోగా పూర్తి చే యాలన్నారు. చెరువుల పునరుద్ధరణ పనుల టెండర్లను పూర్తి చేసి ఈ సీజన్లో రైతులకు పారునీరు అందించాలన్నారు.

## వచ్చేవి జమిలీ ఎన్నికలే..

నేను పోటీచెయ్యను నెక్స్ నా కొడుకే

- రాజకీయంగా చాలా మార్పులొస్తయ్
- టికెట్ వస్తే మా అబ్బాయి పోటీ ఖాయం
- నేను ప్రత్యక్ష ఎన్నికలకు దూరం
- మండలి చైర్మన్గుత్తా సుఖేందర్ రెడ్డి చిట్ చాట్




**హైదరాబాద్ పెన్ పవర్:** రాబోయేది జమిలి ఎన్నికలేనని..నియోజకవర్గాల పునర్విభజనతో పరిస్థితులన్నీ మారతాయని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని గొప్పలు చెప్పిన వారు ఇప్పుడు సైలెంట్ అయ్యారని విమర్శించారు. చిట్ చాట్సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మళ్లీ మేము అధికారంలోకి వస్తామన్న వాళ్లు సైలెంట్ అయ్యారు. వచ్చేవి జమిలి ఎన్నికలే. నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుంది. మహిళా రిజర్వేషన్లు వస్తాయి. రాజకీయంగా చాలా మార్పులు వస్తాయి. రిజర్వేషన్లు మారతాయి. మా అబ్బాయి ఎక్కడి నుంచి పోటీ చేస్తారు అనేది ఇప్పుడు చెప్పలేం. అప్పుడున్న పరిస్థితులను బట్టి అప్పుడు నిర్ణయం తీసుకుంటం. మా అబ్బాయికి టికెట్ వస్తే పోటీ చేస్తారు. రాజకీయాల్లోకి వచ్చాకా పోటీ చేయరా? నేను ప్రత్యక్ష ఎన్నికలు దూరంగా ఉంట' అని తెలిపారు.

**రెండేండ్లలో ఎల్బీసీ పూర్తి**

ఎల్బీసీ పాత విధానంలో పనులు నడుస్తున్నాయి. ఒక్క రోజులో 20 మీటర్ల పనులు జరుగుతున్నాయి. దాదాపు రెండేండ్లు సమయం పట్టే అవకాశం ఉంది.

- మిగతా2లో

## హైదరాబాద్ లో భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

- బంజారాహిల్స్ పరిధిలోని ఒక నివాస ప్రాంతంలో కల్తీ నెయ్యి దందా
- గుట్టును రట్టు చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- 460 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ నగర నడిబొడ్డున సాగుతున్న కల్తీ నెయ్యి దందా గుట్టును టాస్క్‌ఫోర్స్ పోలీ సులు రట్టు చేశారు. బంజారాహిల్స్ పరిధి లోని ఒక నివాస ప్రాంతంలో గుట్టుచప్పుడు

- మిగతా2లో





## టెహ్రాన్ సమీపంలో భూగర్భ స్థావరంలో అణుప్రాజెక్టును ధ్వంసం చేశాం

- రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడి
- ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పని చేస్తున్నట్లు సమాచారం అందిందని వెల్లడి
- పక్కా సమాచారంతో దాడి చేశామన్న ఇజ్రాయెల్ రక్షణ దళం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లోని రహస్య భూగర్భ అణు ప్రాజెక్టును ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ రక్షణ దళం (ఐడీఎఫ్) ప్రకటించింది. రాజధాని టెహ్రాన్ సరిహద్దుల్లోని మింజాదేహైలో రహస్యంగా ఏర్పాటు చేసిన ఈ అణు ప్రాజెక్టుపై దాడి చేసినట్లు ఐడీఎఫ్ అధికార ప్రతినిధి డెఫ్రిన్ వెల్లడించారు. ఇక్కడ శాస్త్రవేత్తలు రహస్యంగా పనిచేస్తున్నట్లు సమాచారం అందిందని, దీనితో దాడి జరిపినట్లు ఐడీఎఫ్ తెలిపారు. 2025లో అమెరికా దాడుల తర్వాత ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ఇక్కడకు మళ్లించిందని వెల్లడించారు. గత ఏడాది జూన్ నెలలో ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో 12 రోజుల పాటు దాడులు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ రోజు దాడికి ఉపయోగించిన మందుగుండు సామాగ్రి కంటే ఈ నాలుగు రోజుల్లో ఉపయోగించిందే ఎక్కువ అని తెలిపారు. గతంలోనే ఇరాన్ అణుస్థావరాలపై తాము దాడులు చేశామని డెఫ్రిన్ తెలిపారు.

- మిగతా2లో




## ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు

- ఇరాన్‌లోని పాఠశాలపై మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మృతి
- తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్
- ఈ యుద్ధాలు రాబోయే తరాలకు తీరని శోకాన్ని మిగిలిస్తాయని వ్యాఖ్య

- మిగతా2లో

## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మట్నజ్తబా ఖమేనీ..



**హైదరాబాద్ పెన్ పవర్:** :ఇరాన్ రాజకీయాల్లో అనూహ్య మార్పు లు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా అలీ ఖమేనీ

- మిగతా2లో

## ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు

ముఖ్యమంత్రిపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు



- ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శ
- ఐపీఎస్, ఐఏఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారన్న హరీశ్ రావు
- రెండున్నరేళ్లలోైదుసార్లు భారీ ఎత్తున బదిలీ చేశారన్న హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. కలెక్టర్ల సదస్సులో ఆయన బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రికి పరిపాలన చేయడం రావడం లేదని విమర్శించారు. ఐఏఎస్, ఐపీఎస్‌లను పదేపదే బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు.రెండున్నరేళ్లలోనే ఐదుసార్లు భారీ ఎత్తున అధికారులను బదిలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ బదిలీలతో పాలన కుంటుపడుతోందని

- మిగతా2లో

## అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం.. మార్చి 8న ఆవిష్కరణ!

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. మార్చి 8న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీలో ప్రాంగణంలో ఇప్పటికే విగ్రహ ఏర్పాటుకు కాంక్రీటు పనులను మొదలు పెట్టారు. బేస్ మెంట్ పనులు జరుగుతున్నాయి. అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలు ఉన్న సంగతి తెలిసిందే. అదే వరుసలో తెలంగాణ

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

# మన టీచర్లకు జీతాలు ఎక్కువా?

ప్రపంచంలో అన్నివృత్తుల కన్నా గౌరవించదగిన, ఆదర్శవంతమైన, అవినీతి లేని వృత్తి ఉపాధ్యాయ వృత్తి. ప్రపంచంలోని అనేకదేశాలలో ఉపాధ్యాయులకు అన్నివృత్తుల వారి కన్నా ఎక్కువ వేతనాలు ఉంటాయి. జపాన్‌లో డాక్టర్‌ల కన్నా ఇంజినీర్ల కన్నా ఉపాధ్యాయులకు ఎక్కువ వేతనాలు ఉంటాయి. డాక్టర్లు, ఇంజినీర్లు ఆ దేశ ప్రధానమంత్రి దగ్గరకు వెళ్లి ఉపాధ్యాయుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని అంటే మిమ్మల్ని తయారు చేసిన వాళ్ళతో మిమ్మల్ని పోల్చుకుంటారా? అని అడిగారట. అదే విధంగా అనేక దేశాలలో ఉపాధ్యాయులకు ఉన్నత స్థానం, ఉన్నత వేతనాలతో సమాజంలో గౌరవం దక్కుతుంది. మన పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లోనూ తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు తీసుకుంటున్నారు. మన దేశ భవిష్యత్తు కాకుండా ప్రపంచ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉంది. కంప్యూటర్లు, ఇంటర్నెట్, డిజిటల్ పాఠాలు, యూట్యూబ్, కృత్రిమమేధ (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ) లను అభివృద్ధి చేసింది ఉపాధ్యాయులే అన్నది మరవలేని మరపురాని నిజం. తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ సమర్పించిన నివేదికలో ఉపాధ్యాయులకు ఎక్కువ వేతనాలు ఉన్నాయని రిపోర్ట్ ఇవ్వడం ఉపాధ్యాయ లోకంలో గందరగోళం, అయోమయం, ఆవేదన, ఆందోళన వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో దినమంతా విద్యా కమిషన్ చైర్మన్ సమర్పించిన నివేదిక మీద చర్చలు జరిగాయి. ఉపాధ్యాయులుగా చేయడం వృత్తి కాదు నిపుణులను తయారు చేసే సేవ అని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అంటున్నారు. దేశంలో అందరూ మర్యాదఇచ్చే వృత్తి ఉపాధ్యాయ వృత్తి. ఉపాధ్యాయులుగా జీతం జీవితం గురించి కాకుండా అన్ని రకాల వృత్తులను తయారు చేసే నైపుణ్యంగల వృత్తి. ఉపాధ్యాయులను గౌరవించడం తరతరాలుగా ఉంది. విదేశాల్లో కోర్టులలో అందరినీ నిలబెట్టి సాక్ష్యం తీసుకుంటారు. కానీ ఉపాధ్యాయులను గౌరవించి వారికి చైర్ వేసి కూర్చోబెడతారు. విదేశాల్లో అందరి కంటే ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువగా ఉంటాయి. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికలో ఉత్త టీచర్స్‌లను ఎంపిక చేసి ఉపాధ్యాయ వృత్తికి కళంకం తీసుకొని రావొద్దు. ఎప్పుడూ పాఠశాలలకు వెళ్ళని వాళ్ళకు, ఉపాధ్యాయ సంఘాలలో తిరిగేవారిని, అధికారుల చుట్టూ తిరిగే వారిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి నిజంగా పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందిస్తున్న వారిని, వినూత్న పద్ధతులలో బోధిస్తూ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించేవారిని ఎంపిక చేయాలి. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పకుండా అధికారులే నిజమైన ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం చేస్తే ఎంతో బాగుంటుంది. 35, 38 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా చేసి ఎంతోమందిని పదవ తరగతిలో ఉత్తీర్ణులను చేసి 2026 2027 విద్యా సంవత్సరంలో పలవీ విరమణ చేసేవారిని గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రులు పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించే సంప్రదాయం ఉండేది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసారి సెప్టెంబర్ 5 నాడు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి రాకుండా ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ సంఘాల నాయకులను నిరాశ, నిస్పృహలకు గురి చేసేవారు. 2025 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాలువా, మెమెంటో, నగదుతో సన్మానించి ఉపాధ్యాయులపట్ల అభిమానం చాటారు. ఉపాధ్యాయులందరూ ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 5 నాడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శిల్పారామంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మానించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొని దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం చేస్తానని ప్రకటించారు. ఉపాధ్యాయుల ముఖ్యమైన సమస్యలైన నగదు రహిత హెల్త్ కార్డు లు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్, డైట్, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఇఆర్‌టి), బి.ఎడ్, ఐసిఎస్‌సిలలో రెండు దశాబ్దాలుగా ఖాళీలుగా ఉన్న ఉపాధ్యాయ, ఆచార్య పోస్టుల భర్తీ, విశ్వవిద్యాలయాలలో ఆచార్య పోస్టుల భర్తీ మొదలైన ఉపాధ్యాయ సమస్యలకు ఉపాధ్యాయ దినోత్సవం నాడు పరిష్కారం అవుతుంది అనే నమ్మకం కలిగించారు.

ఎన్నో సంవత్సరాలనుండి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, పదోన్నతులు, బదిలీలు చేసి ఉపాధ్యాయుల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నానని ఉత్తమ ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, పాఠశాల విద్య శాఖాధికారుల మధ్య చాటారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.తెలంగాణ విద్యా శాఖ కమిషన్ నివేదికలో ప్రాథమిక పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులను తయారు చేసే డిఎడ్ లేకుండా బిఎడ్ చేయాలని అనడం ఎంత వరకు సమంజసం. ఎంతోమంది ఉపాధ్యాయ శిక్షణ చేసుకొని నిరుద్యోగ ఉపాధ్యాయులుగా టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్(టెట్) ఉత్తీర్ణత సాధించి డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్న వారికి విద్యా కమిషన్ నివేదిక గుండె గుబులు మన్నది. బిఎడ్ చేసిన వారికంటే డిఎడ్ చేసిన వారే ప్రాథమిక పాఠశాలల్లో బోధించాలని, ప్రాథమిక పాఠశాలల్లో బిఎడ్ చేసిన వారిని ఎంపిక చేయరాదని ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాకమిషన్ సుప్రీం కోర్టు తీర్పు ఒక్క సారి పరిశీలించవలసిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది. తెలంగాణలో ఉపాధ్యాయుల వేతనాలు ఎక్కువగా ఉన్నాయని అనడంతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల పట్ల చులకన భావం ఏర్పడుతుంది. పెండింగ్‌లో ఉన్న ఐదు డిఎలు, పిఆర్‌సిలను వీలైనంత వరకు త్వరలో ప్రకటించాలి. ఉపాధ్యాయుల వేతనాల కంటే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘా ల నాయకులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ, తెలంగాణ విద్యా కమిషన్ ఉపాధ్యాయుల వేతనాలు మిగితా దేశాల కంటే మిగితా రాష్ట్రాల కంటే తక్కువ ఉన్నాయనే విషయాన్ని గ్రహించాలి.

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా మట్నజ్తబా ఖమేనీ..

- మొదటి పేజి తరువాయి

కుమారుడు మట్నజ్తబా ఖమేనీ(56) బాధ్యతలు చేపట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో అలీ ఖమేనీ మరణించటంతో 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్' మట్నజ్తబాను ఎంపిక చేసినట్లు కొత్త అధినేతగా.మట్నజ్తబా ఖమేనీ కేవలం రాజకీయ వారసుడిగానే కాకుండా.. భారీ స్థాయిలో ఆర్థిక సామ్రాజ్యాన్ని కూడా నడుపుతున్నట్లు తెలుస్తోంది. ఆయన అధికారికంగా ఎటువంటి ప్రభుత్వ పదవిలో లేనప్పటికీ.. తెరవెనుక వేల కోట్ల రూపాయల పెట్టుబడులను కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. మట్నజ్తబాకు ప్రపంచవ్యాప్తంగా భారీ రియల్ ఎస్టేట్ సామ్రాజ్యం ఉంది. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల మార్కెట్లలో బిలియన్ల కొద్దీ డాలర్లను ఆయన మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే బ్రిటన్‌లో మట్నజ్తబాకు అత్యంత ఖరీదైన విలాసవంతమైన భవనం ఉందని, దీని విలువ సుమారు సుమారు రూ.1,150 కోట్లకు పైమాటేనని సమాచారం.అలాగే స్విట్జర్లాండ్ బ్యాంకుల్లో ఆయనకు భారీగా రహస్య ఖాతాలు ఉన్నట్లు అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. ఇరాన్ నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారనే ఆరోపణలతో 2019లో అమెరికా ఆయనపై ఆంక్షలు కూడా విధించిన సంగతి తెలిసిందే. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ తో మట్నజ్తబాకు ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన ఆర్థిక బలాన్ని మరింత పెంచాయి. ఇరాన్‌లోని కీలక పరిశ్రమలు, క్రూడ్ ఆయిల్ బిజినెస్, విదేశీ పెట్టుబడులపై ఆయనకు పట్టు ఉందని నిపుణులు చెబుతున్నారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు మట్నజ్తబా పెట్టుబడులను తీవ్రంగా విమర్శిస్తున్నాయి. అణచివేత ధోరణి ఉన్న పాలకుల అనుచరులు తమ దేశాల్లోని ప్రాపర్టీ మార్కెట్‌ను 'సేఫ్ డిపాజిట్ బాక్స్'గా వాడుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరాన్ సంప్రదాయం ప్రకారం తండ్రి తర్వాత కుమారుడు సుప్రీం లీడర్ కావడం అనేది కొంత వ్యతిరేకతకు దారితీసే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో IRGC సపోర్ట్ తో ఆయన అధికారం చేపడుతున్నట్లు కనిపిస్తోంది. మట్నజ్తబా భార్య జహ్రా హద్దాద్-అడెల్ కూడా ఇటీవలి దాడుల్లో మరణించారు. ఈ అనిశ్చితి మధ్య మట్నజ్తబా ఖమేనీ ఆస్తులు, ఆయన ఆర్థిక మూలాల గురించి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి.

# ఇవి మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలు

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడులు తీవ్రరూపం దాల్చాయి. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్ పట్టణంలో ఉన్న 'షజ్రే తయ్యెబా' బాలికల ప్రాథమిక పాఠశాలపై జరిగిన మిస్సైల్ దాడిలో 165 మంది విద్యార్థినులు మరణించారన్న వార్త ప్రపంచవ్యాప్తంగా విషాదం కలిగించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల శిథిలాల కింద చిక్కుకుని మరణించిన ఆ 165 మంది బాలికల సామూహిక అంత్యక్రియలకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను కేటీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. యుద్ధం వెనుక కారణాలు ఏవైనా, ఇలాంటి మారణహోమాలు మనిషి సృష్టించిన తీవ్ర విషాదాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధాలు రాబోయే తరాలకు కేవలం తీరని శోకాన్ని, వినాశనాన్ని మాత్రమే మిగుల్చుతాయని కేటీఆర్ హెచ్చరించారు.

# ఐఏఎస్, ఐపీఎస్‌లను బెదిరిస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

అన్నారు. పరిస్థితులను అర్థంచేసుకునే లోపే అధికారులను బదిలీ చేస్తున్నారని విమర్శించారు.జీహెచ్ఎంసీ కమిషనర్లు కూడా రెండున్నరేళ్లలో నలుగురు మారారని తెలిపారు. ముఖ్యమంత్రి లేదా మంత్రులకు నచ్చకపోతే ఆ అధికారులను వెంటనే బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. కొందరికి పోస్టింగులు ద

ఇచ్చి జాయిన్ చేసుకోవడం లేదని విమర్శించారు. త్వరలో కాంగ్రెస్ నేతల అవినీతిని, బినామీలను బయటపెడతామని హెచ్చరించారు.

# వచ్చే ఎన్నికల్లో 70కి పైగా సీట్లు కావాలి.. 21 ఇస్తే ఒప్పుకోం

ఏపీ రాజకీయాల్లో జనసేన తిరుపతి నియోజకవర్గ ఇంఛార్జి కిరణ్ రాయల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 70కి పైగా స్థానాల్లో పోటీ చేయడం ఖాయమని, కేవలం 21 సీట్లు ఇస్తామంటే అంగీకరించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికలతో పోలిస్తే జనసేన పార్టీ బలం గణనీయంగా పెరిగిందని, భవిష్యత్తులో సీట్ల సర్దుబాటులో ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన పరోక్షంగా మిత్రపక్షాలకు సూచించారు.జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వల్లే ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని కిరణ్ రాయల్ అన్నారు. "పవన్ కళ్యాణ్ లేకపోతే టీడీపీ ఎన్నికల బరిలో నిలబడటమే కష్టమయ్యేది. ఈ విషయంలో టీడీపీ నేతలకు నేను సవాల్ విసురుతున్నా" అని వ్యాఖ్యానించారు. రాజమండ్రి జైలులో చంద్రబాబు ఉన్నప్పుడు టీడీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉంటే, పవన్ ముందుకొచ్చి కూటమి ఏర్పాటు చేసి వారికి ధైర్యం ఇచ్చారని గుర్తుచేశారు. ఆ క్లిష్ట సమయంలో పవన్ చూపిన చొరవ వల్లే కూటమి విజయం సాధించిందని, ప్రజలు పవన్ కళ్యాణ్‌ను నమ్మి ఓట్లు వేశారని అభిప్రాయపడ్డారు.గత ఎన్నికల్లో తాను పోటీ చేయకపోవడానికి గల కారణాలను కూడా కిరణ్ రాయల్ వివరించారు. రాజకీయాల్లో ప్రజాబలంతో పాటు ఆర్థిక బలం కూడా అవసరమని, ఆ సమయంలో ఆర్థికంగా బలంగా లేకపోవడం వల్లే పోటీకి దూరంగా ఉన్నానని తెలిపారు. తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాస్, హరిప్రసాద్‌తో తనకు విభేదాలు ఉన్నాయనే ప్రచారాన్ని ఆయన ఖండించారు. తామంతా పవన్ నాయకత్వంలో

జనసేన పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.2024 ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిగా పోటీ చేశాయి. జనసేన పోటీ చేసిన 21 అసెంబ్లీ, 2 లోక్‌సభ స్థానాల్లోనూ 100 శాతం స్ట్రైక్ రేట్‌తో చారిత్రక విజయం సాధించింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్ మంత్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# రెండు కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన ఏపీ శాసనమండలి

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి రెండు కీలకమైన బిల్లులకు ఆమోదం తెలిపింది. అసైన్డ్ భూముల చట్ట సవరణ బిల్లు, ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల పునర్వ్యవస్థీకరణ బిల్లులను మండలి ఆమోదించింది.

**అసైన్డ్ భూముల సవరణ బిల్లు - 2026**

మంత్రి అనగాని సత్యప్రసాద్ సభలో వివరించిన ప్రకారం, ఈ సవరణ ద్వారా ప్రభుత్వం కేటాయిం చిన అసైన్డ్ భూములను క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు (సౌర, పవన విద్యుత్ వంటివి) లీజుకు ఇచ్చే అవకాశం లభిస్తుంది. బంజరు లేదా చౌడు భూములుగా ఉండి సాగుకు పనికిరాని అసైన్డ్ భూములకు ఈ లీజు ద్వారా భరోసా లభిస్తుంది. ఎకరాకు ఏడాదికి రూ. 31 వేల లీజు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతి రెండేళ్లకు లీజు మొత్తాన్ని 5 శాతం మేర పెంచుతూ చట్టంలో సవరణ చేశారు.అసైనీదారుల పూర్తి అనుమతితోనే భూములు తీసుకుంటారు. ట్రై-పార్టీ అగ్రిమెంట్ (త్రిపక్ష ఒప్పందం) ద్వారా లబ్ధిదారులకు పూర్తి రక్షణ కల్పిస్తారు. ఈ చట్టంతో రాష్ట్రంలో సుమారు రూ. 10 లక్షల కోట్ల విలువైన క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల 7.5 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

**గ్రామ, వార్డు సచివాలయాల సవరణ బిల్లు -2026**

గ్రామ వార్డు స్థాయి పాలనలో మార్పులు తీసుకువస్తూ ఈ బిల్లును ఆమోదించారు. ప్రస్తుతం ఉన్న గ్రామ, వార్డు సచివాలయాలను ఇకపై 'స్వర్ణ గ్రామం' మరియు 'స్వర్ణ వార్డు' సచివాలయాలుగా పిలుస్తారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం.

# రోజంతా బ్యాటరీ... ఆపిల్ నుంచి కొత్త మ్యాక్‌బుక్

**హైదరాబాద్ పెన్ పవర్:** టెక్ దిగ్గజం ఆపిల్ తన ల్యాప్‌టాప్ శ్రేణిలో మరో కొత్త ఉత్పత్తిని మార్కెట్లోకి విడుదల చేసింది. 'మ్యాక్‌బుక్ నియో' పేరుతో వచ్చిన ఈ సరికొత్త ల్యాప్‌టాప్‌ను బుధవారం లాంచ్ చేసింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత పనులను వేగంగా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ఏ18 ప్రో చిప్‌ను ఇందులో అమర్చారు. 13 అంగుళాల లిక్విడ్ రెటినా డిస్‌ప్లే దీని ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఒక్కసారి ఛార్జ్ చేస్తే 16 గంటల వరకు నిరంతరాయంగా రోజంతా పనిచేసే బ్యాటరీ లైఫ్‌ను ఈ మ్యాక్‌బుక్ నియో అందిస్తుంది. వీడియో కాల్స్ కోసం 1080జూ ఫేస్‌టైమ్ హెచ్‌డీ కెమెరా, స్పష్టమైన ఆడియో కోసం డ్యూయల్ మైక్స్, స్పేషియల్ ఆడియో సపోర్ట్‌తో డ్యూయల్ సైడ్-ఫైరింగ్ స్పీకర్లను పొందుపరిచారు. సౌకర్యవంతమైన టైపింగ్ కోసం మ్యాజిక్ కీబోర్డును, సులభమైన కంట్రోల్ కోసం పెద్ద మల్టీ-టచ్ ట్రాక్‌ప్యాడ్‌ను ఇచ్చారు.మ్యాక్‌బుక్ నియోను దృఢమైన అల్యూమినియం బాడీతో రూపొందించారు. ఇది బ్లష్, ఇండిగో, సిల్వర్, కొత్తగా సిట్రస్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. కేవలం 2.7 పౌండ్ల (సుమారు 1.22 కిలోలు) బరువుతో దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు.భారత్‌లో మ్యాక్‌బుక్ నియో ప్రారంభ ధర రూ. 69,900గా నిర్ణయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ. 59,900కే అందిస్తున్నారు. అమెరికాతో సహా 30 దేశాల్లో నేటి నుంచే ప్రీ-ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. మార్చి 11 నుంచి ఆపిల్ స్టోర్లు, అధీకృత విక్రయ కేంద్రాల్లో ఇది అందుబాటులోకి వస్తుంది.

టెక్ దిగ్గజం ఆపిల్ తన ల్యాప్‌టాప్ శ్రేణిలో మరో కొత్త ఉత్పత్తిని మార్కెట్లోకి విడుదల చేసింది. 'మ్యాక్‌బుక్ నియో' పేరుతో వచ్చిన ఈ సరికొత్త ల్యాప్‌టాప్‌ను బుధవారం లాంచ్ చేసింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత పనులను వేగంగా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ఏ18 ప్రో చిప్‌ను ఇందులో అమర్చారు. 13 అంగుళాల లిక్విడ్ రెటినా డిస్‌ప్లే దీని ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఒక్కసారి ఛార్జ్ చేస్తే 16 గంటల వరకు నిరంతరాయంగా రోజంతా పనిచేసే బ్యాటరీ లైఫ్‌ను ఈ మ్యాక్‌బుక్ నియో అందిస్తుంది. వీడియో కాల్స్ కోసం 1080జూ ఫేస్‌టైమ్ హెచ్‌డీ కెమెరా, స్పష్టమైన ఆడియో కోసం డ్యూయల్ మైక్స్, స్పేషియల్ ఆడియో సపోర్ట్‌తో డ్యూయల్ సైడ్-ఫైరింగ్ స్పీకర్లను పొందుపరిచారు. సౌకర్యవంతమైన టైపింగ్ కోసం మ్యాజిక్ కీబోర్డును, సులభమైన కంట్రోల్ కోసం పెద్ద మల్టీ-టచ్ ట్రాక్‌ప్యాడ్‌ను ఇచ్చారు.మ్యాక్‌బుక్ నియోను దృఢమైన అల్యూమినియం బాడీతో రూపొందించారు. ఇది బ్లష్, ఇండిగో, సిల్వర్, కొత్తగా సిట్రస్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది.

# అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం.. మార్చి 8న ఆవిష్కరణ!

- మొదటి పేజి తరువాయి

తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది ప్రభుత్వం. గాంధీ విగ్రహానికి ఎడమవైపు 8 అడుగుల ఎత్తులో అంబేద్కర్ విగ్రహం ఉండగా.. కుడివైపు అదే ఎత్తులో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఈ విగ్రహానికి ప్రభుత్వం దాదాపు రూ. 34 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాలకు ముందే అంటే మార్చి 8న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు తెలుస్తోంది . మార్చి 16 నుంచి బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి.

# వచ్చేవి జమిలీ ఎన్నికలే.. నేను పోటీచెయ్యను నెక్స్ నా కొడుకే

- మొదటి పేజి తరువాయి

ఔట్ లెట్ నుంచి పనులు చేస్తున్నారు. ఒకవైపు నిర్మాణం ఇంకో వైపు బ్లాస్టింగ్ విధానంలో పనులు కొనసాగుతుతున్నాయి. ఎలిమినేటి మాధవ రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్, గ్రావిటీ కెనాల్ ఎల్బీసీ, ఏఎంఆర్పీ కింద ఉన్న 3 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వచ్చు' అని గుత్తా అన్నారు.

# హైదరాబాద్ లో భారీగా కల్తీ నెయ్యి స్వాధీనం

- మొదటి పేజి తరువాయి

కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారంపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు సుమారు 460 కిలోల కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. దీని మార్కెట్ విలువ సుమారు రూ. 18.26 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రముఖ బ్రాండ్ల పేర్లతో ఉన్న నకిలీ ప్యాకెట్లు, సీళ్లు, ప్యాకేజింగ్ యంత్రాలను పోలీసులు సీజ్ చేశారు. వినియోగదారులను మోసం చేసేలా ఈ ప్యాకేజింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. తక్కువ ధరకు వచ్చే నూనెలు, రసాయనాలు కలిపి ఈ నెయ్యిని తయారు చేస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. స్వాధీనం చేసుకున్న నెయ్యి నమూనాలను ల్యాబ్ పరీక్షల కోసం పంపిన అధికారులు, నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

# టెహ్రాన్ సమీపంలో భూగర్భ స్థావరంలో అణుప్రాజెక్టును ధ్వంసం చేశాం

- మొదటి పేజి తరువాయి

అయినప్పటికీ ఆ దేశం అణు కార్యకలాపాలను ఆపలేదని అన్నారు. అణ్వాయుధాలను టెహ్రాన్ శివార్లలోని రహస్య భూగర్భ స్థావరంలో భద్రపరిచిందని, దీనికి సంబంధించి తమకు కచ్చితమైన సమాచారం రావడంతో ఆ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకున్నామని డెఫ్రిన్ వెల్లడించారు.

## మమ్మల్ని యుద్ధంలోకి లాగొద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:** మధ్యప్రాచ్యంలో ముదురుతున్న యుద్ధ సెగలు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య యుద్ధానికి దారితీస్తున్నాయి. మరో యుద్ధంలోకి తమ దేశాన్ని లాగవద్దని, శాంతిని కోరుకుంటున్నందుకు తమపై ఆంక్షలు విధించడం సరికాదని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలను తెంచుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, సాంచెజ్ ఈరోజు జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న వారి లక్ష్యాల్లో స్పష్టత లేదని, స్పెయిన్ ఎన్నడూ ఇలాంటి రక్తపాతాన్ని కోరుకోలేదని ఆయన పేర్కొన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు చేసిన తీర్మానాల తర్వాతే తాము ఈ డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. ఒక దేశం చేసే చట్టవిరుద్ధమైన చర్యలకు మరో దేశం అదే స్థాయిలో స్పందించడం వల్ల మానవాళికి భారీ విపత్తులు తప్పవని ఆయన హెచ్చరించారు.

# శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి...? 101 మంది గల్లంతు...?

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక సముద్ర జలాల్లో బుధవారం ఉదయం కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ కు చెందిన 'ఐరిస్ డెనా' (IRIS Dena) అనే యుద్ధనౌక (ఫ్రిగేట్) గాలే తీరానికి సమీపంలో మునిగిపోయింది. ఈ ప్రమాద సమయంలో శ్రీలంక నావికాదళం వేగంగా స్పందించి సుమారు 30 మంది సిబ్బందిని ప్రాణాలతో రక్షించింది. ఈ విషయాన్ని శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరత్ పార్లమెంట్‌లో అధికారికంగా ప్రకటించారు.బుధవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో ఈ నౌక నుంచి ప్రమాద సంకేతాలు అందాయని శ్రీలంక రక్షణ శాఖ తెలిపింది. వెంటనే అప్రమత్తమైన నావికాదళం రెండు నౌకలు, ఒక విమానాన్ని ఘటనా స్థలానికి పంపి సహాయక చర్యలు చేపట్టింది. రక్షించిన వారిలో గాయపడిన వారిని గాలేలోని నేషనల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, రక్షించిన వారిలో ఒకరు మరణించగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ నౌకలో మొత్తం 180 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది.అయితే, ప్రాణనష్టం విషయంలో భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. సముద్ర గర్భం నుంచి జరిగిన దాడి (సబ్‌మెరైన్ అటాక్) వల్లే నౌక మునిగిపోయిందని, దాదాపు 101 మంది ఆచూకీ గల్లంతైందని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. కానీ, శ్రీలంక నావికాదళ ప్రతినిధి మాత్రం భారీ సంఖ్యలో సిబ్బంది గల్లంతయ్యారన్న వార్తలను ఖండించారు. ప్రస్తుతం 32 మందిని రక్షించామని, మిగిలిన వివరాలు ఇప్పుడే చెప్పలేమని స్పష్టం చేశారు. ఈ దాడికి ఎవరు కారణమనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. యుద్ధం జరుగుతున్న వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## నాకు స్పీకర్ నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు

- నెక్లెస్ రోడ్డులో జరిగిన హోలీ వేడుకల్లో పాల్గొన్న దానం నాగేందర్
- స్పీకర్ నుంచి వ్యక్తిగతంగా నోటీసులు రాలేదని వెల్లడి
- రేపో ఎల్లుండో వెళ్లి తన అభిప్రాయాన్ని స్పీకర్‌కు తెలియజేస్తానన్న దానం నాగేందర్



**హైదరాబాద్ పెన్ పవర్:** అనర్హత పిటిషన్లకు సంబంధించి తనకు ఎలాంటి నోటీసులు అందలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. స్పీకర్ నుంచి తనకు వ్యక్తిగతంగా నోటీసులు అందలేదని వెల్లడించారు. నోటీసులు రేపు అందే అవకాశం ఉందని అన్నారు. అయితే రేపో ఎల్లుండో తాను నేరుగా తన అభిప్రాయాన్ని స్పీకర్‌కు తెలియజేస్తానని అన్నారు.నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన హోలీ వేడుకల్లో దానం నాగేందర్ పాల్గొన్నారు. కార్యకర్తలతో కలిసి ఆయన కాసేపు హోలీ ఆడారు. అనంతరం ఇంటికి వెళ్లే సమయంలో ఆయన అనర్హత పిటిషన్ అంశంపై మాట్లాడారు. తన చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చి యువతతో డ్యాన్స్ చేశానని తెలిపారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



అగ్నిప్రమాద స్థలాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్..



ప్రమాదంలో బూడిదైన వస్తువులు..

# బాచుపల్లి అగ్నిప్రమాదంలో... 22 షాపులు బూడిద



### వేసవి కాలం వచ్చింది..అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తం అవసరం..

- బాచుపల్లి ఘటనా స్థలాన్ని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్..
- ఫైర్ సేఫ్టీ పాటించకపోతే కఠిన చర్యలు: హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరిక..
- బాచుపల్లి ప్రధాన రహదారిలోని ప్రమాద ఘటనలో 22 ఫర్నీచర్ దుకాణాలు దగ్ధం..
- ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్, తెగిన కరెంట్ తీగలే కారణమా..? విచారణ షురూ.
- ఒక్కో షాపులో రూ.25 లక్షల వరకు నష్టం రెవెన్యూ విభాగం ద్వారా అంచనా..
- గ్యాస్ సిలిండర్ పేలుళ్లు పరిస్థితిని మరింత తీవ్రతరం చేశాయి..
- ఫైర్ సేఫ్టీ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు..
- హైడ్రాకు ప్రత్యేక అధికారం ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక..

**మేడ్చల్ జిల్లా బ్యూరో/దుండిగల్, పెన్ పవర్, మార్చి 4:** అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.. బాచుపల్లి ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో దగ్ధమైన ఫర్నీచర్ దుకాణాలను బుధవారం హైడ్రా కమిషనర్ పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర షార్టు సర్క్యూట్ జరిగి నిప్పు రవ్వలు రాలాయని, అవి ఫర్నీచర్ దుకాణాలకు అంటుకుని మంటలు ఎగిసి పడ్డాయని అక్కడి షాపుల నిర్వాహకులు తెలిపారు.. పైన కరెంటు తీగలు వెళ్తున్నాయని.. అందులో ఒక తీగ తెగిపడి మంటలు అంటుకున్నట్ట మరో దుకాణ దారుడు (బాధితుడు) నిర్వాహకుడు తెలిపాడు.. కారణాలు ఏదైనా వేసవి కాలం ఆరంభమైందని, అగ్ని ప్రమాదాల పట్ల ఎంతో అప్రమత్తత అవసరమని హైడ్రా కమిషనర్ సూచించారు..

### అగ్నిమాపక శాఖ భద్రతా నిబంధనలు పాటించాలి: హైడ్రా..

అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి.. ప్రమాదాలు చోటు చేసుకునే అంశాలపై అవగాహన ఉండడం.. వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవడం అందరూ అలవర్చుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.. అధికారులు తనిఖీలు చేసినంత మాత్రాన అగ్ని ప్రమాదాలను నియంత్రించలేమని.. అగ్నిమాపక శాఖ భద్రతా నిబంధనలు పాటించాలని.. ఈ విషయంపై ప్రతిఒక్కరూ భద్రతా ప్రమాణాలు పాటించినప్పుడే సాధ్యం అవుతుందని ఆయన అన్నారు.. ఎన్నో ఏళ్లు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు ఒక్క ప్రమాదంతో బూడిదౌతున్నాయి. ఇక్కడ కూడా ఒక్కో దుకాణంలో రూ. 25 లక్షలకు పైగా ఫర్నీచర్ ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.. ఇది తీరని నష్టమని హైడ్రా కమిషనర్ చెప్పారు. 22 షాపులకు పైగా బూడిదయ్యాయి. నష్టపరిహారం రెవెన్యూ విభాగం చూస్తుందని.. ఇకపై ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. తనిఖీలతో పాటు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పట్టించుకోని వారిపై చర్యలు తీసుకునే అధికారం కూడా హైడ్రాకు కట్టపెట్టాలని ప్రభుత్వానికి నివేదించామని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు.. అలాగే కొంతమంది ఇక్కడరె నివాసం ఉంటున్నారని గ్యాస్ సిలిండర్లు కూడా పేలాయని అన్నారు.. ఇవన్నీ ప్రమాదానికి కారణాలే అని పేర్కొన్నారు..






01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## డప్పు కొట్టి, డ్యాన్సు చేసి.. జగ్గారెడ్డి హోలీ సంబరాలు



- సంగారెడ్డిలో హోలీ సంబరాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి
- స్నేహితులు, కార్యకర్తలతో కలిసి పాల్గొన్న జగ్గారెడ్డి
- రామమందిరంలో ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తన స్నేహితులతో కలిసి సరదాగా స్టెప్పులు వేశారు. సంగారెడ్డిలో జరిగిన హోలీ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో స్నేహితులు, కార్యకర్తలతో ఆయన పాల్గొన్నారు. కళాకారులతో కలిసి డప్పు కొట్టారు. ఆ తర్వాత స్నేహితులతో కలిసి డ్యాన్సు చేశారు.

-4 లో

## మంచి ప్రాక్టీస్ తో ఫ్యాక్టరీల్లో జీరో యాక్సిడెంట్ సాధించవచ్చు

### వర్కర్స్ హ్యాపీగా ఉంటేనే బెస్ట్ రిజల్ట్

### టెక్నాలజీకల్ చేంజెస్ అడాప్ట్ చేసుకోవాలె

### మంత్రి వివేక్ వెంకటస్వామి

-4 లో



# బాల్కా సుమన్ విడుదల



**అదిలాబాద్, మార్చి 4 పెన్ పవర్:** క్యాతనపల్లిలో మంత్రిపై దాడి కేసులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ బుధవారం జైలు నుంచి విడుదలయ్యారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల వేళ చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు, ఘర్షణలో ఆయన హస్తం ఉందని పోలీసులు అరెస్టు చేశారు. ఇది ఆదిలాబాద్ జిల్లాలో సంచలనంగా మారింది. క్యాతనపల్లి మున్సిపాలిటీ పీఠాన్ని దక్కించుకునే క్రమంలో రాజకీయ పార్టీల మధ్య తలెత్తిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ ఘటనలో బాల్క సుమన్ ప్రత్యక్షంగా ప్రమేయం కలిగి ఉన్నారని శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని ఆరోపిస్తూ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే గత నెల 18వ తేదీన ఆయనను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్ విధించింది. అప్పటి నుంచి ఆయన ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్నారు. బాల్క సుమన్ అరెస్టు అక్రమమని, కనీస నిబంధనలు పాటించలేదని ఆయన తరుపు న్యాయవాదులు కోర్టులో గట్టిగా వాదించారు. ముఖ్యంగా అరెస్టు చేసే సమయంలో సుప్రీంకోర్టు జారీ చేసిన విధి విధానాలను పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. మరోవైపు కేసు తదుపరి విచార కోసం సుమన్‌ను తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు మంచిర్యాల కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఇరు పక్షాల వాదనలను విన్న న్యాయస్థానం పోలీసుల కస్టడీ పిటిష్‌ను తోసిపుచ్చింది. సోమవారం నాడు ఈ కేసులో కీలక మలుపు తిరిగింది. జిల్లా సెషన్స్ జడ్జి ఏ వీరయ్య బాల్క సుమన్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు ఇచ్చారు. పాతికవేల పూచీకత్తుతో పాటు ఇద్దరు వ్యక్తుల ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించారు. అయితే ఈ బెయిల్‌తో పాటు కోర్టు కొన్ని కఠిన నిబంధనలను విధించింది. ఈ కేసులో ఏ 1, ఏ2 ఏ4, ఏ8 నిందితులుగా ఉన్న వారు ప్రతి ఆదివారం తప్పనిసరిగా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో హాజరైన సంతకం చేయాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధర్యంలో రాష్ట్రమంతటా పరిస్థితి దారుణంగా తయారైందని మాజీ ఎమ్మెల్యే బాల్క దుయ్యబట్టారు. క్యాతన్ పల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్, ఆయన కొడుకు ఎంపీ వంశీకృష్ణ 14 మంది కౌన్సిలర్లను కొనే ప్రయత్నం చేశారని అన్నారు. బ్లాంక్ చెక్కులు ఇచ్చి ప్రలోభ పెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు ఆఫర్లు చేసారని.. అయినా తమ వాళ్ళు తలొగ్గలేదన్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కాక మంత్రి, ఎంపీ ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లకు మందు తాగించి వాళ్ళతో తమ మహిళా కౌన్సిలర్ల మీద దౌర్జన్యం చేశారని మండిపడ్డారు. ప్రజా తీర్పును మంత్రి వివేక్ గౌరవించడం లేదని విమర్శించారు. ఇక అక్కడ గొడవ సందర్భంగా రాళ్లు విసిరినోళ్ళ మీద కేసులు బుక్ కాలేదని... మా 25 మంది మీద కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ కాన్వాయ్ ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. జైలు లోపల కూడా తమను ఇబ్బంది పెట్టారని వెల్లడించారు. కొడుకు పుట్టిన రోజు టైమ్ లో ఇంట్లో లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని తెలిపారు. అందర్నీ కలుపుకుపోయాం తప్ప.. కక్ష సాధింపు చేయలేదని స్పష్టం చేశారు. నన్ను జైలులో పెట్టారు కదా.. ఇప్పుడు కడుపు మంట తగ్గిందని అనుకుంటున్నా అని అన్నారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఇప్పటికైనా సవ్యంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**జైలు వద్ద కోలాహలం**

బాల్క సుమన్ విడుదలవుతున్నారన్న సమాచారంతో ఆదిలాబాద్ జిల్లా జైలు వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో మోహించారు. జైలు గేటు నుంచి ఆయన బయటకు రాగానే శ్రేణులు నినాదాలతో హోరెత్తించాయి. విడుదల అనంతరం జైలు ముందే ఆయన కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టేందుకు ఇలాంటి కేసులు పెట్టారని అన్నారు. అనంతం ఆయన అనుచరులతో కలిసి క్యాతనపల్లికి ర్యాలీగా బయల్దేరారు.

**నా కొడుకు పుట్టిన రోజనజైల్లోనే ఉన్నా**

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మునిసిపల్ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుకు సంబంధించి సుమన్ తో పాటు మరికొందరు నేతలు కూడా జైలు నుంచి బయటకు వచ్చారు. జైలు నుంచి విడుదలైన అనంతరం సుమన్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు తమపై లాఠీచార్జ్ చేయడమే కాకుండా, రివర్స్‌లో అక్రమ కేసులు పెట్టారని ఆయన మండిపడ్డారు. కేవలం 7 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్, మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. జిల్లా అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా, మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యక్తిగత సిబ్బందిలా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తాము ఎన్నడూ కక్ష సాధింపు చర్యలకు దిగలేదని, తనను జైలులో పెట్టడం ద్వారా అధికార పార్టీ నాయకుల కడుపు మంట తగ్గిందని అన్నారు. హోలీ పండుగ మరియు తన కుమారుడి పుట్టినరోజున కూడా తనను దూరంగా ఉంచారని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు

# బహ్రెయిన్ లో చిక్కుకుపోయిన 150 మంది

**హైదరాబాద్, మార్చి 4 పెన్ పవర్:** గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బహ్రెయిన్‌లో సుమారు 150 మంది తెలుగువారు చిక్కుకుపోయారు. ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో విమాన సర్వీసులు రద్దు కావడమే ఇందుకు కారణం. బాధితుల్లో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు సభ్యుల బృందం కూడా ఉంది. తమను స్వదేశానికి తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. హైదరాబాద్ రాంనగర్‌కు చెందిన ఏడుగురు సభ్యుల బృందం గడిచిన ఫిబ్రవరి 24న బహ్రెయిన్ రాజధాని మనామాకు వెళ్లింది. వీరిలో కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకుడు గోనె సాల్మన్ రాజు కూడా ఉన్నారు. వీరంతా ఫిబ్రవరి 28న తిరిగి భారత్‌కు రావాల్సి ఉండగా, ఎయిర్‌పోర్టులో ఉన్న సమయంలోనే విమానాలను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. దీంతో తమతో పాటు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది వరకు ఎయిర్‌పోర్టులోనే చిక్కుకున్నట్లు సాల్మన్ రాజు తెలిపారు. వారంతా ప్రస్తుతం ఎయిర్‌పోర్టుకు సమీపంలోని తెలుగు ప్రవాసీయుల ఇళ్లల్లో ఆశ్రయం పొందుతున్నట్లు పేర్కొన్నారు. తమను సురక్షితంగా భారత్‌కు తరలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించడం లేదని సాల్మన్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు.

# మే 11 నుంచి జనగణన...

**హైదరాబాద్, మార్చి 4 పెన్ పవర్:** దేశవ్యాప్తంగా జరగనున్న జాతీయ జనాభా గణన (జనగణన) ప్రక్రియలో భాగంగా తెలంగాణలో తొలి దశ పనులను పకడ్బందీగా నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు, ఇతర కట్టడాల వివరాలను నమోదు చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. ఈసారి జనగణన ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పు చోటుచేసుకోనుంది. దేశ చరిత్రలోనే మొదటిసారి జనాభా లెక్కలను పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రత్యేక మొబైల్ అప్లికేషన్ ద్వారా నేరుగా స్మార్ట్‌ఫోన్లలో వివరాలను నమోదు చేస్తారు. ఇది సమాచార సేకరణలో వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంచుతుంది. అంతేకాకుండా, పౌరులు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేందుకు "సెల్ఫ్-ఎన్యూమరేషన్" పేరిట ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ మే 11కి 15 రోజుల ముందు నుంచే ప్రారంభమవుతుందని సీఎస్ రామకృష్ణారావు తెలిపారు.

**పక్కాగా వివరాలు నమోదు చేయాలి: సీఎస్**

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణలో ఎటువంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని సీఎస్ స్పష్టంగా ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, మండలం భౌగోళిక సరిహద్దులను కచ్చితంగా నిర్ధారించుకోవాలని సూచించారు. మారుమూల గిరిజన తండాలు, పట్టణాల్లోని మురికివాడలతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క కట్టడాన్ని కూడా వదిలిపెట్టకుండా జాబితాలో చేర్చాలని ఆయన స్పష్టం చేశారు. ఈ బృహత్కార్యక్రమం విజయవంతం కావడానికి గణకులు, పర్యవేక్షకులకు నాణ్యమైన శిక్షణ ఇవ్వాలని కలెక్టర్లకు సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జనాభా లెక్కల విభాగం రాష్ట్ర సంచాలకురాలు భారతీ హోళికెరి, డేటా సేకరణ కోసం రూపొందించిన మొబైల్ యాప్ పనితీరు, సమాచార భద్రతకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రతి ఒక్కరి బాధ్యతలను ఆమె విశదీకరించారు. ఈ డిజిటల్ విధానం వల్ల సమాచార సేకరణలో పారదర్శకత పెరగడంతో పాటు, భవిష్యత్ ప్రభుత్వ పథకాల రూపకల్పనకు కచ్చితమైన గణాంకాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# టెన్త్ హాల్ టిక్కెట్లు విడుదల



**హైదరాబాద్, మార్చి 4 పెన్ పవర్:** రాష్ట్ర వ్యాప్తంగా 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు గురువారం విడుదల కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. అయితే ఈ సారి మూడు రకాలుగా పదో తరగతి హాల్‌టికెట్లు విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తుంది. విద్యార్థులు ఈ మూడింటిలో ఏ విధంగానైనా తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముందుగా సెకండరీ బోర్డు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లను విడుదల చేస్తారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల వాట్సాప్ నెంబర్‌కు సైతం పదో తరగతి హాల్ టికెట్లను పంపిస్తారు. మరోవైపు ప్రింటెడ్ హాల్‌టికెట్లను కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని స్కూళ్లకు చేరవేస్తారు. ఈ విధంగా విద్యార్థులు హాల్‌టికెట్లను మూడు రకాలుగా పొందొచ్చన్నమాట. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ఫీజు బకాయిలు పేరిట విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నట్లు బోర్డుకు యేటా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. లేదంటే వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కుదరని పక్షంలో పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించి వారి నుంచి నేరుగా పొందవచ్చు. విద్యార్థులు ఏ హాల్‌టికెట్‌తో పరీక్ష కేంద్రాలకు వచ్చినా పరీక్షలకు అనుమతిస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. కాగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,28,248 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ రాష్ట్రంలో ఇప్పటికే పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు విడుదలయ్యాయి. ఆ రాష్ట్రంలో ఈ పరీక్షలు మార్చి 16 నుంచి మొదలవనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 16 నుంచే పరీక్షలు మొదలవనున్నాయి.

## మంచి ప్రాక్టీస్ తో ఫ్యాక్టరీల్లో జీరో యాక్సిడెంట్ సాధించవచ్చు:

**హైదరాబాద్ పెన్ పవర్:** మంచి ప్రాక్టీస్ తో ఫ్యాక్టరీల్లో జీరో యాక్సిడెంట్ సాధించవచ్చని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంక టస్వామి అన్నారు. కార్మికులు సంతోషంగా ఉంటేనే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం.. డైరెక్టర్ అఫ్ ఫ్యాక్ట రీస్, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతిలో జరిగిన 55వ జాతీయ భద్రతా దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. సేఫ్టీ అనేది ముఖ్యమైందని, సేఫ్టీ ఉంటేనే ఉత్పత్తి బాగుంటుందని పేర్కొన్నారు. ఒకప్పుడు చాలా వరకు యాజమాన్యాలు ఖర్చు పెరుగుతుందని వెనుకడుగు వేసేవని, ఇప్పుడు ఆ ధోరణి మారిందన్నారు.. ప్రతి మేనేజ్ మెంట్ సేఫ్టీ మీద ఇన్వెస్ట్ మెంట్ చేయాల న్నారు. సాంకేతికంగానూ చాలా మార్పులు వచ్చాయని, ఫ్యాక్టరీలు వాటిని అడాప్ట్ చేసుకోవాలని సూచించారు. సిగాచి ఫ్యాక్టరీ విషయంలో చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకొని ఉంటే అంత పెద్ద ప్రమాదం జరిగేది కాదన్నారు. రాష్ట్రం త్రీ ట్రిలియన్ ఎకానమీ కావాలని సీఎం రేవంత్రెడ్డి చెబుతు న్నారని, ఇందులో పరిశ్రమలదే మేజర్ పార్ట్ అని చెప్పారు. పరిశ్రమల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాని ఆదేశించారు.

## డప్పు కొట్టి, డ్యాన్సు చేసి.. జగ్గారెడ్డి హోలీ సంబరాలు

-3 పేజి తరువాయి

స్థానిక రామమందిరం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఈ హోలీ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆయన చిన్నారులతో పాటు ఆయన చిన్ననాటి మిత్రులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. సంగారెడ్డి బైపాస్‌లో ఈ హోలీ వేడుకలు నిర్వహించారు. మరోవైపు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బోయినపల్లిలోని తన నివాసంలో హోలీ వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. తన చిన్ననాటి నుంచి హోలీ వేడుకలను ఎంతో ఆనందంగా జరుపుకుంటున్నానని మల్లారెడ్డి తెలిపారు.

## పరకాల నుంచే కొండా సురేఖ పోటీ చేస్తారు: కొండా మురళి

**పరకాల తమకు కంచుకోట అన్న కొండా మురళి**

**తన కుమార్తె సుస్మిత తనకంటే ధైర్యవంతురాలని కితాబు**

**కార్యకర్తల రక్షణే ధ్యేయంగా ఆమె పని చేస్తోందని వెల్లడి**



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. గీసుగొండ మండలం కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరలో పాల్గొన్న ఆయన, పరకాల నియోజకవర్గంపై తన పట్టును చాటుకుంటూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పరకాల నియోజకవర్గం తమకు కంచుకోట అని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొండా సురేఖ పరకాల నుంచే పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. పరకాల రాజకీయాల్లో తమ కుటుంబానిదే పైచేయి అని ధీమా వ్యక్తం చేశారు. తన కుమార్తె కొండా సుస్మిత తనకన్నా చాలా ధైర్యవంతురాలని, ఎవరినైనా ఎదిరించే సత్తా ఆమెకు ఉందని కొనియాడారు. పార్టీ కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే సుస్మిత ఊరుకోదని, వారి కోసం ఎంతటి వారినైనా ఎదుర్కొంటుందని చెప్పారు. కార్యకర్తల రక్షణే ధ్యేయంగా ఆమె పని చేస్తోందని మురళి పేర్కొన్నారు.

## రాహుల్ గాంధీకి మంద కృష్ణ మాదిగ లేఖ

**మాదిగ సామాజిక వర్గాన్ని కాంగ్రెస్ అణచివేస్తోందన్న మంద కృష్ణ**

**మాదిగలకు రాజ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్**

**సీడబ్ల్యూసీలో ఒక్క మాదిగ కూడా లేరని విమర్శ**



**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజిక వర్గాన్ని రాజకీయంగా అణచివేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. మాదిగలకు రాజ్యసభ సీటు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు చెందిన మాదిగ సామాజిక వర్గ నేతకు కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించాలని మంద కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా మాదిగలకు టికెట్లు ఇవ్వలేదని, ఫలితంగా ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణ నుండి మాదిగల గొంతు వినిపించే వారే లేకుండా పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఒక్క మాదిగ కూడా లేకపోవడం వారి పట్ల పార్టీకి ఉన్న వివక్షకు నిదర్శనమని మంద కృష్ణ విమర్శించారు. మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప, పదవుల్లో తగిన వాటా ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు.

# ఢిల్లీ కి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిష్టానం పిలుపుతో ఢిల్లీ బయలుదేరారు. రెండు రాజ్యసభ సీట్లు కోసం అభ్యర్థుల ఫైనల్ చేసే అవకాశం వుందని సమాచారం . ఇప్పటికే అభిషేక్ సింగ్వి పేరు ఖరారు అయింది. అయన బుధవారం హైదరాబాద్ చేరుకున్నారు. మరో సీట్ కోసం టీపీసీసీ నేతల మధ్య పోటీ ఏర్పడింది. ఇప్పటికే 16 మంది తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. రెండో అభ్యర్థి విషయంలో ఇంకా కొలిక్కి రాకపోవడంతో సీఎంను అధిష్టానం ఢిల్లీకి పిలిపించింది. మరో వైపు రాజ్యసభ సీటు పై ఆశావహుల అసంతృప్తి ఎక్కువయింది. మాదిగ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలి అంటూ రాహుల్ గాంధీ కి మందకృష్ణ మాదిగ బహిరంగ లేఖ రాసారు. బీసీ సామాజికవర్గం నుండి రేసులో వీహెచ్, ఇరవత్రిఅనిల్, మధు యాష్కీ, వినయ్ కుమార్ గౌడ్, నేరెళ్ల శారద వున్నారు. ఎస్సీ సామాజిక వర్గం నుండి ,సంపత్, దొమ్మాటి సాంబయ్య వున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుండి రేసులో వేం నరేందర్ రెడ్డి,చిన్నా రెడ్డి,రోహిన్ రెడ్డి,జీవన్ రెడ్డి,వంశీ చందర్ రెడ్డి,కోదండరెడ్డి వున్నారు. ఎస్టీ నుండి రేసులోబెల్లయ్య నాయక్, మైనార్టీ నుండి రేసులో అజ్జాతుల్లా హుసేన్, షబ్బీర్ అలీ వున్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మల్లారెడ్డి ఇంటిదగ్గర హోలీ సంబరాలు

**సికింద్రాబాద్. పెన్ పవర్:** బోయిన్ పల్లిలోని మాజీ మంత్రి మల్లరెడ్డి ఇంటివద్ద హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రజలందరికి హోలీ శుభాకంక్షాలు తెలిపారు. అన్ని హోలీలకంటే ఈ హోలీ నాకు ప్రత్యేకమైనది ఎందుకంటే, ఈ నెల 19న తన 50వ వివాహ వార్షికోత్సవం ఘనంగా జరుపనున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా సుఖసంతోషాలు, బోగబాగ్యాలతో తులతూగలని, గల్ఫ్ వార్ కూడా తొందరగా ముగియాలని భగవంతుడ్ని వేడుకుంటున్నట్లు అయన వెల్లడించారు,.

## జడ్చర్ల ఘటనలో డాక్టర్లలపై వేటు తప్పు పట్టిన డాక్టర్ల సంఘం

**హైదరాబాద్ పెన్ పవర్:** జడ్చర్ల ఘటనలో డాక్టర్లను సస్పెండ్ చేయడాన్ని డాక్టర్ల సంఘం తప్పు పట్టింది. మృతదేహాన్ని కుక్కలు పీక్కుతున్న ఘటనకు బాధ్యులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హాస్పిటల్ సూపరింటెండెంట్, ఆర్ఎమ్వో హరినాథ్, మార్చురీ సపోర్టింగ్ స్టాఫ్ ను హెల్త్ డిపార్ట్మెంట్ సస్పెండ్ చేసింది. మార్చురీ లో సదుపాయాలు లేకపోవడం వల్లే ఈ ఘటన జరిగింది. ఫ్రీజర్, మార్చురీ టేబుల్, ఫ్రీజర్ లాకర్ కావాలని గత ఏడాది లెటర్ సూపరింటెండ్ రాసారు. పరికరాలు అందించడంలో డిపార్ట్మెంట్ వైఫల్యానికి డాక్టర్లను బాధ్యులను చేస్తున్నారని డాక్టర్ల సంఘం తప్పు పట్టింది. వ్యవస్థ లోపాలని డాక్టర్లను సస్పెండ్ చేయడం కరెక్ట్ కాదని వ్యాఖ్యానించింది.

## చెట్టేరుకుంట చెరువలో వ్యక్తి మృతదేహం లభ్యం

**మేడ్చల్: పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పిఎస్ సమీపంలోని కిషోర్(40) అనే వ్యక్తి మృతదేహం లభ్యం అయింది. మృతుడు ఘట్కేసర్ చెందిన కిషోర్ కొండాపూర్ సమీపంలోని 'అమ్మానాన్న అనాధ ఆశ్రమం'లో సూపర్వైజర్ పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఘట్కేసర్ కేంద్రంలోని ఇంటిని అమ్ముకొని కుటుంబ సభ్యులు వెళ్లిపోగా, నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఆశ్రమంలోనే కిషోర్ ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రికి వెళ్తానని చెప్పి వెళ్లిన కిషోర్ ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న చెట్టేరుకుంట చెరువులో బుధవారం శవమై తేలాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వానికి విజన్ లేదు

### బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్ పెన్ పవర్:** గత రెండేళ్లలో 60 సార్లుఐఏఎస్ అధికారుల ల బదిలీలు జరిగాయి. పాలన మీద కాంగ్రెస్ కు పట్టు లేదు. కలెక్టర్లు ప్రజల్లో తిరగడం లేదని సీఎం మాటలతో అర్థం అవుతుంది. సీఎం మాట ఎవ్వరూ వినడం లేదని తెలుస్తుందని బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. రాజ్య సభ ఎన్నికల ద్వారా బీ ఆర్ ఎస్ కు మంచి అవకాశం వచ్చింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలు రాజ్య సభ ఎన్నికలో ఎవ్వరికీ మద్దతు తెలుపుతారో బయటపడుతుంది. రాష్ట్రంలో బీ ఆర్ ఎస్ కాంగ్రెస్ ఆటను ప్రజలు గమనిస్తున్నారు. అధికారులకు , మంత్రులకు ఎమ్మెల్యేలకు జనంలో తిరిగే మొఖం లేదు, జీహెచ్ఎంసి విస్తరణ చేసి తర్వాత హైద్రాబాద్ ను మూడు ముక్కలు చేసింది, ప్రభుత్వానికి విజన్ లేదని అర్థం అవుతుందని అన్నారు.

## హోలీ సంబురాలలో పాల్గొన్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**హైదరాబాద్ పెన్ పవర్:** బోయిన్ పల్లి లోని మల్లారెడ్డి గార్డెన్స్ లో మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన హోలీ సంబురాలలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సంబురాలలో పాల్గొన్న అందరికీ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు తెలిపి

చెడు పై మంచి గెలుపునకు సూచికగా 'కామ దహనం'తో ప్రారంభమయ్యే హోలీ పండుగ మనందరి జీవితాల్లో కొత్త రంగులు అద్దుతుందని అన్నారు.

హోలీ పండుగ సందర్భంగా బంధుమిత్రులతో, సాటివారితో ఆనందం పంచుకుని అందరూ సుఖసంతోషాలతో ఉండడం ఆనందంగా ఉందని, మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ సంస్థ ఇలాంటి మంచి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు.

అలాగే తుకారాం గేట్ లోని ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన హోలీ వేడుకలలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పాల్గొని అందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## బీఆఆర్ఎస్ నేతలపై దాడులు సరికావు

**సూర్యాపేట: పెన్ పవర్:** సూర్యాపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకుల వరుస దాడులను మాజీ ఎంపీ, సూర్యాపేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ ఖండించారు. జిల్లా కేద్రంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో అయన మాట్లాడారు.

కాంగ్రెస్ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అరాచక శక్తులను ప్రోత్సాహించడం సరికాదు. రెండేళ్ల పాలనలో అరాచకాలు తప్ప అభివృద్ధి శూన్యం. బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేస్తామంటే సహించేది లేదు. మొన్న 24, 26, నిన్న 9 వ వార్డు.. ఇలా వరుస దాడులకు పాల్పడటం సరికాదు. స్థానిక మంత్రులు ఆ పార్టీ నాయకులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలి. పోలీసులు సరైన విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దాడులు ఆపకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని అన్నారు.

# హైదరాబాద్ లో ఖమేనీ రోడ్

**హైదరాబాద్, మార్చి 4,పెన్ పవర్:**

ఇప్పుడు ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా యుద్ధం గురించే చర్చ. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతమవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ఒక పేరు మాత్రం పెను సంచలనం సృష్టిస్తోంది. అదే ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ పేరు. ఇటీవలి దాడుల్లో ఖమేనీ మృతి చెందడంతో యుద్ధం మరింత తారాస్థాయికి చేరుకుంది. ఇక్కడ మరింత ఆశ్చర్యపోయే విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఖమేనీ పేరు మీద హైదరాబాద్ మహా నగరంలో ఏకంగా ఓ రోడ్డే ఉందట. ఏంటి.. వినడానికి చాలా వింతగా ఉంది కదూ..!ఇరాన్ దాడుల నేపథ్యంలో అల్లకల్లోలమైన ప్రపంచ దేశాలను ఇప్పుడీ విషయం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భాగ్యనగరంలో 'ఖమేనీ' రోడ్డు ఉందన్న విషయం తాజా దాడుల నేపథ్యంలో కొత్తగా బయటికి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ మరణ వార్త ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుండగా.. మరోవైపు, హైదరాబాద్ నగరంలో ఖమేనీ పేరుతో ఒక రోడ్డు ఉందన్న విషయం సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. అది కూడా నగరంలోనే ప్రముఖంగా వినిపించే బంజారాహిల్స్‌లో ఈ పేరుతో రోడ్డు ఉండటం విశేషం. ఇక్కడే మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. అయతొల్లా అలీ ఖమేనీ పేరు మీద నగరంలో రోడ్డు ఉందన్న విషయం వైరల్ అవుతున్న నేపథ్యంలో ప్రస్తుతం మరణించిన నేత పేరుతో కాకుండా ఇరాన్ తొలి సుప్రీం లీడర్ జ్ఞాపకార్థమే ఈ రోడ్డుకు ఈ పేరు పెట్టారని అసలు విషయం బయటపడింది. ఈ విషయం మాకు ఇప్పటివరకూ తెలియదని, ఖమేనీ మరణం తర్వాతే ఇలాంటి ఆశ్చర్యం కలిగించే కొత్త విషయాలు బయటికి వస్తున్నాయని నెటిజన్లు అంటున్నారు.హైదరాబాద్ నగరంలో ఈ రోడ్డు ఎక్కడ ఉందనే కదా ఇప్పుడు మీ అనుమానం..! జీవీకే వన్ మాల్ ఎదురుగా ఉండే బంజారాహిల్స్ రోడ్డు నెం.7ని అధికారికంగా 'ఇమామ్ ఖమేనీ రోడ్' అని పిలుస్తారు. ఇదే ప్రాంతంలో ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం



ఉండటంతో అప్పటి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఈ రోడ్డుకు ఈ పేరును పెట్టినట్లు సమాచారం. కుతుబ్ షాహీల కాలం నుంచి హైదరాబాద్, ఇరాన్ దేశాల మధ్య ఉన్న ధృడమైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలకు గుర్తుగా అప్పటి అధికారులు ఈ నిర్ణయం తీసుకోవడమే కాకుండా అప్పటి ప్రభుత్వం ఈ పేరును అధికారికంగా రికార్డుల్లో కూడా చేర్చింది.ఇరాన్ మొదటి సుప్రీం లీడర్ రుహొల్లా ఖమేనీ పూర్వీకులకు మన దేశంతో విడదీయలేని సంబంధాలు ఉండేవి. ఖమేనీ తాతలు ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకి జిల్లాకు చెందిన కింతూరులో పుట్టారని చరిత్రకారులు చెబుతున్న మాట. 19వ శతాబ్దంలోనే ఖమేనీ పూర్వీకులు ఇరాన్‌కు వలస వెళ్లి అక్కడే రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడంతో ఈ సంబంధం ఇలా కొనసాగింది. అయితే.. తాజా దాడుల ఘటనలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి చెందాడు. డౌన్‌టౌన్‌లోని ఖమేనీ కాంపౌండ్ లక్ష్యంగా ఫిబ్రవరి 28న ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఖమేనీ ఇరాన్ మరింత అట్టుడికిపోయింది. తమ దేశంపై దాడి చేసిన ఇజ్రాయెల్, అమెరికాలను వదిలే ప్రసక్తే లేదని ప్రకటన కూడా విడుదల చేసింది. ఈ క్రమంలో శత్రుదేశాల మధ్య పోరు మరింత తీవ్ర రూపం దాల్చింది. ఇదంతా ఇలా ఉండగా.. ఖమేనీ మరణం తర్వాత హైదరాబాద్ నగరంలో ఓ రోడ్డు ఉందనే విషయాన్ని ఓ నెటిజన్ తన ఫేస్‌బుక్ పేజీ ద్వారా వెల్లడించడంతో ఇక టి నుంచి సోషల్ మీడియాలో ఈ వార్త తెగ వైరల్ అవుతోంది.

# తమ్మినేని అభిశంసన... రాజకీయ పార్టీలో చర్చలు

**హైదరాబాద్, మార్చి 4, పెన్ పవర్:**

సీపీఎం సీనియర్ నాయకుడు, తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను పార్టీ కేంద్ర కమిటీ అభిశంసించడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసం పోరాడిన ఒక కీలక నేతపై ఇటువంటి క్రమశిక్షణ చర్య తీసుకోవడం వెనుక అనేక బలమైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది.కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగం ప్రకారం అభిశంసన అనేది ఒక తీవ్రమైన క్రమశిక్షణ చర్య. పార్టీ నిబంధనలను ఉల్లంఘించినా లేదా పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే పనులు చేసినా ఈ చర్య తీసుకుంటారు. ఇది బహిష్కరణ లేదా సస్పెన్షన్ కంటే తక్కువ స్థాయిదైనప్పటికీ, ఒక నాయకుడి రాజకీయ జీవితంలో ఇది ఒక మచ్చగా పరిగణిస్తారు. తప్పును అధికారికంగా ఎత్తిచూపుతూ, భవిష్యత్తులో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడమే దీని ఉద్దేశం.తమ్మినేని వీరభద్రంపై కేంద్ర కమిటీ ప్రధానంగా రాజకీయ వ్యూహకర్తగా విఫలమయ్యారనే ఆరోపణలు చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా ఆయన తీసుకున్న కొన్ని నిర్ణయాలు పార్టీ అస్తిత్వానికే ముప్పు తెచ్చాయని హైకమాండ్ భావించింది. ముఖ్యంగా బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ప్రయోగం ఘోరంగా విఫలమవ్వడం, దాని వల్ల పార్టీకి రావాల్సిన ఓట్లు కూడా చీలిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త రాష్ట్ర కార్యదర్శి ఎన్నిక సమయంలో తమ్మినేని తన వర్గానికి అనుకూలంగా లాబీయింగ్‌కు పాల్పడ్డారని, తెరవెనుక మంత్రాంగాలు నడిపారని పార్టీ గుర్తించింది. ఇది సీపీఎం పద్ధతులకు విరుద్ధమని కేంద్ర కమిటీ స్పష్టం చేసింది. తనపై వచ్చిన ఆరోపణలకు తమ్మినేని ఇచ్చిన వివరణలో ఎక్కడా ఆత్మవిమర్శ కనిపించలేదని, చేసిన తప్పులను సమర్థించుకోవడానికే ప్రయత్నించారని పార్టీ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసింది.తమ్మినేని నాయకుడిగా ఉన్నప్పుడు తీవ్రమైన నిర్మాణ అనైక్యత చోటు చోటు చేసుకుందని.. ముఠా తత్వం ఏర్పడిందని.. ప్రమాణాల ఉల్లంఘన కొనసాగుతోందని.. అస్తిత్వవాద రాజకీయాల ప్రభావం నడుస్తుందని.. తప్పుడు రాజకీయ దృక్పథం.. ఫెడరల్ ధోరణులు.. పార్టీ విలువలు తగ్గిపోవడం ఇటువంటివి చోటు చేసుకుంటున్నట్టు అభిశంసన లేఖ లో కేంద్ర కమిటీ ప్రస్తావించినట్టు తెలుస్తోంది..కేంద్ర కమిటీకి తమ్మినేని వీరభద్రం.. రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉన్న స్కైలాబ్ బాబు.. ప్రసాద్ ఇచ్చిన వివరణలు సరిగా లేవని పార్టీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే పేర్కొంది. అందులో కనీసమైన ఆత్మ విమర్శ కూడా లేదని స్పష్టం చేసింది. కేంద్ర కమిటీ నిర్మాణానికి తగిన విధంగా ప్రవర్తించడంలో విఫలమైన తమ్మినేని వీరభద్రం.. స్కైలాబ్ బాబు.. ప్రసాద్ పై కేంద్ర కమిటీ చర్యలు తీసుకుందని.. వారి ముగ్గురిని కూడా అభిశంసించిందని సమాచారం.తమ్మినేని వీరభద్రాన్ని కేవలం రాష్ట్ర సెక్రటేరియట్.. కమిటీ సమావేశాలలో పరిశీలకుడిగా మాత్రమే నడుచుకోవాలని.. రాష్ట్ర సెక్రటేరియట్ నాయకత్వంలో పనిచేయాలని కేంద్ర కమిటీ సూచించినట్టు సమాచారం. ముగ్గురు కీలక నాయకులు తప్పులు



చేసిన నేపథ్యంలో.. ఈ చర్యలు వారి నడవడికలో మార్పును తీసుకొస్తాయని ఆశిస్తున్నట్టు కేంద్ర కమిటీ ప్రకటించింది.తమ్మినేని వీరభద్రం అభి శంసనకు గురైన నేపథ్యంలో.. సరిగ్గా 18 సంవత్సరాల క్రితం విడుదలైన ఓ పుస్తకాన్ని కొంతమంది గుర్తు చేస్తున్నారు. నాడు సిపిఎం పార్టీలో ఉన్న కొంతమంది వ్యక్తులు నిప్పుకు చెదలు అనే పేరుతో ఒక పుస్తకాన్ని విడుదల చేశారు. ఆ పుస్తకం ముందు పేజీ మీద సిపిఐ (ఎం) పేరుతో 60 పేజీల అసలు వ్యవహారాలను తెరపైకి తీసుకొచ్చారు. అప్పట్లో ఈ పుస్తకం సంచలనం కలిగించింది. చాలామంది నాయకుల త్యాగాలతో ఏర్పడిన పార్టీ.. ఇప్పుడు స్వార్థపరుల చేతుల్లోకి వెళ్లిందని.. మొత్తం బలిపీఠం ఎక్కిందని అందులో వాస్తవిక వాదులు పేర్కొన్నారు.ఆ పుస్తకాన్ని అప్పటి సిపిఎం ఖమ్మం జిల్లా నాయకులు వనం నరసింహ రావు.. వై వినయ్ కుమార్.. రాయల వెంకటేశ్వర్లు.. కిలారు సీతారాములు.. ఎర్రబోయిన సీతారాములు.. నల్లపునేని అప్పారావు.. జొన్నలగడ్డ రవికుమార్.. ఇలవల పుల్లారెడ్డి.. ఎడవల్లి రాంరెడ్డి రచించారు. ఆ పుస్తకం వెలుగులోకి వచ్చిన తర్వాత రూపకర్తలందరూ బహిష్కరణకు గురయ్యారు. అయితే ఈ పుస్తకం వెనుక టీఎన్ ప్రసాద్, ధనాల కొండయ్య వంటి వ్యక్తులు కూడా ఉన్నట్టు ప్రచారంలో ఉంది. ఈ నాయకుల్లో టిఎన్ ప్రసాద్.. ఇంకా కొంతమంది వేరువేరు కారణాల వల్ల చనిపోయారు. మిగతా వారంతా వేరువేరు పార్టీలలో కొనసాగుతున్నారు.నాడు విడుదల చేసిన నిప్పుకు చెదలు పుస్తకంలో బోడెపూడి వెంకటేశ్వరరావు, బాజీ హనుమంతు, ఎడవల్లి పద్మారెడ్డి, గట్లూరి కిషన్ రావు, బండారు చంద్రరావు, ఏలూరు లక్ష్మీనారాయణ, బోజడ్ల వెంకటనారాయణ, రావెళ్ళ సత్యనారాయణ, టీవీఆర్ చంద్ర, మంచి కంటి రామ్ కిషన్ రావు, శేషగిరిరావు, బోడెపూడి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనారాయణ వంటి వ్యక్తులను ప్రముఖంగా ప్రస్తావించారు. వారు చేసిన త్యాగాల వల్ల పార్టీ ఏ స్థాయికి ఎదిగిందో గుర్తు చేశారు. తమ్మినేని నాయకుడిగా మారిన తర్వాత.. పార్టీ దిగజారిన తీరు.. ముదిగొండ కాల్పులు.. పాలేరు డివిజన్లో కుటుంబ సభ్యుల పెత్తనం వంటి వాటిని ఆ పుస్తకంలో ప్రముఖంగా ప్రస్తావించారు.ఈ పుస్తకం తోనే ఆ నాయకులు ఆగిపోలేదు. నాడు ఉమ్మడి రాష్ట్రానికి కార్యదర్శిగా ఉన్న బీవీ రాఘవులకు.. జాతీయ కార్యదర్శి ప్రకాష్ కారత్ వంటి వారికి లేఖలు కూడా రాశారు. ఆ పుస్తకాలలో ఉన్న ప్రముఖమైన విషయాలను కూడా వారి దృష్టికి తీసుకెళ్లారు. ఇంత చేసినప్పటికీ బివి రాఘవులు లాంటి నాయకుడు తమ్మినేని వీరభద్రాన్ని బంగారం అని ప్రస్తావించారు. అయితే ఇన్నాళ్లకు పార్టీ కేంద్ర కమిటీ తమ్మినేని వీరభద్రాన్ని.. ఇంకా ఇద్దరు ముఖ్య నాయకులను అభి శంసించడం నిజంగా ఆశ్చర్యకరం.తమ్మినేని రాజకీయ జీవితంలో ఇంకా కొన్ని కోణాలను ఇక్కడ కేంద్ర కమిటీ పక్కనపెట్టినట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా తమ్మినేని పార్టీకి చేసిన సేవలను.. పురోగతికి శ్రమించిన తీరును కేంద్ర కమిటీ పట్టించుకోవడం తెలుస్తోంది. గోదావరి జలాలను పాలేరుకు అనుసంధానించాలని తమ్మినేని వీరభద్రం 20 సంవత్సరాల క్రితమే దుమ్ముగూడెం నుంచి పాలేరు నియోజకవర్గం వరకు 100 రోజులపాటు పాదయాత్ర చేశారు. దాదాపు 2792 కిలోమీటర్ల మేర నడిచారు.ఆ పాదయాత్ర గురించి ఇప్పటికి ఖమ్మం రాజకీయాలలో చర్చ నడుస్తూనే ఉంటుంది. తమ్మినేని కృష్ణయ్య హత్యకు గురికావడం.. ఈ వ్యవహారంలో తమ్మినేని వీరభద్రం సోదరుడు కోటేశ్వరరావు.. ఇంకా కొంతమంది వ్యక్తులు అభియోగాలు ఎదుర్కొంటూ ఉండడం వంటి కారణాలు కేంద్ర కమిటీ దృష్టికి వెళ్లి ఉండవచ్చని.. అందువల్లే ఈ తరహాలో అభిశంషన ఇచ్చి ఉండవచ్చని వాదనలు కూడా వినిపిస్తున్నాయి.ఎన్నో రకాల పరిణామాలు ఎదుర్కొని.. రాజకీయ జీవితాన్ని రకరకాలుగా మార్చుకొని.. 72 సంవత్సరాల వయసులో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న తమ్మినేని వీరభద్రం.. ఇప్పుడు కేంద్ర కమిటీ నుంచి అభిశంసన ఎదుర్కోవడం సంచలనం కలిగిస్తోంది. అభిశంసన అనేది కమ్యూనిస్టు పార్టీలో తీవ్రమైన హెచ్చరిక అయినప్పటికీ.. తమ్మినేని వీరభద్రం లేకుండా తెలంగాణలో పార్టీ నడుస్తుందా? పార్టీ ముందుకు వెళ్తుందా? ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానాలు లభించాల్సి ఉంది

# సమగ్ర విద్యతోనే సమసమాజం

**హైదరాబాద్, మార్చి 4, పెన్ పవర్:** విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవన పద్ధతి. విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది, నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది. నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈ మూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు. సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశం ముందుకు సాగుతుంది.విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితం కాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చేశక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం.నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి, నవచైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైనవి. ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. కాబట్టే విద్యా వ్యవస్థ నైపుణ్యాల పెంపువైపు మళ్లాలి. పాఠశాల స్థాయినుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బలపరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు. నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలినుంచి మార్చుతుంది. నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు. ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాలపట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు. నవ చైతన్యం అభివృద్ధికి కొత్త దారి, భవిష్యత్తు నవ చైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలక అంశం. కేవలం పాఠాలు నేర్పించడంసరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం, వైఫల్యం భయపడకుండా ముందుకుసాగడం వంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి. ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ క్లబ్‌లు, సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవచైతన్యాన్ని పెంపొందించే మార్గాలు. నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది. సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండా పలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతోపాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడం ఇవన్నీ సమగ్ర విద్య లక్ష్యాలు. సమగ్ర విద్య ఎందుకు అవసరం అంటే సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగినవాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది. దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం.

పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల, ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి అవసరం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలలనుండి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్ని కోణాల్లో అభివృద్ధి చేసే సమగ్ర ప్రక్రియ కావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు, సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలు విద్యార్థులను భవిష్యత్తు వైపు తీర్చిదిద్దుతున్నాయి. విద్యా నిపుణులు చెబుతున్నదేమిటంటే, నేటి తరం ఉద్యోగాలకే కాదు, జీవితానికి సిద్ధం అవ్వాలి. మొత్తం మీద విద్యా రంగంలో జరుగుతున్న ఈ మార్పులు సమీప భవిష్యత్తులో దేశ యువతకు మరింత బలమైన భవిష్యత్తును అందించనున్నాయి. విద్యార్థులు నైపుణ్యవంతులుగా, విలువలను పాటించే పౌరులుగా, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ సంస్కరణలు మేలుచేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి నేటి తరానికి సరైన విద్య అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి విలువలు, జీవిత నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కరణ, ఆధునిక జ్ఞానం ఇవన్నీ కలగలిపిన బహుముఖ విద్య సమగ్ర విద్యను ప్రతి విద్యా సంస్థలో అమలు చేసినప్పుడే మన దేశం నిజమైన అర్థంలో విజ్ఞానభారతంగా వెలుగొందుతుంది.

# ఆర్థిక పరిస్థితి... ఏంటీ

**హైదరాబాద్, మార్చి 4, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిపై కేంద్రానికి డౌట్ వచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి ఖాజానా నిల్ అనడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గట్టిగానే సవాళ్లు చేశారు. కేంద్రం నిధులు ఇస్తున్న రాష్ట్ర ఖజానా ఖాళీ అంటున్న రేవంత్ రెడ్డిని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాయడం సంచలనమైంది. దీంతో నిజంగానే తెలంగాణ రాష్ట్ర ఖజానా నిల్ అయ్యిందా? అయితే రాహుల్ గాంధీకి 1000 కోట్లు ఇస్తానన్న రేవంత్ రెడ్డి వాటిని ఎలా చెల్లిస్తారన్న కిషన్ రెడ్డి మాట ఇప్పుడు వైరల్ గా మారింది.రాష్ట్ర ఖజానా 'నిల్' అంటూ రాజకీయ వేదికలపై వినిపిస్తున్న మాటలు ఇప్పుడు కొత్త కామెడీ ట్రాక్‌లా మారాయి. ఎన్నికల సమయంలో ఖజానా "ఫుల్"గా కనిపిస్తుంది. హామీల జాబితా చూస్తే అది మినీ బడ్జెట్ కాదు, మేగా బడ్జెట్ అన్నట్టు ఉంటుంది. కానీ అధికారంలోకి వచ్చాక అదే ఖజానా ఒక్కసారిగా "ఖాళీ మట్టి కుండ"గా మారిపోతుంది. ఇది ఆర్థిక శాస్త్రంలోని కొత్త సిద్ధాంతమా? లేక రాజకీయ శాస్త్రంలోని పాత మంత్రామా?ఎన్నికల ముందు "ఆరు గ్యారెంటీలు 420 హామీలు" అంటూ ప్రజలకు కలల కట్టడాలు చూపిస్తారు. ఓట్లు పడిన తర్వాత మాత్రం "ఖజానాలో లంకెబిందెలు లేవు" అని చెబుతారు. అయితే ఇదే సమయంలో మరో సభలో "అవసరమైతే వెయ్యి కోట్లు ఇస్తాం" అనే ధైర్యవాక్యాలు వినిపిస్తేడ ప్రజలు ఏది నమ్మాలి? ఖజానా ఖాళీనా? లేక డైలాగ్‌లే ఫుల్‌గా ఉన్నాయా?ఇది చూసి ప్రజలకు ఒక సందేహం రావడం సహజం.. ఖజానా 'నిల్' అయితే మాటల ఖజానా మాత్రం 'అన్‌లిమిటెడ్' ఎలా? రాజకీయాల్లో ఇది కొత్త గణితం కావచ్చు. 0 + 1000 = సభలో చప్పట్లు అన్న ఫార్ములా!ఇంకో ఆసక్తికర విషయం ఏమిటంటేడ కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రాష్ట్ర అప్పులు, బడ్జెట్ లెక్కలు.. ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలంటే శ్వేతపత్రం అవసరం అంటున్నారు. కానీ రాజకీయాల్లో శ్వేతపత్రం అంటే వాస్తవాల పుస్తకం కాదు, వాదాల పుస్తకంగా మారిపోతుంది. ఒక పార్టీ విడుదల చేస్తే అది "నిజాల గ్రంథం"; మరో పార్టీకి అది "అబద్ధాల సంకలనం".ఇక అప్పుల కథ కూడా సినిమాలా ఉంది. ఎవరు అధికారంలో ఉన్నా అప్పులు మాత్రం హీరోల్లా సీన్‌లో ఉంటాయి. "మేము తీసుకున్న అప్పులు అభివృద్ధి కోసం" అంటారు. "వాళ్లు తీసుకున్న అప్పులు దుర్వినియోగం" అంటారు. చివరకు ప్రజలకు మాత్రం ఈఎంఐలే మిగులుతాయి.. పన్నుల రూపంలో.మొత్తానికి "రాష్ట్ర ఖజానా నిల్" అన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట కంటే "రాజకీయ నాటకం ఫుల్" అన్న మాట దగ్గరగా ఉందేమో అనిపిస్తోంది. ప్రజలు ఇప్పుడు ఒకే ప్రశ్న అడుగుతున్నారు. ఖజానా నిజంగానే ఖాళీనా? రేవంత్ రెడ్డి గారుడ లేక రాజకీయ సంభాషణలే ఖాళీగా ఉన్నాయా?సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఓ శ్వేతపత్రం వస్తే బాగానే ఉంటుంది. ఎంతసేపు కేసీఆర్ ఖజానా ఖాళీ చేశాడనే బదులు.. మీరు అధికారంలోకి వచ్చాక ఏం చేశారన్నదే జనాలు చూస్తారు. అందుకే కేసీఆర్ ను కాదని మీకు ఓటు వేశారు. ఎందుకంటే సంఖ్యలు మాట్లాడితే వాదాలు తగ్గుతాయి. లెక్కలు బయటపెడితే నిజం బయటపడుతుంది. అప్పటివరకు మాత్రం సభల స్టేజీలపై ఖజానా 'నిల్' చప్పట్లు 'ఫుల్' అనే ట్రెండ్ కొనసాగుతుందేమో!

# గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణ వాసులు..

**హైదరాబాద్, మార్చి 4, పెన్ పవర్:**
ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా దాడులు.. వీటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో మిడిల్ ఈస్ట్‌లో తీవ్ర యుద్ధ వాతావరణం నెలకొంది. సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన తర్వాత ఇజ్రాయెల్, అమెరికా బెదిరింపులకు ఇరాన్ ఏమాత్రం లొంగడం లేదు. దీంతో పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే గల్ఫ్ దేశాల్లో ఉన్న తమ వారు ఎలా ఉన్నారోనని రాష్ట్రంలోని వారి కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.తెలంగాణ నుంచి లక్షలాది మంది జనం ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేస్తున్నారు. ఇక్కడ చేయడానికి పనుల్లేక, చేసిన పనులకు సరైన డబ్బులు రాకపోవడంతో.. విదేశాలకు వెళ్లి కష్టపడితే ఎక్కువ డబ్బులు వస్తాయనే ఆశతో చాలా మంది వెళ్తున్నారు. అక్కడికి వెళ్లిన వారు బాగా సంపాదిస్తుండటంతో ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులు, తెలిసిన వాళ్లు కూడా ఆయా దేశాలకు వెళ్లి డబ్బులు సంపాదిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇరాన్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, బహ్రెయిన్, ఒమన్, ఖతార్, కువైట్ వంటి దేశాల్లో భారీ సంఖ్యలో భారత్ నుంచి వెళ్లిన వాళ్లు ఉన్నారు. అందులో ఒక్క తెలంగాణ నుంచే దాదాపు 15 లక్షల మంది ప్రజలు ఈ గల్ఫ్ దేశాల్లో రకరకాల పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో అక్కడ ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారింది.అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్‌పై యుద్ధం ప్రకటించగా.. ఈ దాడులు మొత్తం గల్ఫ్ దేశాలకు అంటున్నాయి. దీంతో ఆయా దేశాల్లో ఉన్న తెలుగువారి భద్రతపై తెలుగు రాష్ట్రాల్లోని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇక తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాల్లో 15 లక్షల మంది తెలంగాణవాసులు ఉండగా.. అందులో 9 లక్షల మంది ఉత్తర తెలంగాణకు చెందినవారే ఉండడం గమనార్హం. ఇక సౌదీ అరేబియా, దుబాయ్, షార్జా, అబుదాబీ, ఒమన్, ఖతార్, బహ్రెయిన్, కువైట్ దేశాల్లో మొత్తంగా 90 లక్షల మంది భారతీయులు ఉండగా.. అందులో 15 లక్షల మంది తెలంగాణ, మరో 15 లక్షల మంది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఉన్నారని ప్రభుత్వం అంచనా వేస్తోంది.ఇక ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 2.5 లక్షల మంది.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మరో 2 లక్షల మంది.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 1.5 లక్షల మంది గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి జీవిస్తున్నారు. ఇక సిద్దిపేట జిల్లాకు చెందిన 15 వేల మంది పలు రకాల పనులు చేస్తున్నారు. ఒక్క ఇజ్రాయెల్‌లోనే నిజామాబాద్ జిల్లా నుంచి 700 మంది పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన వారు యూఏఈ, ఒమన్ వంటి దేశాల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు.ఇజ్రాయెల్, అమెరికా దేశాలపై కోపంతో.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ సైన్యం క్షిపణి, డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. దీంతో ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లోని చాలా కంపెనీల్లో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ క్రమంలోనే గత రెండు రోజులుగా వలస కార్మికులు మొత్తం బంకర్లలోనే తలదాచుకుంటున్నారు. నిత్యం సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం వరకు బాంబుల శబ్దాలు దద్దరిల్లిపోతున్నాయని.. బంకర్లలో దాక్కొని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నట్లు అక్కడి ఉన్నవారు తమ కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. వారు అక్కడ క్షేమంగానే ఉన్నట్లు చెప్పినా.. ఇక్కడ ఉన్న వారు మాత్రం భయం గుప్పిట్లోనే జీవిస్తున్నారు.మరోవైపు.. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇక మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు వలస కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడి వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రభుత్వం తరఫున చేయాల్సిన సాయాన్ని చేస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో ఉన్నవారిని రక్షించేందుకు అన్ని చర్యలు



చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ కూడా వెల్లడించారు.మరోవైపు.. గల్ఫ్ కార్మికుల సమాచారం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎమర్జెన్సీ టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. అబుదాబీ (యూఏఈ) టోల్‌ఫ్రీ నంబర్ 800-46342.. వాట్సాప్ +971543 090571.. కువైట్ +96565 501946.. బహ్రెయిన్ 00973-39418071.. మస్కట్ (ఒమన్) 800 71 234.. జోర్డాన్ 00962 770422 276.. బాగ్దాద్ (ఇరాక్) +964 771 651 1185.. టెహ్రాన్ (ఇరాన్) +9891 281 09115.. సౌదీ అరేబియా 00 966 114 884 697.. దోహా (ఖతార్) 00974 5564 7502.. పాలస్తీనా +970 592916418 నంబర్లకు సంప్రదించి తమ వారి క్షేమ సమాచారం తెలుసుకోవచ్చని సూచించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య.. గల్ఫ్ కార్మికుల కోసం కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కార్మికులు 87126 59700, 87126 59821 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

తలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో తెలంగాణ ప్రభుత్వం కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రజల భద్రత కోసం దీన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. విదేశాంగ శాఖతో పాటు ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు చేస్తున్నారు. విదేశాల్లోని తెలంగాణవారికి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, ఎమర్జెన్సీ ఎదురైతే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తెలిపారు. 24 గంటల పాటు 9871999044, 58322143, 991014749, 9643723157 నంబర్లను అందుబాటులో ఉంచారు.

## కొడుకుపై తండ్రి కత్తితో దాడి

**కరీంనగర్: పెన్ పవర్:** సైదాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో మంగళవారం మద్యం మత్తులో ఉన్న తండ్రి తన కొడుకుపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. రిటైర్డ్ ఉద్యోగి పెరుగు రవీందర్, మద్యానికి బానిసై ఇంటి వద్ద తిరుగుతున్నాడని, తన కొడుకు పెరుగు నరేష్ ను ఇంటికి రమ్మని పిలిచినప్పుడు, రానని చెప్పడంతో కత్తితో దాడి చేశాడని గ్రామస్తులు, పోలీసులు తెలిపారు. గాయపడిన నరేష్ ను ఆస్పత్రికి తరలించారు. సైదాపూర్ ఎస్సై కొప్పుల స్వాతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రాణం మీదకు వస్తున్న అల్లం వెల్లుల్లి పేస్ట్...




**హైదరాబాద్, మార్చి 4, ( పెన్ పవర్:** హైదరాబాద్లో పెద్ద మొత్తంలో కల్తీ అల్లం-వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. ఇది ఆరోగ్యానికి ఎంతో ప్రమాదామని చెప్తున్నారు. కల్తీ వెల్లుల్లి-అల్లం పేస్ట్ ఎక్కువగా తింటే హానికరమైన ప్రభావాలు ఉంటాయని అంటున్నారు. అయితే దీని గురించి సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతుంది. దీనిని ఎక్కువగా తింటే.. అవయవాలు కుళ్లిపోతాయంటూ చెప్తున్నారు. మరి దీనిలో వాస్తవమెంతో చూసేద్దాం. హైదరాబాద్లో తాజాగా నాలుగు వేల కిలోగ్రాముల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం చేసుకున్నారు. నివేదికల ప్రకారం హైదరాబాద్ పోలీసులు ఎంఎస్ మక్త రైల్వే గేట్ సమీపంలో ఆకస్మిక దాడి నిర్వహించి.. ఒక కంటైనర్‌లో అపరిశుభ్రంగా నిల్వ చేసిన అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను కనుగొన్నారు. ఈ కేసుకు సంబంధించి 21 ఏళ్ల వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. ఈ కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ మీ ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో.. దాని వల్ల ఏ అవయవాలు ఎక్కువగా ప్రభావితమవుతాయో చూసేద్దాం.వంటగదిలో రోజూ ఉపయోగించే అల్లం-వెల్లుల్లి పేస్ట్ కల్తీ అయితే.. అది తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాన్ని కలిగిస్తుంది. చెన్నైలోని శ్రీ బాలాజీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో నమోదైన డైటీషియన్ దీపలక్ష్మి ప్రకారం.. ఈ పేస్ట్ పరిమాణాన్ని పెంచడానికి పిండి లేదా కార్న్‌ఫ్లోర్‌ను కలుపుతారు. దానిని తాజాగా కనిపించేలా చేయడానికి, ఎక్కువసేపు ఉంచడానికి కృత్రిమ రంగులు, సంరక్షణకారులు కూడా కలుపుతారు. కొన్ని సందర్భాల్లో పాత లేదా చెడిపోయిన అల్లం, వెల్లుల్లిని కూడా ఉపయోగిస్తారు.జూలై 2025లో ఇలాంటిదే ఒక కేసు నమోదైంది. అక్కడ ఆహార భద్రతా అధికారులు కొన్ని ఫుడ్స్లో టైటానియం డయాక్సైడ్, మోనోసిట్రేట్ వంటి హానికరమైన కెమికల్స్ గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం.. ఆహార ఉత్పత్తిలో ఇటువంటి పదార్థాల వాడకం నిషేధం. దర్యాప్తులో రంగును పెంచడానికి ఉపయోగించే పెద్ద మొత్తంలో టైటానియం డయాక్సైడ్, మోనోసిట్రేట్, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు.ఈ కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తీసుకోవడం వల్ల గ్యాస్, అసిడిటీ, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. దీర్ఘకాలిక వినియోగం కాలేయం, మూత్రపిండాలను కూడా ప్రభావితం చేస్తుంది. రసాయన కల్తీ కొంతమందిలో అలెర్జీలు, చర్మ సమస్యలు లేదా శ్వాసకోశ సమస్యలను కూడా కలిగిస్తుంది. అలాగే కల్తీ అల్లం, వెల్లుల్లి సహజ ప్రయోజనాలను తగ్గిస్తుంది. ఇంట్లోనే కల్తీ అల్లం వెల్లుల్లి పేస్టు్ను గుర్తించేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. పేస్ట్ ముదురు లేదా రంగు మారకుండా లేత ఐవరీ రంగులో ఉండాలి. ఇది బూజు, బూజు లేదా దుర్వాసన లేకుండా ఉండాలి. ఆకృతి మృదువుగా, స్థిరంగా ఉండాలి. సువాసన ఘాటుగా ఉండాలి. తాజా అల్లం, వెల్లుల్లి వాసన ఇవ్వాలి. రుచి చేదుగా లేదా పాతదిగా ఉండకూడదు. ప్యాక్ చేసిన ఉత్పత్తిని కొనుగోలు చేసేటప్పుడు.. పదార్థాల జాబితాను తప్పకుండా చదవాలి. స్వచ్ఛమైన పేస్ట్‌లో ప్రధానంగా అల్లం, వెల్లుల్లి ఉండాలి. కృత్రిమ రంగులు లేదా సంరక్షణకారులను తక్కువగా జోడించాలి.

## రాజేంద్రనగర్ లో భారీ గా డ్రగ్స్ పట్టివేత

**రంగారెడ్డి: పెన్ పవర్:** రాజేంద్రనగర్ లో 20 లక్షల విలువ చేసే 150 గ్రాముల ఎండీఎంఎ డ్రగ్ ను పోలీసులు సీజ్ చేసారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్ఫోర్మెంట్ వింగ్ రాజేంద్రనగర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో డ్రగ్స్ గుట్టు రట్టు అయింది. ఒమన్, పాలస్తీనా కు చెందిన నిందితులను అరెస్ట్ చేసారు. బెంగళూర్ నుండి హైదరాబాద్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. సాఫ్ట్వేర్ ఇంజనీర్, బడా బాబులు టార్గెట్ గా డ్రగ్స్ సప్లయ్ చేస్తున్నారు. పోలీసుల జాయింట్ ఆపరేషన్ లో విదేశీయులు అరెస్ట్ అయ్యారు. బెంగళూర్ అడ్డాగా డ్రగ్స్ దందా నడుస్తోంది.

## ఎంఎన్జే క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యుల ఆందోళన

## ఐదవ రోజు కొనసాగుతున్న ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ల నిరసన

**హైదరాబాద్: పెన్ పవర్:** అర్హత లేని నూతన డైరెక్టర్ ను నియమించడం పై ఎంఎంజె హెచ్ఒడిస్ ,సిబ్బంది ఆందోళన ఐదవ రోజు కొనసాగింది. మెహదీ నవాజ్ జంగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ & రీజినల్ క్యాన్సర్ సెంటర్ (ఎంఎనో), హైదరాబాద్లో డైరెక్టర్ నియామకంపై వైద్యులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న సదానందం గౌడా డైరెక్టర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ .ఛాంబర్ ముందు ఆందోళనకు దిగారు. నిమ్స్ ఆసుపత్రికి చెందిన జూనియర్ సదానంద గౌడ, ఎంఎంజె క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ నియామకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు.ఎంఎంజె ఆసుపత్రిలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు ఉండగా, వారి సీనియారిటి అనుభవాన్ని పక్కనబెట్టి బయటి సంస్థకు చెందిన వ్యక్తిని నియమించడం పై అందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సంస్థ పరిపాలన, వైద్య సేవలు,విద్యా పరిశోధన కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన కలిగిన సీనియర్లను విస్మరించడం సిబ్బంది మనోభావాలను దెబ్బతీసే చర్యగా వైద్యులు భావిస్తున్నారు. సీనియారిటీ, సంస్థ సంప్రదాయాలను గౌరవించకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే పునఃపరిశీలించాలని డిమాండ్ చేసారు.
ఎంఎంజె పరిపాలనా, రోగులకు నిరంతర నాణ్యమైన వైద్య సేవల కోసం అంతర్గత అర్హులైన సీనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఇవ్వాలంని సిబ్బంది అంటున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**మేడ్చల్: పెన్ పవర్:** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన తీర్పు వెలువరించింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రూ.5,000 జరిమానా విధించింది. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది.ప్రభుత్వ తరఫున న్యాయవాది ప్రభాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, 2021లో నిందితుడు మైనర్ బాలికను బెదిరింపులకు గురిచేసి ముంబైకు తీసుకెళ్లి లైంగిక దుర్వినియోగానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.నిందితుడు షేక్ నజీర్ అలియాస్ అమిత్. ప్రస్తుతం దుండిగల్ మండలం చర్చి గాగిల్లాపూర్లో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామం వికారాబాద్ జిల్లా యలాల్ మండలం విశ్వనాథ్పూర్ గ్రామమని ప్రభాకర్ రెడ్డి తెలిపారు.విచారణలో సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. ఈ కేసులో నిందితుడిపై బాధితురాలి తండ్రి హత్యకు సంబంధించిన మరో కేసు పెండింగ్లో ఉన్నట్లు ప్రభాకర్ రెడ్డి చెప్పారు.

## జడల రామలింగేశ్వర ఆలయ ఉత్సవాల్లో అపశృతి

## అగ్నిగుండంలో పడి భక్తులకు గాయాలు

**నల్గొండ: పెన్ పవర్:** వేములపల్లి (మం) ఆమనగల్లు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. అగ్నిగుండం దాటే క్రమంలో భక్తులు కింద పడ్డారు. దాంతో అక్కడ బందోబస్తులో వున్న పోలీసులు అప్రమత్తమైనిప్పుల్లో కింద పడ్డ భక్తులను బయటికి లాగివేసారు. ప్రమాదంలో నలుగురు భక్తులకు స్వల్పగాయాలు అయ్యాయి. భక్తులు ఒక్కసారిగా తీసుకుంటూ వచ్చే క్రమంలో ప్రమాదం తలెత్తింది.

# మియాపూర్ లో హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** మియాపూర్ పోగుల ఆగయ్య నగర్ లో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణ దారుణ హత్యకు దారితీసింది. మద్యం మత్తులో ఉన్న తమ్ముడు, తన అన్నను బండరాయితో కొట్టి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు స్థానికులు తెలిపారు. తరచుగా తాగి గొడవ చేస్తూ వేధిస్తున్నాడని హత్య చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కారు బావిలో పడి యువకుడు మృతి



**నిర్మల్: పెన్ పవర్:** నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బీర్నంది గ్రామంలో మంగళవారం రాత్రి కారు అదుపుతప్పి బావిలో పడటంతో శ్రీనివాస్ (38) అనే యువకుడు మృతి చెందాడు. అత్యవసర పనిమీద రంగపేట్ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కొమ్ముతండా సమీపంలో రహదారి పక్కనే ఉన్న బావిలో కారు దూసుకెళ్లింది. మృతుడు కడం మండలంలోని 'మన్ గ్రోమోర్' సంస్థలో మేనేజర్గా పనిచేస్తున్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఫ్యామిలీ మ్యాన్ నుంచి పొలిటిషియన్...

**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళ స్టార్ హీరో, 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ ప్రస్తుతం తన జీవితంలో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు రాజకీయాల్లోకి అడుగుపెట్టి 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా దూసుకుపోతుంటే, మరోవైపు 26 ఏళ్ల వైవాహిక బంధం ముగింపు దశకు చేరుకోవడం ఆయన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్టపై తీవ్ర చర్చకు దారితీసింది.ఫిబ్రవరి 27న విజయ్ భార్య సంగీత స్వర్ణలింగం చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేయడం కోలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. 1999లో ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సంగీత తన పిటిషన్‌లో చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. విజయ్ ఒక ప్రముఖ నటితో (త్రిష అని పుకార్లు వినిపిస్తున్నప్పటికీ పిటిషన్‌లో పేరు స్పష్టంగా లేదు) 2021 నుండి సంబంధం కలిగి ఉన్నారని సంగీత ఆరోపించారు. విజయ్ తనను సామాజికంగా, వృత్తిపరంగా దూరం పెట్టారని, ఆమె స్వేచ్ఛపై ఆర్థిక ఆంక్షలు విధించారని ఆమె ఆరోపించారు. సదరు నటి విజయ్‌తో దిగిన ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నా ఆయన ఖండించలేదని, ఇది తనను, పిల్లలను తీవ్ర అవమానానికి గురిచేసిందని ఆమె పేర్కొన్నారు.విజయ్ తన పార్టీ టీవీకేను స్థాపించి, సినిమాలకు స్వస్తి పలికి పూర్తిస్థాయి రాజకీయ నేతగా అవతరించాలని నిర్ణయించుకున్నారు. సరిగ్గా 2026 అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ విడాకుల వ్యవహారం బయటకు రావడం ఆయనకు రాజకీయంగా పెద్ద దెబ్బ. విజయ్ ఇప్పటివరకు ఒక 'ఫ్యామిలీ మ్యాన్'గా, బాధ్యతాయుతమైన వ్యక్తిగా తన ఇమేజ్‌ను కాపాడుకుంటూ వచ్చారు. విడాకుల పిటిషన్‌లో నైతికతకు సంబంధించిన ఆరోపణలు రావడంతో ప్రత్యర్థి పార్టీలకు ఇది ఒక ఆయుధంగా మారే అవకాశం ఉంది. రాజకీయాల్లో మహిళా ఓటర్ల మద్దతు చాలా ముఖ్యం. భార్యను నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు మహిళా ఓటర్లలో ఆయనపై ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చు.రాజకీయాలతో పాటు సినిమా పరంగా కూడా విజయ్ ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ఆయన చివరి చిత్రంగా భావిస్తున్న 'జన నాయకన్' సెన్సార్ పరంగా ఆటంకాలను ఎదుర్కొంటోంది. రాజకీయ సందేశాలు ఉండటంతో సెన్సార్ బోర్డు అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. పొంగల్ కు విడుదల కావాల్సిన ఈ సినిమా ఇప్పటివరకూ రిలీజ్ కాలేదు. అటు వ్యక్తిగత జీవితం, ఇటు కెరీర్ రెండూ డైలమాలో పడ్డాయి.తమిళనాడు రాజకీయాల్లో వ్యక్తిగత జీవితంపై విమర్శలు రావడం కొత్తేమీ కాదు. గతంలో ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి వంటి నేతలు కూడా ఇలాంటి వ్యక్తిగత విమర్శలను ఎదుర్కొన్నారు. అయితే విజయ్ ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉన్నారనేది ముఖ్యం. విజయ్ అభిమానులు, యువత దీన్ని ఆయన వ్యక్తిగత విషయంగా చూస్తున్నారు. రాజకీయాల్లో ఆయన సిద్ధాంతాలకు, ఈ వివాదానికి సంబంధం లేదని వారు వాదిస్తున్నారు. ఈ వివాదంపై విజయ్ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఏప్రిల్ 20న కోర్టు విచారణకు హాజరుకావాల్సి ఉంది. ఈలోగా ఆయన ఈ సమస్యను ఎలా పరిష్కరించుకుంటారు లేదా ప్రజలకు ఎలా సంజాయిషీ ఇస్తారనే దానిపైనే ఆయన రాజకీయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.విజయ్ తన జీవితంలో అత్యంత కఠినమైన 'అగ్నిపరీక్ష'ను ఎదుర్కొంటున్నారు. ఒకవైపు దశాబ్దాల వైవాహిక జీవితం విచ్ఛిన్నం కావడం, మరోవైపు రాజకీయాల్లో స్థిరపడాలనే లక్ష్యం.. ఈ రెండింటి మధ్య ఆయన ప్రయాణం ఆసక్తికరంగా మారింది. ఈ సంక్షోభం నుండి ఆయన ఎలా గట్టెక్కుతారో కాలమే నిర్ణయించాలి. రాజకీయాల్లో నెగ్గాలంటే కేవలం సినిమా పాపులారిటీ సరిపోదని, వ్యక్తిగత ప్రవర్తన కూడా క్లీన్‌గా ఉండాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మూడు నెలల్లో మూడు దేశాలపై దాడులు..

**హైదరాబాద్ పెన్ పవర్:** అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్.. 2026లో నెలకొకరనిని టార్గెట్ చేస్తున్నాడు. ఏడాది పాలన పూర్తి కావడంతో తనలోని యుద్ధ కాంక్షను బయటపెట్టిన ట్రంప్ అమెరికా ప్రయోజనాల కోసం యుద్ధం చేస్తున్నాడు. యుద్ధాలు ఆపుతానని గద్దెనెక్కిన నేత.. జరుగుతున్న యుద్ధాలు ఆపకుండా.. కొత్త యుద్ధాలు మొదలు పెట్టాడు. జనవరి నుంచి మార్చి 1 వరకు ముగ్గురిని టార్గెట్ చేశాడు. వెనిజుల్లా అధ్యక్షుడు నికోలస్ మదురోను ట్రంప్ ఈ ఏడాది జనవరిలో టార్గెట్ చేశాడు. వెనెజువెలాలోని ఆయిల్ నిల్వల కోసం ఆ దేశ అధినేతను సైలెంట్‌గా కిడ్నాప్ చేయించాడు. ఇక తమ దేశంలోకి డ్రగ్స్ అక్రమంగా సరఫరా చేస్తున్నాడని మెక్సికోకు చెందిన లార్డ్ ఎల్ మెంచోను ట్రాప్ చేసి ఫిబ్రవరిలో హతమార్చాడు. ప్రియురాలును ట్రాప్ చేసి మెంచోను హతమార్చారు. ఇక తాజాగా ఇరాన్ టాప్ లీడర్ ఖమేనీని మట్టుబెట్టాడు. అణ్వాయుధాలు తయారు చేస్తున్నాడన్న సాకుతో ఇజ్రాయెల్‌తో కలిసి దాడులు చేశాడు. చివరకు హతమార్చాడు.ఈ టార్గెట్లు రాజకీయ, డ్రగ్స్, మతపరమైన తీవ్రవాదానికి చిహ్నాలు. అమెరికా ఇప్పుడు 'హిట్ లిస్ట్' రక్షణ, వాణిజ్య ఆధారాలు, మానవ హక్కుల ఉల్లంఘనలపై దృష్టి పెడుతోంది. ఈ వ్యూహం ద్వారా వాసింగ్టన్ తన ప్రభావాన్ని పునరుద్ధరిస్తూ, ప్రత్యర్థులకు హెచ్చరికలు జారుస్తోంది.ఇక ట్రంప్ తర్వాతి లక్ష్యం ఉత్తర కొరియా అని విశ్లేషకులు భావిస్తున్నారు. కిమ్ అణు కార్యకలాపాలు, మిస్సైల్ పరీక్షల కారణంగా దాడి చేసే అవకాశం ఉంది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో రష్యాపైనా దాడికి అవకాశాలు లేకపోలేదని భావిస్తున్నారు. రష్యాపై సైబర్ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక తర్వాతి లక్ష్యం చైనా. చైనా తైవాన్ ఉద్రిక్తతలు, దక్షిణ చైన సముద్రం వివాదాలు లక్ష్యంగా మారవచ్చు. మధ్యప్రాచ్యంలో హమాస్, హిజ్బుల్లా సంబంధాలు కొత్త టార్గెట్లకు దారి తీస్తాయి.అమెరికా దుందుడుకు చర్యలతో మిత్రరాజ్యాలకు ఇబ్బందులు లేకపోయినా.. ప్రత్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి విమర్శలు, వాణిజ్య యుద్ధాలు పెరిగే ప్రమాదం ఉంది. అమెరికా ఈ మార్గంలో స్వయం రక్షణను సాకుగా చూపుతోంది.

# మార్చురీలో పీక్కుతున్న మృతదేహాలు

**మహబూబ్ నగర్, మార్చి 4, పెన్ పవర్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో చోటుచేసుకున్న అమానవీయ ఘటనపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మార్చురీలో భద్రపరిచిన ఒక వ్యక్తి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయన్న వార్తపై ప్రభుత్వం వెంటనే స్పందించింది.ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశార. ఆయన ఆదేశాల అనంతరం.. మంగళవారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ స్వయంగా జడ్చర్ల ఆసుపత్రిని సందర్శించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. మార్చురీ నిర్వహణలో దారుణమైన వైఫల్యం , విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలడంతో నలుగురిపై సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెండ్ అయిన వారిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ , ఎంఎస్‌వో ఉన్నారు.మార్చురీ వంటి సున్నితమైన ప్రదేశాలలో కనీస రక్షణ కరువవడం, కుక్కలు లోపలికి వెళ్లి మృతదేహాన్ని పీక్కుతినే వరకు సిబ్బంది గుర్తించకపోవడంపై ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రులలో మృతదేహాలకు కూడా గౌరవం దక్కడం లేదని బాధితుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని మార్చురీల భద్రతను పటిష్టం చేయాలని ఆరోగ్య శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# యుద్ధం అక్కడ నష్టం ప్రపంచమంతటా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐరాస ప్రేక్షకపాత్రను వహిస్తోంది. ఇరాన్‌పై రెండు దేశాల ముప్పేట దాడి విషయంలో అమెరికన్ ట్రంప్- ఇజ్రాయిల్ నేతన్యాహూ ద్వయాన్ని ఒప్పించగల మధ్యవర్తిత్వం చేసే దేశాలు కరువైనాయి. నిరాయుధీకరణ నిత్య మంత్రం కావాలని ఐరాస బోధించడం మినహా చేసేది ఏమీ కనిపించడం లేదు. ఆయుధాలు, యుద్ధ వ్యాప్తి నిరోధక చర్యలు సాకారం కావాలని ఆకాంక్షిస్తున్న ఐరాస నేటి ఇజ్రాయిల్-అమెరికా సైనిక దాడులను ఆపమని ఒక్క మాట కూడా ఎనలేని నిస్సహాయ దుస్థితిలో ఉన్నది. ప్రపంచ శాంతి నెలకొనాలనే సదుద్దేశంతో 2022 నుంచి ఐరాస ప్రతి ఏట "అంతర్జాతీయ నిరాయుధీకరణ, వ్యాప్తి నిరోధక అవగాహన దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ డిస్‌ఆర్మమెంట్ అండ్ నాన్-ప్రొలిఫరేషన్ అవేర్‌నెస్)" పాటించడం జరుగుతుంది. అణ్వాయుధాలు, రసాయన, జీవాయుధాల వల్ల కలిగే అపార నష్టాలను అవగాహన పరుస్తూ నిరాయుధీకరణ సూత్రాలను వ్యాప్తి చేస్తున్నది. సామూహిక వినాశన ఆయుధాల వ్యాప్తిని కట్టడి చేయడం ద్వారా అంతర్జాతీయ భద్రత, మానవాళి రక్షణ, శాంతి నెలకొంటాయని ప్రచారం నిర్వహిస్తున్నారు. 1945లో హిరోషిమా, నాగసాకిలపై జరిగిన అణు బాంబు దాడుల విధ్వంసంతో 2 లక్షల ప్రజలు మరణించగా, లక్షల మంది దీర్ఘకాలిక నష్టాలను కూడా నమోదు చేసుకున్నారు. 1945లో ప్రారంభమైన అణ్వాయుధ పరీక్షలు, దాదాపు నేటికీ 2,000 వరకు అణు పరీక్షలు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 24 ఫిబ్రవరి 2022లో ప్రారంభమైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం గత నాలుగేళ్లుగా కొనసాగుతోంది. అదే విధంగా 07 అక్టోబర్ 2023 నుంచి పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి అంతం కనిపించడం లేదు. నేడు ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా మరో యుద్ధం కొనసాగిస్తూ మిసైల్స్ వర్షంతో మధ్య ప్రాచ్యం మంటల్లో భగ్గుమంటోంది. గల్ఫ్ దేశాల ఆకాశం బాంబు పేలుళ్లతో నల్లటి కారుమబ్బులతో నిండి ఉన్నది. నగరాలు, సైనిక స్థావరాలు, చమురు శుద్ధి కేంద్రాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా భీకర బాంబుల దాడితో ప్రపంచ శాంతి గాల్లో దీపమైంది. 3వ ప్రపంచ యుద్ధం రానుందా అనే వాదనలు బలపడుతున్నాయి. పిల్లిని గదిలో బంధించి కొడితే గత్యంతరం లేక తెగబడి ఎదురు తిరుగుతుందనే విషయం మనకు తెలుసు. నేడు ఇరాన్ పరిస్థితి కూడా అలాగే ఉన్నది. ఇరాన్ అణు కార్యక్రమం మింగుడుపడని ఇజ్రాయిల్, అమెరికాకు సంయుక్తంగా భీకర సైనిక దాడులు చేసి ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతుల్లా అలీ ఖమేనీని మట్టుపెట్టడంతో పాటు ఖమేనీ సమీప బంధువులు/కుటుంబ సభ్యులు, అగ్ర నేతలు, ఉన్నత సైనిక అధికారులు, సహాయకులు కలుపుకొని ఇప్పటికీ 800లకు పైగా నిండు ప్రాణాలను కోల్పోయారు. 1989 నుంచి నిన్నటి వరకు ఇరాన్ సుప్రీమ్ నాయకుడిగా ముదున్నర దశాబ్దాలకు పైగా తిరుగులేని నాయకుడిగా శాసించడం చూసాం. ఇరాన్‌లో పార్లమెంట్, న్యాయవ్యవస్థ, పోలీస్ విభాగం, మీడియా, మతపరమైన వర్గాలను తన అదుపులో ఉంచుకొని ప్రత్యర్థులను అక్రమంగా అరెస్టులు చేయడం, మానవ హక్కులను హననం చేయడం, మహిళా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడం, వ్యతిరేక ఉద్యమాలను అణచివేయడం తీవ్ర స్థాయిలో జరిగి పోయింది. ఇరాన్‌కు చెందిన వ్యూహాత్మక మిలటరీ, వైమానిక, నావికా కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని వేల బాంబులను ఇజ్రాయిల్-అమెరికాలు వేస్తున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తత నెలకొంది. ఈ భీకర యుద్ధంతో ప్రపంచ దేశాల్లో చమురు ధరలు బంగారం వలె ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇరాన్‌లో నిరంకుశ పాలన అంతం అయ్యిందని, ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం వచ్చిందని ఇరానియన్ ప్రజలకు ట్రంప్ ఉచిత సలహా ఇస్తున్నారు. ఈ యుద్ధం ఇలాగే మరి కొన్ని వారాలు కొనసాగుతుందని నెతన్యాహు-ట్రంప్ ద్వయం ప్రకటిస్తున్నారు. రోజు రోజుకు యుద్ధం ముదురుతోంది. చమురు కేంద్రాలు భగ్గుమంటున్నాయి. "ఆపరేషన్ రైజింగ్ లయన్" పేరుతో ఇజ్రాయిల్ చేపట్టిన దాడులు ఇరాన్ అణుకేంద్రాలు, సైనిక స్థావరాలను నేలమట్టం చేసాయి. ప్రతీకార జ్వాలలతో రగులుతున్న ఇరాన్ రగిలి పోతూ అమెరికా సైనిక స్థావరాలున్న 8 దేశాలపై ఏకకాలంలో దాడులు చేసింది. నేడు ఇరాన్ చేసిన ఎదురు దాడుల్లో బెహ్రెయిన్, కువైట్, ఓమన్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ దేశాల చమురు శుద్ధి కేంద్రాలు ప్రభావితం అయ్యాయి. నేడు ఇరాన్ పక్షాన మిలిటెంట్ గ్రూపులు కూడా రంగంలోకి దిగుతున్నాయి. అమెరికా చర్చలకు సిద్ధమని ప్రకటించినా ఇరాన్ ససేమిరా అంటోంది. 'స్ట్రేట్ ఆఫ్ హర్మోజ్' జల సంధి సముద్ర రవాణా మార్గాన్ని ఇరాన్ మూసి వేయడంతో ప్రపంచ దేశాల 20 శాతం చమురు సరఫరా ఆగి పోయింది. దీనితో ప్రపంచ దేశాల్లో, ముఖ్యంగా భారత్, చైనా, జపాన్ లాంటి దేశాలకు చమురు రవాణా ఆగి పోయింది. 9 కోట్లకు పైగా జనాభా కలిగిన ఇరాన్‌కు 6.10 లక్షల క్రియాశీలత సైన్యం ఉన్నది. 28 ఫిబ్రవరి రోజున ఇజ్రాయిల్ చేసిన సైనిక దాడుల్లో అపార ప్రాణ ఆస్తి నష్టాలు నమోదు అవుతున్నాయి. అమెరికా ప్రారంభించిన "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" ఫలితంగా ఇరాన్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఆపరేషన్‌లో భాగంగా వైమానిక, సముద్ర తలాల మీదుగా ముప్పేట దాడులు కొనసాగుతున్నాయి. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తున్నామని అనుకున్న అమెరికా-ఇజ్రాయిల్ దేశాలు తీవ్ర బాంబు ఇరాన్ ప్రతీకార దాడులను ఎదుర్కొంటున్నాయి. భారతదేశ చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతుల మీదనే ఆధారపడి ఉన్నది. హార్మోజ్ జల సంధి మూసి వేయడంతో బ్యారెల్ ముడి చమురు ధరలు 80 డాలర్లకు చేరిందని, రానున్న రోజుల్లో మరింత పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. దీనితో పాటు గ్యాస్, ఖనిజాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, బంగారం, వెండి, వ్యవసాయ పరికరాలు, సన్‌ఫ్లవర్ ఆయిల్, సబ్బులు, తలనూనె, ఎరువులు, బిస్కెట్లు, షాంపులు లాంటి అనేక నిత్యావసర సరుకుల దిగుమతులు భారమై, రవాణా దూరమై ధరలు పెరగనున్నాయి. ఈ జల సంధిని మూసివేయడంతో 13 దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు భారమై పోతున్నాయి. భారత్ రోజుకు వినియోగించే 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురులో దాదాపు 2 మిలియన్ బ్యారెళ్లు ఈ జల సంధి నుంచి మాత్రమే సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉండగా, మరో 25 రోజులకు సరిపడా చమురు రవాణా మార్గంలో ఉన్నాయని భారత ప్రభుత్వం వెల్లడిస్తున్నది. ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికాలతో దగ్గరి సంబంధాలను కొనసాగిస్తున్న భారత్ నేడు ఈ దేశాలను సంయమనం పాటించాలని, చర్చల ద్వారా సమస్యల పరిష్కరించుకోవాలని ప్రకటన చేయడం మినహా మరో మార్గం కనిపించడంతో లేదు. ట్రంప్-నెతన్యాహు ద్వయానికి సత్వరమే సద్బుద్ధి కలగాలని, ఇరాన్ కూడా సంయమనం పాటించాలని కోరుతున్నది. ఏది ఏమైనా "అంతర్జాతీయ నిరాయుధీకరణ, వ్యాప్తి నిరోధక అవగాహన దినం" వేదికగా నేటి యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చి మూడవ ప్రపంచ యుద్ధానికి దారి తీయవద్దని ఆశిద్దాం.

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు

**హైదరాబాద్ పెన్ పవర్:** అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమా లను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయ కారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీ యులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు. త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాల పై, ఉపనిషత్తులపై ఆయన కున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అల వర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్య దంపతులకు త్యాగ రాజు మూడవ సంతానంగా జన్మిం చారు. అయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలు గు బ్రాహ్మణులు. త్రిలింగ వైదీకులు. అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువా రూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి , శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు. తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహా లను పూజిస్తూ, ,"ఉంఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాము నిపై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువ తిని వివాహ మాడారు. పార్వతి చిరు ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడా రు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు. కానీ, మనమడు చిన్నతనం లోనే మృతి చెందడం తో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణ య్య శిష్యరికంలో 13వ ఏటనే "నమో నమో రాఘవా" అనే కీర్తనను "దేశిక తోడి రాగం"లో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజ పంచరత్న కృతులలో ఐదవది అయిన, "ఎందరో మహానుభావులు" కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్ప తనాన్ని గుర్తించిన గురువు, తంజా వూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించాడు. కానీ తనకు "నిధి కన్నా రాముని సన్నిధి సేవే సుఖమ"ని భావించి, త్యాగ య్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదా రాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యచే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేకం విగ్రహాలను, కావేరీ నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయా లు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు. "రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వ గాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే" స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, ఆ సందర్భంలోనే "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించాడు. మంత్రోపదేశం తో "స్వర్ణార్ణవం, నారదీయం" అనే రెండు సంగీత రహ స్యార శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్టానం, అని నాలుగు విధాలుగా గుర్తిం చారు. చాలావరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. జగదానంద కారకా అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారకా (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (అరభి), ఎందరో మహాను భావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ,)", అనేవి పంచ రత్న మాలికగా, "త్యాగరాజ ఆరాధనోత్సవాలలో" ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యూరు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణా న, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నాల నిర్మాణం గావించా రు. ఆయన శిష్యగణం అక్కడే సంస్మరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరుద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువయ్యూరులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధ నోత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలోనే సకల కళా నిలయమైన ధర్మపురి క్షేత్రంలో దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏటా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దేవస్థాన ఆస్థాన సంగీత విద్వాంసులు రాష్ట్ర ప్రభుత్వ సన్మానితులు సంగీత రత్న, కొరిడే నరహరి శర్మ ఆధ్వర్యంలో, మార్చి 4న ప్రారంభించ బడి, 6 వరకు రాష్ట్రంలోని లబ్ద ప్రతిష్టులు అయిన కళాకారులచే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# ఉగాదికి ఏం జరగుతుంది...

**విజయవాడ, మార్చి 4, పెన్ పవర్:**
ఏపీలో కూటమి ప్రభుత్వం కొత్త నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న తరుణంలో సమూల మార్పులు తీసుకురావాలని భావిస్తోంది. ముఖ్యంగా పాలనలో విప్లవాత్మక మార్పులు ప్రారంభించాలని చూస్తోంది. అందులో భాగంగా ఒక కొత్త మంత్రిత్వ శాఖను తెరపైకి తెస్తోంది. సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అనే కొత్త శాఖ రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ శాఖ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దగ్గరే ఉంది. అయితే దీని పేరిట ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి ఒక మంత్రికి బాధ్యతలు కట్టబెట్టె అవకాశం ఉంది. అయితే ఈ ఒక్క శాఖ కోసం మంత్రివర్గ విస్తరణ చేపడతారా? లేకుంటే భారీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తారా? అన్నది తెలియాల్సి ఉంది. రేపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ ఉంది. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణకు సంబంధించి కీలక నిర్ణయం దిశగా అడుగులు వేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ఉగాది నాటికి మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. మార్చి 7 వరకు కొనసాగనున్నాయి. తరువాత మంత్రివర్గ విస్తరణ పై ఒక క్లారిటీ రానుంది. కానీ అసెంబ్లీ లాబీల తో పాటు ఎమ్మెల్యేలు ఒకచోటకు చేరే క్రమంలో దీనిపైనే చర్చ నడుస్తోంది. ప్రముఖంగా ఓ ఐదుగురు పేర్లు వినిపిస్తున్నాయి. అయితే సమూల ప్రక్షాళన ఉంటుందన్న ప్రచారం మాత్రం నడుస్తోంది. టిడిపి నుంచి చాలామంది మంత్రులను తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇప్పటికే మెగా బ్రదర్ నాగబాబు కు మంత్రి పదవి ఖాయమని ఏనాడో తేలిపోయింది. అయితే కొత్తగా ఏర్పాటు చేసే సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ శాఖను ఆయనకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమావేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. హోలీ రోజున ఈ ఇద్దరు లంచ్ మీటింగ్ ఏర్పాటు చేసుకోవడానికి గల కారణాలపై అనేక రకాలుగా చర్చ జరుగుతుంది. కేవలం నామినేటెడ్ పోస్టులు, పాలనాపరమైన విషయాలపై చర్చించడానికి ఈ భేటీ జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. బలమైన కారణం ఉంటుందనే భావిస్తున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారం ప్రధానంగా కూటమి ప్రభుత్వానికి ఇబ్బందిగా మారిందని సొంత పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అనవసరంగా లడ్డూను పొడిగించి దానిని తెగే వరకూ టీడీపీ నాయకత్వమే లాగుతున్నారని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తాజాగా తిరుమలకు సంబంధించిన అనేక విషయాలు సోషల్ మీడియాలో నెట్టింట్ కనిపించడం, దానిపై ఎవరూ ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో అది కూడా తమ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని భావిస్తున్నారు. అందుకోసమే ప్రధానంగా ఈ సమావేశం జరుగుతుందని తెలిసింది. ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తారని, ప్రజల్లోకి మాత్రం కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందన్న అభిప్రాయం కూడా నేతల్లో కలుగుతుంది. అనవసరంగా రాద్ధాంతం చేయకుండా దీనికి ఫుల్ స్టాప్ ఎలా పెట్టాలి? ఎండ్ కు ఎలా తీసుకెళ్లాలన్న దానిపైనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య చర్చ జరిగే అవకాశముందని పార్టీ నేతలు

చెబుతున్నారు. కూటమిలోని టీడీపీ, జనసేన ప్రజాప్రతినిధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ప్రధానంగా వివాహేతర సంబంధాల విషయాలు కూటమి ప్రభుత్వాన్ని ఇబ్బందికరంగా మారాయి. ఇటీవల రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు తాజాగా మరొక దేవస్థానం కమిటీ ఛైర్మన్ పై కూడా ఆరోపణలు చేయడం పార్టీ ప్రతిష్ట మంటగలుస్తుందని, ఇటువంటి విషయాలు ప్రజల్లోకి వేగంగా, తొందరగా

చొచ్చుకు వెళతాయని అందుకే దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై పవన్, చంద్రబాబు నాయుడులు చర్చించినట్లు సమాచారం. అయితే యాక్షన్ తీసుకుంటే ఎలా ఉంటుంది? తీసుకోకుండా దీనిపై ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై కూడా చర్చ నడిచినట్లు విశ్వసనీయ సమాచారం. కూటమిలో బీజేపీ నేతల జోలికి వెళ్లే ధైర్యం లేక, జనసేన, టీడీపీ నేతలనే వైసీపీ లక్ష్యంగా చేసుకుందన్న అభిప్రాయం కూడా ఈ భేటీలో వ్యక్తమయినట్లు తెలిసింది

# రంగంలోకి దిగిన ఏకసభ్య కమిషన్

**తిరుమల, మార్చి 4, పెన్ పవర్:**
తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై మరింత లోతైన విచారణ కోసం, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడటం కోసం విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేష్ కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇప్పుడు తన విచారణను వేగవంతం చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కి సరఫరా అయిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందన్న నివేదిక బయటకు రావడంతో కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఈ అంశంపై ఇప్పటికే సిట్, సిబిఐ విచారణలు చేశాయి. వాటిని ఆధారంగా చేసుకుని గత ప్రభుత్వ హయాంలో నెయ్యి సేకరణ విధానాలు, టెండర్ల ప్రక్రియ, నాణ్యత పరీక్షల్లో జరిగిన లోపాలను వెలికితీయడానికి ప్రభుత్వం దినేష్ కుమార్ కమిషన్‌ను నియమించింది. దినేష్ కుమార్ కమిషన్ కేవలం కల్తీ జరిగిందా లేదా అని తేల్చడానికే పరిమితం కాకుండా, వ్యవస్థాగత మార్పులపై దృష్టి సారించనుంది. తక్కువ ధరకే నెయ్యి సరఫరా చేసేందుకు కంపెనీలు ఎలా ముందుకు వచ్చాయి? నిబంధనల ఉల్లంఘన జరిగిందా? అన్నది పరిశీలిస్తుంది. టీటీడీ ల్యాబ్‌లలో పరీక్షలు ఎందుకు విఫలమయ్యాయి? సరఫరాదారులు పంపిన నమూనాలను నిశితంగా ఎందుకు పరిశీలించలేదు? లాంటి అనేక అంశాలను సమీక్షిస్తుంది. గత బోర్డు నిర్ణయాల్లో రాజకీయ ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా అన్న కోణంతో పాటు భవిష్యత్తులో నెయ్యి సేకరణ ఎలా ఉండాలి? స్వచ్ఛమైన ఆవు నెయ్యిని సేకరించేందుకు అత్యుత్తమ మార్గాలేవి? అనే అంశాలపై నివేదిక ఇవ్వనుంది. కమిషన్ ఇప్పటికే తన కార్యకలాపాలను ప్రారంభించింది. తిరుమల చేరుకున్న దినేష్ కుమార్, నెయ్యి ట్యాంకర్ల రికార్డులు, మార్కెటింగ్ విభాగం ఫైళ్లను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత ఐదేళ్లలో నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్ల వివరాలు, వారి అర్హతలు, అప్పట్లో టీటీడీ అధికారులు తీసుకున్న నిర్ణయాలపై ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా, రివర్స్ టెండరింగ్ పేరుతో నాణ్యతను పక్కన పెట్టి ధరకే ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే ఈ సమస్య తలెత్తిందా అన్నది కమిషన్ ప్రధానంగా విశ్లేషిస్తోంది. ఈ కమిషన్ ఏర్పాటుపై ప్రతిపక్షాల నుండి కొన్ని విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే సిట్ విచారణ జరుగుతుండగా, మళ్లీ ఐఏఎస్ కమిషన్ అవసరమా అన్నది వారి ప్రశ్న. అయితే, సిట్ అనేది క్రిమినల్ కోణంలో ఎవరు నేరం చేశారనేది విచారిస్తుంది, కానీ దినేష్ కుమార్ కమిషన్ పరిపాలనాపరమైన లోపాలను సరిదిద్దడానికి ఉద్దేశించినదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. దినేష్ కుమార్ కమిషన్ ఇచ్చే నివేదిక టీటీడీ చరిత్రలో అత్యంత కీలకం కానుంది. కేవలం నిందితులను శిక్షించడమే కాకుండా, రాబోయే రోజుల్లో తిరుమలకు నెయ్యి సరఫరా చేసే కంపెనీలకు కఠినమైన నిబంధనలు, అత్యాధునిక ల్యాబ్ పరీక్షలు, పారదర్శకమైన సేకరణ విధానాలను ఈ కమిషన్ సూచించనుంది. ఈ విచారణ ద్వారా వాస్తవాలు బయటకు వచ్చి, శ్రీవారి ప్రసాదానికి మళ్లీ పూర్వ వైభవం లభిస్తుందని భక్తులు ఆశిస్తున్నారు

# తమిళనాడుపై రోజా ఫోకస్

**తిరుపతి, మార్చి 4, పెన్ పవర్:**
ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు పొందిన రోజా ఇప్పుడు తమిళంపై ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తున్నారు. ముఖ్యంగా అక్కడి డీఎంకే అధినేత స్టాలిన్ పుట్టినరోజు వేడుకలకు హాజరై సందడి చేశారు రోజా. డీఎంకేకు మద్దతుగా తన గళం వినిపించారు. సమాజంలో మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న స్టాలిన్ సర్కార్ ను మరోసారి ఎన్నుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారుస్టాలిన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను రోజా ఆకాశానికెత్తారు. ముఖ్యంగా తమిళనాడులో మహిళల ఆర్థిక భద్రత కోసం ప్రతినెలా వారి ఖాతాల్లో నేరుగా వెయ్యి రూపాయలు జమ చేయడం వంటి పథకాలు మహిళా సాధికారతకు నిదర్శనమని ఆమె కొనియాడారు. ఇదే తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏపీలో మహిళలకు నేరుగా నగదు అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ప్రతిపక్షాలకు భయం పట్టుకుందని రోజా వ్యాఖ్యానించారు. ఇటీవల మహిళల ఖాతాల్లో ఒకేసారి ఐదు వేల రూపాయలు జమ చేయడంతో విపక్ష నేతలకు ఏం చేయాలో పాలుపోవడం లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని తాను పూర్తిస్థాయిలో సమర్థిస్తున్నానని, దీనివల్ల కూలి పనులకు వెళ్లే పేద మహిళలకు, విద్యార్థులకు ఎంతో ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంతటి గొప్ప మనసున్న నాయకుడిని తమిళ ప్రజలు భారీ మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలని, సంక్షేమ పథకాల



ద్వారా పొందుతున్న లబ్ధికి ప్రతిఫలంగా స్టాలిన్‌కు ఓటు వేసి రుణం తీర్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఒకవైపు ఏపీ రాజకీయాల్లో చురుగ్గా ఉంటూనే, తమిళ గడ్డపై డీఎంకే తరపున రోజా గళం విప్పడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. యస్సార్ కాంగ్రెస్ పార్టీ తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా నిలవాలని చూస్తోంది. ఎందుకంటే తమిళనాడులో తెలుగు ప్రజలు అధికం. ఆపై రాయలసీమకు దగ్గరగా ఉంటుంది తమిళనాడు. ఈ క్రమంలో మరికొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల్లో స్టాలిన్ పార్టీ గెలవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలంగా కోరుకుంటుంది. కరుణానిధి ఉండే సమయంలో చంద్రబాబుతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవి. స్టాలిన్ విషయానికి వస్తే చంద్రబాబుతో మంచి సంబంధాలే కానీ.. కేంద్రంలో బిజెపితో టిడిపి ఉండడంతో స్టాలిన్ స్నేహానికి అడ్డంకిగా మారింది. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డితో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వచ్చారు స్టాలిన్. ఈ నేపథ్యంలో తమిళనాడు ఎన్నికల్లో స్టాలిన్ పార్టీకి మద్దతుగా ప్రచారం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. బలం పెంచుకోవాలను కుంటున్న బిజెపి.. తమిళనాడులో బలం పెంచుకోవాలని చూస్తోంది భారతీయ జనతా పార్టీ. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు షేర్ పెరిగింది ఆ పార్టీకి. సీట్ల పరంగా ఒక్కటి కూడా రాకపోయినా ఓట్ల పరంగా మాత్రం మెరుగుపడింది. అందుకే ఈసారి మిత్రులతో ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లో అధికార పార్టీకి ధీటుగా నిలబడాలని చూస్తోంది. ఏ అవకాశాన్ని జారవిడుచుకోవడం లేదు.. ఇటువంటి పరిస్థితుల్లో ఆచితూచి వ్యవహరిస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఏపీలో కూటమిపై విమర్శలు చేస్తుందే తప్ప.. కేంద్ర బిజెపిని పల్లెత్తు మాట అనడం లేదు. అయితే ఇప్పుడు తమిళనాడులో వైసిపి తీసుకున్న స్టాండ్ తో బిజెపి ఎలాంటి చర్యలకు దిగుతుందో చూడాలి. అయితే ఇప్పటివరకు కేంద్ర బిజెపి విషయంలో వైసీపీ సానుకూల నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. లోక్సభ స్పీకర్ ఎంపిక నుంచి పార్లమెంట్లో ప్రవేశపెట్టి పలు బిల్లుల వరకు మద్దతు తెలిపింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అటువంటిది తమిళనాడులో డీఎంకే కూటమికి మద్దతు అంటే సాహసంతో కూడుకున్న పని. అయితే అది రోజా స్వయంగా తీసుకున్న నిర్ణయమా? పార్టీ తీసుకున్న నిర్ణయమా? అన్నది తెలియాల్సి ఉంది. ఒకవేళ రోజా సొంతంగా నిర్ణయం తీసుకుంటే మాత్రం వైసీపీని ఇరకాటంలో పెట్టినట్టే..

## హైదరాబాద్ కు గంటన్నర లోపే...



**విజయవాడ, మార్చి 4, పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రంలోని ఫ్యూచర్ సిటీ నుంచి ఏపీ రాజధాని అమరావతి మధ్య ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు సమాంతరంగా అత్యాధునిక సెమీ బుల్లెట్ ట్రైన్ రానుంది. ఇది అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి అమరావతికి గంటన్నరలో దూసుకెళ్లొచ్చు. హైదరాబాద్ నుంచి చెన్నైకు కేవలం 3 నుంచి 3.30 గంటల్లోనే చేరుకోవచ్చు. మార్గంలో సెమీ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పనులు ప్రారంభానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. హైస్పీడ్ కారిడార్ అలైన్‌మెంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలతో ప్రాజెక్టు స్వరూపమే పూర్తిగా మారిపోయింది. గతంలో పేర్కొన్న రూట్‌కు బదులు ప్రస్తుతం నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే పక్కనుంచే రైల్వేలైన్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ప్రభుత్వం ప్రతిపాదనకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. దీంతో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకు వెళ్లే హైస్పీడ్ రైలుకు మిర్యాలగూడ మీదుగా సాగే కొత్త మార్గంలో ప్రాథమిక సర్వే పూర్తిచేసి, అలైన్‌మెంట్ డ్రాఫ్టును రైల్వే బోర్డు సిద్ధం చేసింది. హైదరాబాద్ టూ చెన్నై హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టు పూర్తయితే.. ఏపీ, తెలంగాణ రాజధానుల మధ్య దూరం సగానికిసగం తగ్గుతుంది. ప్రస్తుతం రైలులో హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లాలంటే ఐదు గంటల సమయం పడుతుంది. అదే సెమీ బుల్లెట్ ట్రైన్ అందుబాటులోకి వస్తే గంటన్నర సమయంలోనే హైదరాబాద్ నుంచి ఏపీ రాజధానికి చేరుకోవచ్చు. ఇదిలాఉంటే.. ఒకే కారిడార్‌లో రోడ్డు, రైలు మార్గాలు ఉండటం వల్ల లాజిస్టిక్స్ ఖర్చు భారీగా తగ్గుతుంది. సెమీ బుల్లెట్ ట్రైన్ గంటకు 250 కిలోమీటర్ల పైచిలుకు వేగంతో దూసుకుపోయేలా టెక్నాలజీని వినియోగిస్తారు. దీంతో ఈ కారిడార్‌ను నేరుగా చెన్నై వరకు పొడిగించడం ద్వారా హైదరాబాద్ టూ చెన్నైకు మూడు నుంచి మూడున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని రాబోయే ఐదేళ్లలోపు పూర్తి చేయాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డీపీఆర్ పూర్తయిన వెంటనే ఏఏ గ్రామాల మీదుగా అలైన్‌మెంట్ వెళ్తుందనే కచ్చితమైన వివరాలతో త్వరలో నోటిఫికేషన్లు వెలవడే అవకాశం ఉంది.

## అప్పలరాజుకు దూరమౌతున్న కేడర్

**శ్రీకాకుళం, మార్చి 4, పెన్ పవర్:** మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు.. ఏపీ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ అని పేరు. 2019లో పలాస నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచినా.. జగన్ కేబినెట్‌లో కీలక శాఖ దక్కించుకున్నారు. అప్పట్లో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలోనూ పదవి నిలబెట్టుకున్నారు. జగన్‌కి నమ్మినబంటులా ఉంటూ వస్తున్న ఆయన.. అధినేతపై ఎవరు విమర్శలు చేసినా.. వెంటనే కౌంటర్ ఎటాక్ చేస్తుంటారు. అలాంటి నాయకుడిపై ఇప్పుడు సొంత పార్టీలోనే ఇబ్బందులు ఎదురవతున్నాయా అనే ప్రచారం జరుగుతోంది. పార్టీలో లుకలుకలతో ఆయన సర్దుబాటు కావడం లేదట. అసమ్మతి నేతలు ఆయనకు మరింత తలపోటుగా మారారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. తన గెలుపులో కీలకంగా వ్యవహరించిన నేతలను.. సీదిరి పక్కన పెట్టారనే చర్చ ఎప్పటి నుంచో వినిపిస్తోంది. ఓ కోటరీని నమ్ముకొని.. దాని మధ్యలోనే ఉండిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయ్. దువ్వాడ శ్రీకాంత్‌తో పాటు.. దువ్వాడ హేంబాబు చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు లాంటి సీనియర్ నేతలు.. వైసీపీని విడిచి వెళ్లిపోయింది కూడా సీదిరి తీరు నచ్చకే అనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఈ ప్రభావం గత ఎన్నికల్లోనూ కనిపించింది. గత ఎన్నికల్లో గౌతు శిరీష చేతుల్లో భారీ పరాభవాన్ని మూటగట్టుకున్నారు సీదిరి. ఐతే ఓటమి తర్వాత కూడా ఆయనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని.. పలాస నేతల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్ర రాజకీయాలపై ఎప్పటికప్పుడు స్పందించే సీదిరి.. నియోజకవర్గంలో మాత్రం పార్టీని పట్టించుకోవడం లేదని.. తన చుట్టూ ఉన్న వారితోనే పార్టీని నడపాలని చూస్తున్నారని ఫ్యాన్ పార్టీ నేతల్లో ఆగ్రహం కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీలో కీలకంగా ఉన్న ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ బల్లగిరిబాబు, మరో సీనియర్ నేత దువ్వాడ శ్రీధర్ కూడా తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఇలా సీదిరి తీరు నచ్చక.. నేతలంతా ఒక్కొక్కరిగా దూరం అవుతున్నారనే గుసగుసలు పలాసలో జోరుగా వినిపిస్తున్నాయ్. పార్టీ కోసం కష్టపడే వారిని.. సీదిరి అప్పలరాజు కనీసం పట్టించుకోవడం లేదంటూ.. వైసీపీ కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పించే పరిస్థితులు కనిపిస్తున్నాయనే టాక్ నడుస్తోంది. వైసీపీలో కీలక నేతగా ఉన్న దువ్వాడ శ్రీధర్.. సీదిరికి వ్యతిరేకంగా ఓ గ్రూప్ క్రియేట్ చేస్తున్నారు. పలాస ఉద్యమాన్ని ఎత్తుకున్నారు. పలాసను జిల్లా చేయాలంటూ జేఏసీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవన్నీ.. మాజీమంత్రి సీదిరి అప్పలరాజుకు తలపోటుగా మారాయనే చర్చ జరుగుతోంది. అటు పార్టీ అసలే కష్ట కాలంలో ఉంది. ఇలాంటి సమయంలో నేతలంతా ఒక్కొక్కరుగా దూరం అవుతుండడంతో.. కేడర్ కూడా డీలా పడిపోతోందట. సీదిరి దూకుడు రాజకీయాలతో.. అసలుకే మోసం వస్తుందని.. కార్యకర్తలు వాళ్లలో వాళ్లు చర్చించుకున్నారని తెలుస్తోంది. పార్టీలో గ్రూప్‌ల గోల ఎక్కువ అయితే.. ఎన్నికల నాటికి మరింత ఇబ్బంది అవుతుందని.. అందరిని కలుపుకొని వెళ్లినప్పుడే రాజకీయంగా గౌతు కుటుంబాన్ని ఢీకొట్టే అవకాశం ఉంటుందని.. ఫ్యాన్ పార్టీలో మరికొందరు నేతలు సూచిస్తున్నారు.

## ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

**విజయవాడ, మార్చి 4, పెన్ పవర్:** :తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య మరోసారి రగడ మొదలయింది. దేవుడి ముందే చిల్లర తగవు పడటం మరింతగా ఇద్దరూ రాజకీయంగా దూరమయినట్లేనని చెబుతున్నారు. స్వామి వారికి సమర్పించే పట్టువస్త్రాలను అవమానించే విధంగా ప్రవర్తించారని ఇరు వర్గాలు ఆరోపించుకుంటున్నాయి. తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి.. ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం రేగింది. గంపలగూడెంలోని నెమలి వేణుగోపాలస్వామి కళ్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు ఎవరు సమర్పించాలనే విషయంలో వివాదం తలెత్తింది. ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం.. తోపులాటజరగడంతో పోలీసులు సర్ది చెప్పి పంపాల్సి వచ్చింది. ఎంపీ కేశినేని చిన్ని పట్టువస్త్రాలు సమర్పించడానికి ప్రయత్నించగా అతని తలపై ఉన్న వస్త్రాలను కొలికపూడి శ్రీనివాసరావు లాక్కున్నారు. ఇద్దరి వ్యవహారంపై అర్చకులు సహా భక్తుల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇరువురు నేతలు గౌరవమైన పదవులలో ఉండి ఆలయంలో ఇవేం చిల్లర వేషాలు అంటూ భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారికి ఎవరో ఒకరు పట్టు వస్త్రాలు సమర్పించాలి కానీ, అక్కడ కూడా ఆధిపత్యం, రాజకీయాలు చేస్తే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి చిల్లర తగాదాలతో ఇద్దరూ ప్రజల్లో పలుచన అవుతున్నారన్న భావన వ్యక్తమవుతుంది. ఇరువురు ఒకేసారి ఆలయంలోకి రావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. రెండు వర్గాలకు చెందిన నేతలు తోపులాటలు ఆలయంలో చోటు చేసుకోవడం దురదృష్టకరమని అంటున్నారు. రాజకీయ నాయకులటీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా ఇద్దరి వ్యవహారం మారింది. గతంలో అనేక సార్లు వీరిద్దరి మధ్య వివాదానికి చెక్ పెట్టాలని ప్రయత్నం చేసినా ఫలితం కనిపించడం లేదు. చంద్రబాబు హెచ్చరించినా ఫలితం లేదు. చంద్రబాబు మాత్రం సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా వీరిద్దరి విషయంలో ఏమీ చేయలేక పోతుందని సొంత పార్టీ నుంచి కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇటీవల ఇరువురు నేతలు సోషల్ మీడియా వేదికగా రచ్చ చేసుకోవడంతో పార్టీ పరువు బజారున పడింది. ఇప్పుడు ఏకంగా ఆలయంలోనే ఘర్షణకు దిగడంతో ఇక తిరువూరు యుద్ధంలో ఏదో నిర్ణయం తీసుకోకపోతే పార్టీ వచ్చే ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేనట్లే కనిపిస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇరాన్‌పై సైనిక చర్యను ఖండించిన ఫ్రాన్స్



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక దాడులను ఫ్రాన్స్ తీవ్రంగా ఖండించింది. ఇటువంటి చర్యలు అంతర్జాతీయ చట్టం పరిధికి వెలుపల ఉన్నాయని, ఫ్రాన్స్ వాటిని అంగీకరించదని ఆ దేశ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అన్నారు. ఈ సమస్యకు దౌత్యపరమైన పరిష్కారం ఉండాలని ఆయన పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాన్ని గౌరవించకుండా ఏకపక్ష దాడులు ఈ ప్రాంతంలో శాంతిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని ఫ్రెంచ్ విదేశాంగ మంత్రి జీన్-నోయెల్ బారోట్ అన్నారు. ఇటువంటి దాడులను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చర్చించి ఉండాలి. ఐక్యరాజ్యసమితి లేకుండా జరిపే సైనిక చర్యలకు చట్టపరమైన చెల్లుబాటు లేదని కూడా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తత వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో మధ్యధరా సముద్రానికి విమాన వాహక నౌక 'చార్లెస్ డి గల్లె'ను పంపాలని ఫ్రాన్స్ ఆదేశించింది. క్షిపణి మరియు డ్రోన్ దాడుల నుండి మిత్రదేశాలను రక్షించడానికి ఈ చర్య చేపడుతున్నట్లు తెలిపారు. ఖమేనీ హత్యపై కాశ్మీర్‌తో సహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో నిరసనలు వ్యాపించిన నేపథ్యంలో, మధ్యప్రాచ్యంలో శాంతి కోసం తక్షణ జోక్యం చేసుకోవాలని ఫ్రాన్స్ కూడా పిలుపునిచ్చింది.

## ఆయుధాల ఉత్పత్తిపై అమెరికా కీలక సమావేశం!




ఇరాన్‌పై జరిగిన తాజా దాడుల అనంతరం తగ్గిన ఆయుధ నిల్వలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసే అంశంపై చర్చించడానికి ట్రంప్ పరిపాలన శుక్రవారం వైట్ హౌస్ లో అగ్రశ్రేణి రక్షణ కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం కానుందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది. ఈ సమావేశానికి లాక్‌హీడ్ మార్టిన్ మరియు రేథియాన్‌తో వంటి ప్రధాన కంపెనీల కార్యనిర్వాహకులను ఆహ్వానించినట్లు సమాచారం. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, సరఫరా లోటును తగ్గించే దిశగా ఆయుధ తయారీదారులను వేగంగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేయడంపై ఈ చర్చలు కేంద్రీకృతమవుతాయని ప్రణాళికకు పరిచయమున్న వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడులతో పాటు ఉక్రెయిన్ మరియు గాజాలో కొనసాగుతున్న యుద్ధాల కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు గణనీయంగా తగ్గినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. దీంతో సరఫరాలను త్వరితగతిన పునరుద్ధరించాల్సిన అవసరం పెరిగినట్లు తెలుస్తోంది. అయితే, సోమవారం సోషల్ మీడియా వేదికలో చేసిన ఒక పోస్టులో మాజీ అధ్యక్షుడు ట్రంప్ అమెరికా వద్ద ఆయుధ సామగ్రి "వాస్తవంగా అపరిమితంగా ఉంది" అని, అవసరమైతే ఈ సామగ్రితో యుద్ధాలను "ఎప్పటికీ" విజయవంతంగా కొనసాగించగలమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పెంటగాన్ నిల్వల పునరుద్ధరణ చర్యలు, రాజకీయ ప్రకటనల మధ్య వ్యత్యాసంపై చర్చ కొనసాగతోంది.

## ఆగని మారణ హోమం

అమెరికా సామ్రాజ్యవాద కరాళనృత్యం 787 మంది ప్రాణాలను బలిగొంది. అమెరికా-ఇజ్రాయిల్ సేనలు, ఇరాన్ దళాల మధ్య వరుసగా నాలుగో రోజు కూడా భీకర పోరు కొనసాగుతుంది. మరోవైపు హిజ్బొల్లా కూడా రంగంలోకి దిగడంతో మధ్యప్రాచ్యంలో భయానక వాతావరణం కన్పిస్తోంది. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ మంగళవారం పెద్ద ఎత్తున దాడులకు తెగబడింది. అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతంలో ఉన్న హిజ్బొల్లా టీవీ, రేడియో స్టేషన్ భవనాలపై ఇజ్రాయిల్ జరిపిన దాడిలో తీవ్ర నష్టం వాటిల్లింది. హెజ్బొల్లాకు చెందిన అల్-మనార్ టీవీ ప్రసారాలు సుమారు గంట పాటు నిలిచిపోయాయి. శివారు ప్రాంతాలను ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. అక్కడి ప్రజలను ఖాళీ చేయాలంటూ హుకుం జారీ చేసింది. మరోవైపు ఇరాన్‌లోని ఓ ప్రాథమిక పాఠశాలపై అమెరికా-ఇజ్రాయిల్ సేనలు జరిపిన వైమానిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన 160 మంది అమాయక బాలికలను సాముహికంగా ఖననం చేశారు. వైమానిక దాడిలో బాలికల శరీరాలు ఛిద్రమై పోయాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి చెందిన ఏడు ఎమిరేట్స్‌లో ఒకటైన ఫుజైరాలోని చమురు కేంద్రం నుంచి అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. అంతకుముందు చమురు కేంద్రం పైకి దూసుకొచ్చిన డ్రోన్‌ను భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అయినప్ప టికీ శకలాలు చమురు పరిశ్రమ జోన్‌లో పడడంతో మంటలు వ్యాపించాయి. అమెరికా దాడిలో ఇరాన్‌లోని భూగర్భ నతంజ్ ఫ్యూయల్ ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్‌ఈపీ) ప్రవేశ భవనాలు కొంతమేర దెబ్బతిన్నాయని ఐరాసకు చెందిన ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ తెలిపింది. అయితే అణుధార్మిక పరిణామాలు సంభవించే ప్రమాదం ఏమీ లేదని చెప్పింది. ఇరాన్ సైనిక, ప్రభుత్వ కార్యాలయాలే లక్ష్యంగా అమెరికా వైమానిక దాడులు జరపగా ఇరాన్ కూడా ప్రతీకార దాడులు జరిపింది. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై పెద్ద ఎత్తున దాడులు చేసింది. దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో సంక్షోభం తీవ్రతరమైంది. భూతల దాడులు జరిపే అవకాశాన్ని తోసిపుచ్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. దీర్ఘకాల పోరుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఇజ్రాయిల్ మాత్రం భూతల దాడులు ఆచరణ సాధ్యం కావని చెప్పింది.

## మధ్యవర్తిత్వానికి ముందకొచ్చిన పుతిన్



మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలను కొంత వరకైనా నివారించే విషయంలలో మధ్యవర్తిత్వం వహించేందుకు రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ముందుకొచ్చారు. నాలుగు అరబ్ దేశాల నేతలతో ఆయన టెలిఫోన్‌లో సంభాషించారు. ఉద్రిక్తతల నివారణకు ఇరాన్‌తో తనకున్న సంబంధాలను ఉపయోగించుకుంటానని వారికి తెలిపారు. కాగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల కారణంగా పశ్చిమాసియా దేశాలే కాకుండా అరబ్ దేశాలు కూడా అణ్వాయుధాల సముపార్జనకు ప్రయత్నిస్తాయని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్‌రోవ్ హెచ్చరించారు. ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు అణ్వాయుధ వ్యాప్తికి దోహదపడతాయని, అప్పుడు పరిస్థితి మన చేతుల్లో ఉండదని తెలిపారు.

# దెబ్బలు తింటూ ఊరుకోం.. మార్కో రూబియో



మధ్యప్రాచ్యంలో యుద్ధ జ్వాలలు ఎగిసిపడుతున్న వేళ.. ఇరాన్‌పై అమెరికా జరిపిన మెరుపు దాడులకు సంబంధించిన సంచలన వాస్తవాలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడులకు సిద్ధమవుతోందని తెలిసిన తర్వాత.. తమ సైనికుల ప్రాణాలను కాపాడుకోవడానికే అమెరికా ఈ కఠిన నిర్ణయం తీసుకుందని ఆయన స్పష్టం చేశారు. కేవలం రక్షణ కోసం చూస్తూ కూర్చుంటే అమెరికా భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చేదని ఆయన హెచ్చరించారు. సోమవారం విలేకరులతో మాట్లాడిన రూబియో.. ఇరాన్‌పై దాడికి గల కారణాలను విశ్లేషించారు. "ఇజ్రాయెల్ దాడి చేయబోతోందని మాకు తెలుసు. ఆ దాడి జరిగిన వెంటనే ఇరాన్ గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా బలగాలపై ప్రతీకార దాడులకు దిగుతుందని మా వద్ద స్పష్టమైన సమాచారం ఉంది. ఒకవేళ మేము ముందే అప్రమత్తమై వారి క్షిపణి వ్యవస్థలను దెబ్బ తీయకపోతే.. మా సైనికులు భారీగా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చేది. అందుకే ఎదురుదెబ్బ తినడం కంటే ముందే శత్రువును దెబ్బకొట్టాలని అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం అత్యంత తెలివైనది" అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ తన క్షేత్రస్థాయి కమాండర్లకు ఇచ్చిన ఆదేశాలను కూడా మార్కో రూబియో ఈ సందర్భంగా ప్రస్తావించారు. "అమెరికా లేదా ఇజ్రాయెల్ దాడులు చేస్తే.. పైఅధికారుల అనుమతి కోసం ఎదురు చూడకుండా తక్షణమే అమెరికా స్థావరాలపై దాడులు చేయాలని ఇరాన్ తన సైన్యానికి సూచించింది. ఒకవేళ ఇరాన్ మొదటి దెబ్బ కొట్టే వరకు మేము వేచి చూసి ఉంటే.. 'మీకు తెలిసినా ఎందుకు ఆపలేదు?' అని ఈరోజు మీరందరూ నన్ను ప్రశ్నించేవారు" అని రూబియో సమాధానం ఇచ్చారు.

# పాక్‌ను సామంత దేశంగా మార్చేందుకు కుట్ర



ఇరాన్-ఇజ్రాయెల్-అమెరికా మధ్య కొనసాగుతోన్న ఉద్రిక్తతలపై పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ స్పందిస్తూ.. ఇజ్రాయెల్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అణు ఒప్పందంపై ఇరాన్ చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ అమెరికా-ఇజ్రాయెల్ టెహ్రాన్‌పై యుద్ధం ప్రకటించాయని ఆరోపించారు. ఈ యుద్ధం వల్ల పాకిస్థాన్ కూడా ప్రభావితం అయ్యే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా తమ సరిహద్దుల వద్ద ప్రమాదకర పరిస్థితులను సృష్టిస్తున్నారన్నారు. అన్నివైపుల నుంచి శత్రువులు తమను చుట్టుముట్టడం వల్ల పాక్ సామంత దేశంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ విజయం సాధిస్తే భారత్, అఫ్గానిస్థాన్ ఏకమై.. పాక్‌ను టార్గెట్ చేసే అవకాశం ఉందని ఆసిఫ్ ఆందోళన వ్యక్తంచేశారు. దానివల్ల తమకే ఇబ్బందన్నారు. పాక్‌ను సామంత దేశంగా మార్చేందుకు ఇజ్రాయెల్ కుట్ర పన్నుతోందని.. ఈ కుట్రలో భారత్ భాగస్వామిగా ఉందని అక్కసు వెళ్లగక్కారు. 1948లో ఇజ్రాయెల్ ఏర్పడినప్పటి నుంచి ఇస్లామిక్ ప్రపంచాన్ని ప్రభావితం చేసే అన్ని సంఘర్షణలలో జియోనిజం (యూదు భావజాలం) ప్రత్యక్ష లేదా పరోక్ష పాత్ర పోషించిందని ఆసిఫ్ ఆరోపించారు. దశాబ్దాలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించేది జియోనిస్టులేనన్నారు.

# నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపి, శ్రీనగర్ మాజీ మేయర్‌లపై కేసు



శ్రీనగర్ : సోషల్‌మీడియాలో తప్పుడు కంటెంట్‌ను ప్రసారం చేశారనే ఆరోపణలపై నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) ఎంపి అగా సయ్యద్ రుహుల్లా మొహదీ, శ్రీనగర్ మాజీ మేయర్ జునైద్ అజీమ్ మట్టులపై కేసు నమోదైంది. భయాన్ని సృష్టించడం, శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం మరియు చట్టవిరుద్ధ కార్యకలాపాలను ప్రేరేపించే ఉద్దేశ్యంతో డిజిటల్ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో తప్పుడు, కల్పిత మరియు తప్పుదారి పట్టించే కంటెంట్‌ను ప్రసారం చేశారన్న విశ్వసనీయ సమాచారం ఆధారంగా వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ కంటెంట్ వక్రీకరించిన కథనాల వ్యాప్తిని మరియు ధృవీకరించని సమాచారాన్ని ప్రతిబింబిస్తుందని, శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం, సామాజిక అసమానతకు కారణమని పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో బిఎన్‌ఎన్‌ఎస్ సెక్షన్లు 197(1)(డి), 353(1)(బి)కింద రెండు ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులపై దర్యాప్తు చేపట్టామని అన్నారు. ఈ దేశ పౌరుడిగా మీ దురాగతాలకు, చట్టాల ఉల్లంఘనకు వ్యతిరేకంగా, తన హక్కులను కాపాడుకునేందుకు, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం కోసం చివరి రక్తపు బట్టువరకు పోరాడతానని ఎన్‌సి ఎంపి మెహదీ తెలిపారు. జమ్ముకాశ్మీర్ పోలీసులు మరియు యంత్రాంగంలోని కొందరు మూర్ఖులు తన భద్రతను తగ్గించడం, ఫేస్‌బుక్ ఖాతాను నిలిపివేయడం ద్వారా వారి దురాగతాలను ప్రపంచానికి తెలియకుండా చేయవచ్చని భావిస్తున్నారు. ఈ చర్య హాస్యాస్పదమని అన్నారు. అమెరికా -ఇజ్రాయిల్ సంయుక్త వైమానిక దాడిలో ఖమేనీ హత్యపై తన ప్రకటన కారణంగా భద్రతను ఉపసంహరించుకున్నారని మాజీ మేయర్ మట్టు తెలిపారు.

## క్రియాశీల రాజకీయాల్లోకి నితీష్ కుమారుడు



పాట్నా : బీహార్ సీఎం నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ త్వరలో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించే అవకాశముందని పార్టీ సీనియర్ నేత, మంత్రి శ్రావణ్ కుమార్ తెలిపారు. "హోలీ సందర్భంగా నిశాంత్ త్వరలో రాజకీయాల్లోకి రానున్నారు" అని ఆయన మీడియాకు చెప్పారు. అధికార ఎన్డీఏ మిత్రపక్షమైన జనతాదళ్ (యునైటెడ్) నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యుల పదవీకాలం ఏప్రిల్ 9న ముగియనుంది. వీరిలో రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్న హరివంశ్ నారాయణ్ సింగ్, కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ ఉన్నారు. మార్చి 16న జరగనున్న రాజ్యసభ ఎన్నికలకు మార్చి 5 నామినేషన్ల గడువు నేపథ్యంలో మంత్రి శ్రావణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్ నుంచి మొత్తం 16 రాజ్యసభ స్థానాల్లో ఐదు స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వీటిలో జేడీయూ నుంచి ఇద్దరు, మిత్రపక్షం రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) చీఫ్ ఉపేంద్ర కుష్వాహా ఒకరు, ప్రతిపక్ష రాష్ట్రీయ జనతా దళ్ నుంచి ప్రేమ్ చంద్ గుప్తా, అమరేంద్ర ధరి సింగ్ పదవీకాలం ముగుస్తోంది. 243 సభ్యుల అసెంబ్లీలో 202 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ఎన్డీఏ సులభంగా నాలుగు స్థానాలు గెలుచుకునే స్థితిలో ఉంది. ఐదో స్థానంపై ఎన్డీఏ, మహాఘటబంధన్ మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. జేడీయూ నుంచి నిశాంత్ కుమార్ పేరుతో పాటు రామ్ నాథ్ ఠాకూర్ పేరు కూడా చర్చల్లో ఉంది. అయితే హరివంశ్ నారాయణ్ సింగ్‌కు ఈసారి అవకాశం దక్కకపోవచ్చని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

## నేటి నుండి భారత్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడి పర్యటన



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ మార్చి 4 నుండి 7 వరకు భారతదేశాన్ని అధికారికంగా సందర్శించనున్నారు. ఈ పర్యటనలో ఆయన న్యూఢిల్లీలో జరిగే 11వ రైసినా డైలాగ్-2026కు ముఖ్య అతిథి మరియు ప్రధాన వక్తగా హాజరవుతారు. అధ్యక్షుడిగా స్టబ్ కు భారతదేశంలో పర్యటించడం ఇదే తొలిసారి. విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, ఈ పర్యటనలో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, వాణిజ్యం, ఆర్థిక భాగస్వామ్యం, బహుపాక్షిక వేదికలలో సహకారం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అధ్యక్షుడు స్టబ్ ప్రధానమంత్రితో పాటు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. చర్చల అనంతరం ప్రధాని మోడీ ఆయన గౌరవార్థం విందు ఏర్పాటు చేయనున్నారు. న్యూఢిల్లీ పర్యటన అనంతరం స్టబ్ ముంబైకి వెళ్లి మహారాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిని కలుసుకుని, ముంబై విశ్వవిద్యాలయంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. 2016 నుండి ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న రైసినా డైలాగ్‌ను విదేశాంగ మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహిస్తోంది. మార్చి 5-7 వరకు జరిగే ఈ సదస్సులో ప్రపంచ నాయకులు, విధాన నిర్ణేతలు పాల్గొని అంతర్జాతీయ అంశాలపై చర్చిస్తారు.

# అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా




చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. "బై నా ప్రియమైన క్వెన్," అని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు. అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్-ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది.జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు. నిష్క్రమణలపై స్పందించేందుకు అలీబాబా అధికారులు స్పందించలేదు. ఇదే సమయంలో హాంకాంగ్ మార్కెట్‌లో అలీబాబా షేర్లు 2.8% తగ్గి ముగిశాయి. మధ్యాహ్న ట్రేడింగ్‌లో 4% వరకు పతనమయ్యాయి. ఇటీవల క్వెన్ నవీకరించిన ఉత్పత్తులను విడుదల చేసిన రెండు రోజులకే ఈ రాజీనామా చోటుచేసుకుంది. క్వెన్ మొబైల్ యాప్ నెలవారీ క్రియాశీల వినియోగదారులు జనవరిలో 31.05 మిలియన్ల నుంచి ఫిబ్రవరిలో 203 మిలియన్లకు పెరిగినట్లు ఎఐసిపిబి వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఓపెన్ ఎఐ యొక్క 'చాట్ బాట్' మరియు బైట్ డాన్స్ డౌబావో యాప్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలో ఉంది. 2023 నుంచి అలీబాబా 400కు పైగా ఓపెన్ సోర్స్ 'క్వెన్' మోడళ్లను విడుదల చేసింది. ఈ మోడళ్లు ఇప్పటివరకు ఒక బిలియన్ సార్లు డౌన్‌లోడ్ చేయబడ్డాయని సంస్థ పేర్కొంది.

# చాట్‌జిపిటికి పెంటాగన్‌తో ఒప్పందం దెబ్బ




అమెరికా రక్షణ శాఖ (పెంటాగన్)తో ఓపెన్ ఎఐ కుదుర్చుకున్న వివాదాస్పద ఒప్పందంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్ తమ ఎఐ సాంకేతికతను సామూహిక నిఘాకు లేదా అటానమస్ ఆయుధాలకు ఉపయోగించకూడదని నిబంధన విధించడంతో పెంటాగన్ ఆ సంస్థను పక్కన పెట్టింది. ఆ వెంటనే చాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ రంగంలోకి దిగి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా అమెరికాలో చాట్‌జిపిటి యాప్ తొలగింపులు (అన్‌ఇన్‌స్టాల్) ఒక్కసారిగా 295 శాతం పెరగగా, వన్‌స్టార్ రేటింగ్‌లు 775 శాతం పెరిగాయి. ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి, యుద్ధాల్లో ఉపయోగించడానికి ఓపెన్ ఎఐ అంగీకరించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. రక్షణ ఒప్పందాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్‌కి చెందిన క్లాడ్ యాప్ డౌన్‌లోడ్లు 88 శాతం పెరిగి, అమెరికా యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుంది.ఈ వివాదంపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మాన్ స్పందిస్తూ.. పెంటాగన్ ఒప్పందం జరిగిన తీరు అస్తవ్యస్తంగా ఉందని అంగీకరించారు. ఆంత్రోపిక్‌తో పెంటాగన్‌కు విభేదాలు వచ్చిన వెంటనే ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల యూజర్లకు తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు. తమ ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి లేదా అటానమస్ ఆయుధాల తయారీకి ఉపయోగించకూడదనే నిబంధనలను స్పష్టం చేసినాకే తాము రక్షణ శాఖతో కలిసి పనిచేస్తున్నామని ఆయన వివరించారు.

# ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లకు చేరిన స్థూల జీఎస్‌టీ వసూళ్లు




జీఎస్‌టీ వసూళ్లు ఫిబ్రవరి నెలలో భారీగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నెలకు గాను రూ.1.83 లక్షల కోట్ల స్థూల జీఎస్‌టీ వసూలైనట్లు కేంద్రం ఆదివారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఇది 8.1 శాతం అధికం కావడం విశేషం.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫిబ్రవరి 28 నాటికి మొత్తం స్థూల జీఎస్‌టీ ఆదాయం రూ.20.27 లక్షల కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 8.3 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక ఫిబ్రవరిలో రూ.22,595 కోట్ల రీఫండ్లు చెల్లించారు. రీఫండ్లు సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.61 లక్షల కోట్లుగా నమోదైంది.దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.3 శాతం వృద్ధితో రూ.1.36 లక్షల కోట్లుగా ఉండగా.. దిగుమతుల ద్వారా వచ్చిన రాబడిలో మాత్రం 17.2 శాతం భారీ వృద్ధి కనిపించింది. దిగుమతుల ద్వారా రూ.47,837 కోట్లు సమకూరాయి. అయితే, సెస్ వసూళ్లు మాత్రం ఆందోళనకరంగా తగ్గాయి. గతేడాది ఫిబ్రవరిలో రూ.13,481 కోట్లుగా ఉన్న నికర సెస్.ఈసారి రూ.5,063 కోట్లకు పడిపోయింది.రాష్ట్రాల వారీగా చూస్తే మిశ్రమ ఫలితాలు కనిపించాయి. పారిశ్రామిక రాష్ట్రాల్లో వృద్ధి నమోదు కాగా, వనరుల ఆధారిత రాష్ట్రాల్లో వసూళ్లు తగ్గాయి. మహారాష్ట్ర రూ.10,286 కోట్ల వసూళ్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా.. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది.జీఎస్‌టీ 2.0 తర్వాత వసూళ్లు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ బలంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిగుమతుల రాబడి పెరగడం అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాల జోరును సూచిస్తోందని పేర్కొన్నారు.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని ఏ నౌక దాటాలని చూసినా నిప్పుపెడతామని ఇరాన్ చేసిన హెచ్చరికలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలు రానున్న రోజుల్లో దేశీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియని అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. దీంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 1,700 పాయింట్ల మేర క్షీణించింది. నిఫ్టీ 24,400 దిగువన కదలాడుతోంది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 1,670 పాయింట్ల మేర పతనమై 78,565 వద్ద ఉంది. నిఫ్టీ 513 పాయింట్లు కోల్పోయి 24,351 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. లార్సెన్, టాటా స్టీల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి. దక్షిణ కొరియా కొస్పి 12 శాతం మేర పడిపోయింది. దాంతో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా.. భారత్ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలై ఐదు రోజులు అవుతుండగా.. ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యుద్ధం తీవ్రమవుతుండటంతో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మదుపర్లను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. భారత్‌లో ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై ఈ ప్రభావం గురించి ఆందోళనలు నెలకొన్నాయి. యుద్ధం ముదురుతూ ఉంటే.. వాణిజ్యలోటు పెరుగుతుందని, రూపాయి బలహీనపడుతుందని, కార్పొరేట్ ఆదాయాలపై ఒత్తిడి ఉంటుందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో లార్సెన్ అండ్ టర్బో స్టాక్ 7 శాతం మేర కుంగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 3.5 శాతం క్షీణించింది. వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి, జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి, ఏకంగా 92.18 మార్క్‌ను తాకింది.

# 2 రోజులుగా పతనం.. మళ్లీ తగ్గిన బంగారం ధర




పసిడి ప్రియులకు అదిరే శుభవార్త. అమెరికా- ఇరాన్ యుద్ధం వేళ బంగారం ధరలు భారీగా పెరుగుతాయన్న అంచనాలను తలకిందులు చేస్తూ దేశీయ మార్కెట్ల పసిడి ధరలు వరుసగా రెండో రోజూ తగ్గాయి. గల్ఫ్ దేశాలపైన ఇరాన్ మిసైల్స్ దాడి చేస్తోంది. అమెరికా భీకర దాడులు ఉంటాయని ప్రకటించింది. దీంతో సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకుంటారు. గత రెండు రోజుల వరకు ఇదే జరిగినా ఇప్పుడు చాలా మంది ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్స్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆల్ టైమ్ హై స్థాయి నుంచి బంగారం ధరలు పతనమవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 5400 డాలర్ల గరిష్టాన్ని తాకి ఆ తర్వాత వెనక్కి తగ్గుతోంది. ఇక హైదరాబాద్ మార్కెట్లో పసిడి ధరలు ఈ రెండు రోజుల్లోనే తులంపై ఏకంగా రూ.3000 వరకు తగ్గాయి. దేశీయ మార్కెట్లో 22 క్యారెట్లబంగారం రేటు క్రితం రోజు తులంపై రూ.2350 మేర తగ్గిన సంగతి తెలిసిందే. అదే ట్రెండ్ కొనసాగిస్తూ ఈరోజు మరో రూ.450 మేర తగ్గింది. దీంతో రెండు రోజుల్లోనే తులం రేటు రూ.2800 వరకు తగ్గింది. ఇక 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.3170 మేర తగ్గింది.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం స్పష్టత




పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్ లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో.. చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హార్మూజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హార్మూజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్ లో నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్ లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

# మయామిలో ఎస్టేట్ కొన్న జూకర్‌బర్గ్.. లగ్జరీ ప్రాపర్టీ విలువ రూ.14 వందల కోట్లు!




అమెరికా టెక్ దిగ్గజం మెటా ప్లాట్‌ఫామ్స్ అధినేత మార్క్ జూకర్‌బర్గ్ రియల్ ఎస్టేట్ ప్రపంచంలో మరో సంచలనం సృష్టించారు. తన భార్య ప్రిసిల్లా చాన్‌తో కలిసి మయామిలోని అత్యంత విలాసవంతమైన ఇండియన్ క్రీక్ ఐలాండ్ లో ఒక భారీ వాటర్‌ఫ్రంట్ మాన్షన్‌ను కొన్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్ రిపోర్ట్స్ ప్రకారం దీని విలువ ఏకంగా 170 మిలియన్ డాలర్లు. అంటే మన భారతీయ కరెన్సీ లెక్కల ప్రకారం చూస్తే, దీని విలువ దాదాపు రూ.1,418 కోట్లకు పైమాటే. మయామి-డేడ్ కౌంటీ చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన రియల్టీ లావాదేవీగా సరికొత్త రికార్డును సృష్టించింది. దీనికి ముందు 2025లో నమోదైన 120 మిలియన్ డాలర్ల ప్రాపర్టీ సేల్ రికార్డును జూకర్‌బర్గ్ ఈ కొనుగోలుతో చెరిపివేశారు.ప్రముఖ సెలబ్రిటీ ప్లాస్టిక్ సర్జన్ ఆరోన్ రోలిన్స్, అతని భార్య మెరైన్ రోలిన్స్ నుంచి జూకర్‌బర్గ్ ఈ ఇంటిని కొనుగోలు చేశారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం దాదాపు రూ.19.2 లక్షల కోట్ల సంపద కలిగిన జూకర్‌బర్గ్, గత కొన్ని వారాలుగా ఈ ప్రాంతంలో తనకు నచ్చిన ఆస్తి కోసం అన్వేషిస్తున్నారు. మార్చి 2వ తేదీన ఈ భారీ డీల్ అధికారికంగా ముగిసింది. కాలిఫోర్నియాలో ప్రతిపాదిత బిలియనీర్స్ ట్యాక్స్ పై చర్చ జరుగుతున్న వేళ.. సిలికాన్ వ్యాలీకి చెందిన దిగ్గజాలు సౌత్ ఫ్లోరిడా వైపుకు వెళ్లటం ఆసక్తికరంగా మారింది. ఈ ఇండియన్ క్రీక్ ఐలాండ్‌ను "బిలియనీర్ బంకర్" అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడ నివసిస్తున్న వారందరూ ప్రపంచ స్థాయి ప్రముఖులే. జూకర్‌బర్గ్‌కు పొరుగున ఇవాంకా ట్రంప్, జారెడ్ కుష్నర్ వంటి రాజకీయ, వ్యాపార దిగ్గజాలు ఉండబోతున్నారు. ఇప్పటికే ఆల్ఫాబెట్ కో-ఫౌండర్ లారీ పేజ్ మయామి ప్రాంతంలో రూ.1,568 కోట్లు వెచ్చించి మూడు ప్రాపర్టీలను కొన్న సంగతి తెలిసిందే. అలాగే సెర్గీ బ్రిన్ కూడా రూ.417 కోట్ల విలువైన నివాసాన్ని సొంతం చేసుకునే పనిలో ఉన్నారు. టెక్ ప్రపంచంలోని దిగ్గజాలు వరుసగా మయామికి క్యూ కడుతుండటం అక్కడి రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు మరింత జోష్ నింపుతోంది. మార్క్ జూకర్‌బర్గ్‌కు ఇప్పటికే అమెరికా అంతటా అనేక ఖరీదైన ఆస్తులు ఉన్నాయి. కాలిఫోర్నియాలోని పాలో ఆల్టో, లేక్ తాహోతో పాటు వాషింగ్టన్ డీసీ, హవాయిలోని కవాయ్ ద్వీపంలో ఆయనకు భారీ ఎస్టేట్లు ఉన్నాయి. తాజాగా కొనుగోలు చేసిన ఈ మయామి ఇల్లు ఆయన లగ్జరీ పోర్ట్‌ఫోలియోలో ఒకటిగా నిలిచింది. కేవలం నివాసం కోసమే కాకుండా.. పన్ను ప్రయోజనాలు, భద్రత దృష్ట్యా కూడా బిలియనీర్లు ఇలాంటి ప్రాంతాలను ఎంచుకుంటున్నట్లు విశ్లేషకులు అంటున్నారు. రూ.1,400 కోట్లకు పైగా విలువైన ఈ ఇల్లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# హ్యాంగోవర్ నుండి బయటపడలా?



నూతన సంవత్సర దినోత్సవాన్ని జరుపుకోవడం, సంగీతం, స్నేహితులతో పార్టీ చేసుకోవడం, రాత్రి ఆలస్యంగా ఆనందించడం అన్నీ నూతన సంవత్సరంలో భాగం. కానీ తరచుగా, ఈ వేడుక తర్వాత మరుసటి రోజు ఉదయం, తలనొప్పి, అలసట, గందరగోళం, వికారం, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని మనం సాధారణంగా హ్యాంగోవర్ అని పిలుస్తాము. సరికొత్త లైటింగ్స్?, లేజర్ షోలు, టపాసుల మోతలు, కేక్ కటింగ్‌లు, యువత ఉత్సాహం నడుమ కొత్త సంవత్సరం 2026 ఘనంగా మొదలైంది. నూతన సంవత్సర వేడుకలు అంతటా అట్టహాసంగా జరిగాయి. ప్రపంచ దేశాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లోనూ నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. కొత్త ఆశలు, ఆశయాలతో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ 2026కి ఘన స్వాగతం పలికారు. బాణసంచా కాంతి వెలుగుల్లో హైదరాబాద్? వంటి నగరాలు శోభాయమానంగా కాంతులీనుతున్నాయి. నూతన సంవత్సర దినోత్సవాన్ని జరుపుకోవడం, సంగీతం, స్నేహితులతో పార్టీ చేసుకోవడం, రాత్రి ఆలస్యంగా ఆనందించడం అన్నీ నూతన సంవత్సరంలో భాగం. కానీ తరచుగా, ఈ వేడుక తర్వాత మరుసటి రోజు ఉదయం, తలనొప్పి, అలసట, గందరగోళం, వికారం, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి. దీనిని మనం సాధారణంగా హ్యాంగోవర్ అని పిలుస్తాము. హ్యాంగోవర్ కు ఖచ్చితమైన నివారణ సమయం అని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దాని లక్షణాలు 24 గంటల వరకు ఉంటాయి. అయితే, ఈ సమయంలో, మీరు కొన్ని సరళమైన, ప్రభావవంతమైన చర్యలను అనుసరించడం ద్వారా మిమ్మల్ని మీరు బాగా అనుభూతి చెందవచ్చు. నూతన సంవత్సర పార్టీ తర్వాత హ్యాంగోవర్ నుండి బయటపడటానికి మీకు సహాయపడే ఐదు చిట్కాలను తెలుసుకుందాం. ఆల్కహాల్ శరీరాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. అంటే శరీరం పూర్తిగా డీహైడ్రేట్ అవుతుంది. ఇది హ్యాంగోవర్‌లకు అతిపెద్ద కారణాలలో ఒకటి. మీరు ఉదయం నిద్రలేచిన వెంటనే నిండు వాటర్ బాటిల్‌ను నింపి నీరు త్రాగండి. కొబ్బరి నీళ్లు, నిమ్మరసం లేదా తాజా పండ్ల రసం కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. హ్యాంగోవర్‌ను వదిలించుకోవడానికి మళ్ళీ ఆల్కహాల్ తాగడం సరైన మార్గం కాదని గుర్తుంచుకోండి. ఇది మీ పరిస్థితిని మరింత దిగజార్చవచ్చు. హ్యాంగోవర్ సమయంలో కడుపు సున్నితంగా మారుతుంది. భారీ, కారంగా లేదా వేయించిన ఆహారాలు హానికరం కావచ్చు. టోస్ట్, బిస్కెట్లు, గంజి లేదా క్రాకర్స్ వంటి సరళమైన, తేలికైన ఆహారాలు రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో, కడుపును ఉపశమనం చేయడంలో సహాయపడతాయి. అదనంగా, కూరగాయల సూప్ కోల్పోయిన ఉప్పు, పొటాషియంను తిరిగి నింపుతుంది. తలనొప్పి లేదా శరీర నొప్పులు తీవ్రంగా ఉంటే, ఓవర్-ది-కౌంటర్ నొప్పి నివారణ మందులు కొంత ఉపశమనం కలిగించవచ్చు. కానీ వాటిని జాగ్రత్తగా వాడండి. ఆస్ప్రిన్, ఇబుప్రోఫెన్ కడుపు చికాకును పెంచుతాయి. ముఖ్యంగా శరీరం ఇప్పటికే మద్యం ప్రభావంలో ఉంటే.. పారాసెటమాల్‌ను మద్యంతో లేదా వెంటనే తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా దెబ్బతింటుంది. మందులు తీసుకునే ముందు జాగ్రత్త అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. నిద్ర శరీరానికి అత్యుత్తమ వైద్యం. వీలైతే, మీ నూతన సంవత్సర వేడుక తర్వాత రోజు విశ్రాంతి తీసుకోండి. తగినంత నిద్ర పొందండి. దీర్ఘమైన, గాఢమైన నిద్ర శరీరానికి కోలుకోవడానికి సమయం ఇస్తుంది. హ్యాంగోవర్ లక్షణాలను క్రమంగా తగ్గిస్తుంది. తరచుగా, మీరు మేల్కొన్నప్పుడు, తలనొప్పి, అలసట చాలా వరకు పోతాయి. హ్యాంగోవర్ అనేది తక్షణమే నయం అయ్యేది కాదని అర్థం చేసుకోవడం ముఖ్యం. శరీరం కోలుకోవడానికి సమయం కావాలి. కాబట్టి, మీరు అతిగా శ్రమించకండి, పని లేదా బాధ్యతలను కొంతకాలం వాయిదా వేయకండి మరియు మీ శరీరం ఇచ్చే సంకేతాలను వినండి.

# కొంపముంచిన హెయిర్-స్ట్రెయిటెనింగ్



హెయిర్ స్ట్రెయిటెనింగ్ చికిత్స చేయించుకున్న 17 ఏళ్ల బాలిక తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చేరిందని షారే జెడెక్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరో 25 ఏళ్ల మహిళ కూడా ఒక నెల క్రితం హెయిర్ స్ట్రెయిటెనింగ్ వల్ల మూత్రపిండాల వైఫల్యంతో బాధపడిందని.. వైద్యులు అధ్యయనంలో తెలపడం కలకలం రేపింది. జుట్టు అందంగా కనిపించాలనే.. హెయిర్ స్ట్రెయిటెనింగ్ కూడా ఓ యువతిని ఆసుపత్రి పాలు చేసింది.. మీరు వింటున్నది నిజమే.. హెయిర్ స్ట్రెయిటెనింగ్ చికిత్స కోసం వెళ్లిన ఓ 17 ఏళ్ల అమ్మాయి మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చాలా కాలం పాటు చికిత్స తీసుకుంది.. ఈ షాకింగ్ ఘటన ఇజ్రాయెల్ దేశంలో చోటుచేసుకుంది.. దీనికి సంబంధించిన షాకింగ్ నిజాలను జెరూసలేంలోని షారే జెడెక్ మెడికల్ సెంటర్ వివరించింది. హెయిర్ స్ట్రెయిటెనింగ్ చికిత్స చేయించుకున్న 17 ఏళ్ల బాలిక తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చేరిందని షారే జెడెక్ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మరో 25 ఏళ్ల మహిళ కూడా ఒక నెల క్రితం హెయిర్ స్ట్రెయిటెనింగ్ వల్ల మూత్రపిండాల వైఫల్యంతో బాధపడిందని ఆసుప్రతి వర్గాలు తెలిపాయి. హెయిర్ స్ట్రెయిటెనింగ్ తర్వాత.. వాంతులు, తలతిరుగుడు, తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న ఆ బాలిక, పిల్లల విభాగంలో చాలా రోజులుగా తీవ్రమైన మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందింది.. ఆమె సోమవారం డిశ్చార్జ్ అయ్యింది.. ఆసుపత్రిలోని పీడియాట్రిక్ నెఫ్రాలజీ ఇన్స్టిట్యూట్‌లో అవుట్ పేషెంట్ ఫాలో-అప్‌ను కొనసాగిస్తుందని తెలిపారు. 2023లో ఆసుపత్రి నెఫ్రాలజీ ఇన్‌స్టిట్యూట్ అధిపతి ప్రొఫెసర్ లిండా షావిత్.. ఇన్‌స్టిట్యూట్‌లోని వైద్యుడు డాక్టర్ అలోన్ బెనాయ ప్రచురించిన ఒక అధ్యయనంలో 14 నుండి 58 సంవత్సరాల వయస్సు గల మహిళలు ఎటువంటి అంతర్లీన వైద్య పరిస్థితులు లేకుండా తీవ్రమైన మూత్రపిండ వైఫల్యంతో దేశవ్యాప్తంగా అత్యవసర విభాగాలకు వచ్చిన 26 కేసులను నమోదు చేశారు. వారందరూ గ్లైయాక్సిలిక్ యాసిడ్ కలిగిన జుట్టు (హెయిర్ స్ట్రెయిటెనింగ్) నిఠారుగా చేసే చికిత్సలు చేయించుకున్నారని పరిశోధకులు కనుగొన్నారు. అప్పటి నుండి ఆరోగ్య మంత్రిత్వ శాఖ గ్లైయాక్సిలిక్ యాసిడ్ కలిగిన డజన్ల కొద్దీ సౌందర్య ఉత్పత్తుల లైసెన్స్‌లను రద్దు చేసింది. “జుట్టును నిఠారుగా చేసే ఉత్పత్తులను నేరుగా తలకు లేదా జుట్టు మూలాలకు పూయకూడదు.. కానీ వాటి నుండి కనీసం 1.5 సెంటీమీటర్ల దూరం ఉంచాలి” అని షవిత్ చెప్పారు. “అదనంగా, హెయిర్‌డ్రెస్సర్లు, క్లయింట్లు ఇద్దరూ ఉత్పత్తిని వేడి చేయకుండా జాగ్రత్త వహించాలి.. తయారీదారు సూచనల ప్రకారం మాత్రమే వ్యవహరించాలి.” అని సూచించారు. కాగా.. అందంగా కనిపించాలని హెయిర్ స్ట్రెయిటెనింగ్ చేసుకుంటున్న చాలామందికి ఇదో హెచ్చరికగా పేర్కొన్నారు.

# కరకరలాడే మురుకులు.. ఇంటిలోనే ఇలా ప్రిపేర్ చేయండి!



మురుకులు ఇష్టపడని వారు ఎవరు ఉంటారు చెప్పండి. చాలా మంది ఎంతో ఇష్టంగా మురుకులు తింటుంటారు. సాయంత్రం స్నాక్స్‌గా ఏదో ఒకటి తినాలి అనుకునే వారికి ఇవి బెస్ట్. చిన్న పిల్లల నుంచి పెద్ద వారి వరకు ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా వీటిని తింటారు. తమిళనాడులో చాలా మంది ఇష్టపడే స్నాక్స్‌లలో మురుకులు ముందుంటాయి. ఇవి మంచి రచిని ఇవ్వడమే కాకుండా, మంచి ఆకారాన్ని కలిగి ఉంటాయి. బియ్యం పిండి,మినపప్పు పిండి , జీలకర్ర లేదా నువ్వులు, సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో ఈ మురుకులను తయారు చేస్తారు. ఇక మంచి రుచి, క్రిస్పీగా క్రంచ్ రుచి కోసం నెయ్యి కలిపి చేస్తుంటారు. కాగా ఈ టేస్టీ టేస్టీ మురుకులు ఎలా తయారు చేయాలో ఇప్పుడు చూసేద్దాం. కావాల్సిన పదార్థాలు : 2 కప్పుల బియ్యం, మినప పప్పు ఒక కప్పు, వన్ స్పూన్ వెన్నె లేదా నెయ్యి, 1/2 టీ స్పూన్ ఇంగువ, 1 టీ స్పూన్ నువ్వులు లేదా జీలకర్ర, రుచికి సరిపడ ఉప్పు కారం, డీప్ ఫ్రై కోసం నూనె. తయారు చేయాల్సిన విధానం : ముందుగా ఒక గిన్నెలో బియ్యం పిండి, మినపప్పు పిండి, తీసుకోవాలి. అందులో నువ్వులు, జీలకర్ర, ఇంగువ, ఉప్పు, కారం పొడి, నెయ్యి వేసి మంచిగా కలుపుకోవాలి. తర్వాత కొన్ని కొన్ని వాటర్ కలుపుతూ కాస్త మెత్తగా, పిండి అంటుకోకుండా కలుపుకోవాలి. అంతే మనం మురుకుల కోసం పిండి రెడీ చేసుకున్నాం. తర్వాత స్టవ్ ఆన్ చేసి, కాస్త లోతుగా, పెద్దగా ఉండే, పాన్ తీసుకొని ,స్టవ్ పై పెట్టాలి. ఆ తర్వాత అందులో డీ ఫ్రైకి సరిపడ నూనె వేసి, మీడియం మంట మీద నూనెను వేడి చేసుకోవాలి. తర్వాత మనం ముందుగా తయారు చేసుకున్న పిండిని, మురుకులు చేసే పాత్రలో వేసి, పాన్‌లో ఒత్తుకోవాలి. అచ్చం మురుకుల ఆకారంలో అవి వస్తాయి. తర్వాత అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించుకోవాలి. అంతే టేస్టీ టేస్టీ మురుకులు రెడీ. ఇక వీటిని గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేసుకొని ప్రతి రోజూ తినవచ్చు. చిన్న పిల్లల నుంచి పెద్ద వారికి వరకు అన్ని వయసుల

వారు వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. అంతే కాకుండా, ఉదయం టీలో తిన్నాకూడాఅద్భుతంగా ఉంటాయి. మరి ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా మీ ఇంటిలో ఆలస్యం చేయకుండాప్రిపేర్ చేసుకోండి.

## బంధువులకు ఈ విషయాలు ఎప్పటికీ చెప్పకండి!



మీ జీవితంలో జరిగే ప్రతిదాని గురించి ఎదుటి వారికి నిజం చెప్పడం తెలివైన పని అనిపించుకోదని చాణక్య నీతి మనకు చెబుతుంది. మనం చెప్పే విషయాలు తప్పుడు వ్యక్తుల వద్దకు చేరితే, సహకారానికి బదులుగా హాని కలిగించేందుకు వినియోగిస్తారు. ఆచార్య చాణక్యుడు రాజకీయ, పరిపాలనా విషయాలలో మాత్రమే కాదు జీవితంలోని ప్రతి అంశంలోనూ ఆయన చెప్పిన విషయాలు మార్గనిర్దేశం చేస్తాయి. ముఖ్యంగా నేటి కాలంలో అపార్థాలు, అసూయ, ఇతరులతో పోలిక.. సర్వసాధారణంగా మారాయి. ఇటువంటి పరిస్థితిలో ప్రతిదాని గురించి ఎదుటి వారికి నిజం చెప్పడం తెలివైన పని అనిపించుకోదని చాణక్య నీతి మనకు చెబుతుంది. మనం చెప్పే విషయాలు తప్పుడు వ్యక్తుల వద్దకు చేరితే, సహకారానికి బదులుగా హాని కలిగించేందుకు వినియోగిస్తారు. కాబట్టి ఆత్మగౌరవం, మానసిక శాంతి, గౌరవాన్ని కాపాడుకోవడానికి కొన్ని సరిహద్దులను నిర్ణయించడం అవసరం. కుటుంబ కలహాలు, తగాదాల గురించి ఇతరులకు ముఖ్యంగా బంధువులకు చెప్పకూడదు. వీరు మీ విషయాలను తెలుసుకుని పుకార్లుగా వ్యాప్తి చేస్తారు. దీంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. మీ మానసిక బాధను ఏ బంధువుతోనూ పంచుకోకండి. అందరూ తమ భావాలను ఆహ్లాదకరమైన రీతిలో వ్యక్తపరచరు. కొందరు దానిని ఆయుధంగా కూడా ఉపయోగించవచ్చు. బంధువుల జోక్యం మీ బంధాల్లో అనుమానాన్ని, దూరాన్ని తీసుకురాగలదు. కాబట్టి మీ నిజమైన ప్రేమను ప్రపంచం దృష్టి నుంచి కాపాడుకోండి. దీని గురించి ఎవరికీ చెప్పకండి. అప్పుడు మీ బాంధవ్యాలు సురక్షితంగా ఉంటాయి. మీ బంధువులకు మీ ఆదాయం గురించి చెప్పడం వల్ల అసూయ, పోలిక, అవాంఛిత ఒత్తిడి పెరుగుతాయి. కాబట్టి మీ ఆదాయం తెలిసిన వ్యక్తులు తక్కువగా ఉంటే, మీ జీవితం అంత సురక్షితంగా ఉంటుంది. గతంలో మీరు అనుభవించిన బాధలు, పోరాటాలు, పాత అవమానాలు వంటి మరే ఇతర గత సమస్యలను ఎవరితోనూ ప్రస్తావించవద్దు. ఎందుకంటే ఎదుటి వారు మీ బలహీనతలను గుర్తుంచుకుంటారు. మీ కృషిని కాదు. మీ భవిష్యత్తు ప్రణాళికల గురించి కూడా ఎవరితో మాట్లాడకూడదు. ఎందుకంటే మీ శత్రువులు అప్రమత్తంగా ఉంటారు. వాటిని అడ్డుకోవచ్చు. నెరవేరని కలలపై ప్రతికూలత, ఇబ్బందులు త్వరగా వస్తాయి.

## మానసిక గాయాల్ని మాన్పించే మందు



సాధారణంగా చాలా సందర్భాల్లో మన మాటల వల్ల కానీ, చేతల వల్ల గానీ ఎవరినైనా బాధ పెట్టి ఉండవచ్చు. ఆ సమయంలో మనం దాన్ని పెద్దగా పట్టించుకోం. కానీ, అవి వారి మనసుకు మానని గాయాలను చేసివుండవచ్చు. అందుకే, మనం ఎవరితోనైనా వారు నొచ్చుకునేలా వ్యవహరిస్తే మాత్రం వారికి క్షమాపణ చెప్పడం ఉత్తమమైన మార్గమని మానసిక నిపుణులు చెబుతున్నారు. మనకు తెలిసి లేదా తెలియక మన జీవితంలో చాలా మందినే నొప్పిస్తుంటాం. మన మాట వల్ల కానీ, చేతల వల్ల గానీ వారు తీవ్రమైన మనోవేదనకు గురై ఉండవచ్చు. ఆ సమయంలో మనం దాన్ని పెద్దగా పట్టించుకోం. కానీ, అవి వారి మనసుకు మానని గాయాలను చేసివుండవచ్చు. అందుకే, మనం ఎవరితోనైనా వారు నొచ్చుకునేలా వ్యవహరిస్తే మాత్రం వారికి క్షమాపణ చెప్పడం ఉత్తమమైన మార్గమని మానసిక నిపుణులు చెబుతున్నారు. మనం చేసిన గాయం క్షమాపణతో కొంత మేర తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. క్షమాపణ చెప్పడానికి సంకోచించవద్దని, లేదంటే వారిలో అపరాధన భావన పెరిగుతుందని చెబుతున్నారు. క్షమాపణ చెప్పడం లేదా తప్పు చేసినవారిని క్షమించడం ఉత్తమమైన లక్షణాలని మానసిక నిపుణులు అంటున్నారు. మనం ఏదైనా తప్పు చేస్తే.. క్షమాపణ చెప్పాలి. ఇతరులను క్షమించాలి. లేదంటే అహంకారులుగా పరిగణించే అవకాశం ఉందని అంటున్నారు. ఎదుటివారిని ధ్వేషించడం మొదలు పెడతారని చెబుతున్నారు. అందుకే మానవ సంబంధాల్లో మనం క్షమాపణ చెప్పడం ఎంత ముఖ్యమో.. క్షమించడం అంతకంటే మంచిదని సైకాలజిస్టులు చెబుతున్నారు. క్షమించడం నేర్చుకుంటే మన జీవితం మరింత అందంగా, ఆనందంగా మారుతుందని అంటున్నారు. ఎక్కువగా కుటుంబ జీవితంలో క్షమాపణ అనేది తప్పనిసరి అని అంటున్నారు. క్షమాపణతో ఎలాంటి బంధాలైనా నిలబడతాయని చెబుతున్నారు. ఒక మహిళ ఒక పురుషుడి దగ్గర పనిచేస్తోంది. ఆమెకు సహజంగానే నత్తి ఉంది. అక్కడున్నవారందరికీ ఈ విషయం తెలుసు. అయితే, ఒకసారి, ఆమె మాటలను ఆమె ముందున్న వ్యక్తి తప్పుగా అర్థం చేసుకున్నాడు. ఇందుకు ఆమె క్షమాపణలు చెప్పి.. తాను ఏం చెప్పదల్చుకున్నారో వివరించింది. అప్పుడు అతను అర్థం చేసుకున్నాడు. తప్పు చేసిన వ్యక్తి తన హృదయపూర్వకంగా క్షమాపణలు చెబితే మాత్రం వారిని క్షమించడం ఉత్తమం. వారు చేసిన తప్పును తెలుసుకుని అలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని చెబితే వారిని క్షమించాలి. అయితే, బలవంతంగా క్షమాపణలు చెప్పించుకోవడం సరికాదు. అదే సమయంలో, పదే పదే తప్పులు చేస్తూ, అవమానిస్తూ క్షమాపణలు అడిగేవారిని మాత్రం ఎప్పటికీ క్షమించకూడదు.

# సెమీస్‌కి ముందు భారత జట్టులో కలవరం..
# ఫీల్డింగ్‌పై కోచ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ చివరి దశకు చేరుకుంది. దీంతో ఇవాళ్టి నుంచి సెమీఫైనల్ పోరు స్టార్ట్ కానుంది. సెమీస్ కి ముందు భారత జట్టు ఫీల్డింగ్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇది మానసిక సమస్యా? లేక కేవలం ఏకాగ్రత లోపమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ ఈ అంశంపై చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన పలు మ్యాచ్ లలో ఇండియన్ టీమ్ సంపూర్ణ ప్రదర్శన చేయలేకపోయింది.. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ రెండు కీలక క్యాచ్‌లను వదిలేశాడు. అలాగే తిలక్ వర్మ కూడా ఒక సులభమైన క్యాచ్ ని వదిలి పెట్టాడు అని పేర్కొన్నాడు. ఎవ్వరూ కూడా కావాలని క్యాచులని వదలరు.. ఫీల్డింగ్‌పై మేము ప్రత్యేకంగా దృష్టి పెట్టాం అని బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ తెలిపారు. ప్రపంచకప్‌కు ముందు నుంచే ఇది మా ముఖ్య అంశాల్లో ఒకటిగా ఉంది. ప్లేయర్స్ కష్టపడి ప్రాక్టీస్ చేస్తున్నారు.. కానీ ఇది మానసిక సమస్యా కాదా అన్నదానికి నేను సమాధానం చెప్పలేనని అన్నాడు. ఈ టోర్నమెంట్ మొత్తంలో భారత్ ఇప్పటి వరకు 13 క్యాచ్‌లు వదిలేసింది.. ఈ మెగా ఈవెంట్ లో ఏ జట్టు కూడా ఇన్ని క్యాచులని వదిలి పెట్టలేదని వెల్లడించాడు. ఫీల్డింగ్ మెరుగుపడాలంటే ప్రత్యేక ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు. కీలక ప్రాంతాల్లో సరైన ఆటగాళ్లను నియమించడం ముఖ్యం.. మైదానంలో వేగంగా స్పందించే ప్లేయర్స్ ఉండాలని సూచించాడు. సరైన ఆటగాళ్లను కీలక స్థానాల్లో ఉంచగలిగితే క్యాచ్‌లను ఈజీగా అందుకునే అవకాశం ఉంటుందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్ పేర్కొన్నారు. మైదానంలో ప్రతి ఒక్క ఆటగాడు బాధ్యత తీసుకుని కాస్త శ్రమిస్తే ఫలితాలు మారుతాయని చెప్పాడు. రేపు (మార్చి 5న) ముంబైలోని వాంఖెడే వేదికగా భారత్ వర్సెస్ -ఇంగ్లండ్ మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. కీలక పోరుకు ముందు ఫీల్డింగ్ లోపాలను సరిదిద్దడం టీమిండియాకు అత్యవసరం. మరోవైపు ఇంగ్లండ్ జట్టు ఫీల్డింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన చేస్తుంది. టామ్ బాంటన్ ఇప్పటికే 10 క్యాచ్‌లు పట్టగా, గ్లెన్ ఫిలిప్స్ అత్యధిక క్యాచ్‌లు పట్టిన ఆటగాడిగా టోర్నీలో టాప్ లో కొనసాగుతున్నాడు.

# దయచేసి అభిషేక్ శర్మను తప్పించండి.. రవిశాస్త్రి సంచలన వ్యాఖ్యలు





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ గత కొంతకాలంగా ఫామ్ లేమితో విమర్శల పాలవుతున్నాడు. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో అతడి వైఫల్యాలే ఇందుకు ప్రధాన కారణం. ఐసీసీ ర్యాంకింగ్స్ లో నెంబర్--1 టీ20 బ్యాటర్ గా కొనసాగుతున్న ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్.. కెరీర్లో తొలిసారి వరల్డ్ కప్ ని ఆడుతున్నాడు. సొంతగడ్డపై భారీ అంచనాలతో బరిలోకి అతడు.. ఆడిన తొలి మూడు మ్యాచ్ లో డకౌట్ కావడం తీవ్రంగా నిరాశపరిచాడు. మొత్తంగా ఆరు మ్యాచ్ లని కలిపి అతడు కేవలం 80 పరుగులుమ మాత్రమే చేసిండు.

రేపు (మార్చ్ 5న) ఇంగ్లాండ్ తో జరిగే సెమీ ఫైనల్ కి ముందు భారత జట్టు మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి, అభిషేక్ శర్మను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశాడు. వరుస వైఫల్యాలతో అతడు తీవ్ర మానసిక వేదనకు కుంగిపోయి ఉండవచ్చని పేర్కొన్నాడు. అలాంటపుడు తుది జట్టు నుంచి అభిని తప్పించడమే సరైన నిర్ణయం అని చెప్పుకొచ్చాడు. కేవలం నెట్ ప్రాక్టీస్ లో బ్యాటింగ్ తీరును చూసి అంచనాకు రావొద్దని సూచనలు చేశాడు. అతడితో స్పెషల్ గా మాట్లాడాలి.. మానసికంగా అతడు ఎంత దృఢంగా ఉన్నాడో తెలుసుకునే ప్రయత్నం చేయాలని వెల్లడించాడు. ఒకవేళ తుది జట్టులో అభిషేక్ శర్మను కొనసాగించొద్దు అనుకుంటే.. ఇషాన్ కిషన్ ని ఓపెనర్ గా ఆడించాలని రవిశాస్త్రి తెలిపారు. లోయర్ ఆర్డర్ లో రింకూ సింగ్ ని తీసుకు వస్తే చాలు టీమ్ సెట్ అవుతుందని అన్నారు. అభిషేక్ శర్మ గత సిరీస్ లో ఇంగ్లాండ్ మీద అదరగొట్టిన తీరును మర్చిపోవద్దు.. వాంఖడేలో గతంలో అతడి ప్రదర్శన అద్భుతంగా ఉంది. అక్కడ అతడు వేగంగా సెంచరీలు చేశాడు. కాబట్టి అభిషేక్ శర్మను కొనసాగిస్తే బాగుంటుంది.. ఒకవేళ రింకూను తీసుకురావాలని అనుకుంటే మాత్రం ఓపెనింగ్ జోడీని మార్చాల్సి వస్తుందని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

# చరిత్ర సృష్టించిన టీ20 వరల్డ్ కప్..
# 500 మిలియన్లు దాటిన వ్యూయర్‌షిప్






**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026 ఫైనల్ దశకు చేరుకుంది. నేటి నుంచి సెమీ ఫైనల్ పోరు కొనసాగనుంది. అయితే ఈ పొట్టి వరల్డ్ కప్ వ్యూయర్‌షిప్ పరంగా చరిత్ర సృష్టిస్తోంది. ఇప్పటి వరకు భారత్‌లో దాదాపు 50 కోట్ల మంది ఈ టోర్నమెంట్ లో జరిగిన మ్యాచులను చూసినట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఛైర్మన్ జై షా ఎక్స్ వేదికగా తెలిపారు. టీ20 ప్రపంచ కప్ చరిత్రలో ఇదే రికార్డు అని వెల్లడించారు. కాగా ప్రస్తుత పొట్టి అత్యంత ప్రేక్షకాదరణ పొందిన ఈవెంట్‌గా మార్చాలనే ఆశయంతో స్టార్ట్ చేసినట్లు పేర్కొన్నారు. భారతదేశంలో ఈ ఈవెంట్‌కు వీక్షకుల సంఖ్య 50 కోట్లు(500 మిలియన్లు) దాటింది అన్నారు. ఇది టీ20 ప్రపంచ కప్ చరిత్రలోనే అత్యధికమని చెప్పుకొచ్చారు. జియో హాట్ స్టార్ వీక్షకుల సంఖ్య 6.05కోట్లకు (60.5 మిలియన్లు) చేరినట్లు తెలిపారు .ఈరోజు నుంచి నాకౌట్ మ్యాచ్‌లు స్టార్ట్ కానున్నాయి. వీటిని కూడా భారత అభిమానులు వీక్షించి.. మరిన్ని రికార్డులు బద్దలు కొట్టాలని ఆశిస్తున్నట్లు ఐసీసీ చెర్మన్ జై షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ టోర్నీని ప్రపంచవ్యాప్తంగా మరింత మంది అభిమానులకు చేరువ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.. ఇదిలా ఉండగా.. ఈరోజు నుంచి సెమీ ఫైనల్స్ ప్రారంభం అవుతున్నాయి. సాయంత్రం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా సౌతాఫ్రికా వర్సెస్ -న్యూజిలాండ్ మధ్య తొలి సెమీస్ జరగనుంది. అలాగే రేపు (మార్చి 5న ) ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా భారత్ వర్సెస్ -ఇంగ్లండ్ సెమీ ఫైనల్స్ 2లో పోటీ పడబోతున్నాయి. ఈ మ్యాచ్‌లలో గెలిచిన టీమ్స్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. మార్చి 8 (ఆదివారం) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ఫైనల్ మ్యాచ్ జరగనుంది. అయితే నాలుగు క్రికెట్ టీమ్స్ ఫైనల్ ట్రోఫీ కోసం తీవ్రంగా పోరాడుతుండగా అభిమానుల్లో ఉత్కంఠ పెరిగింది. నాకౌట్ దశలో మ్యాచ్‌లు మరింత ఉత్కంఠభరితంగా ఉండే అవకాశం ఉంది. దీంతో వ్యూయర్‌షిప్ గణంకాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఐసీసీ వర్గాలు భావిస్తున్నాయి. టోర్నమెంట్ తుది ఘట్టానికి చేరుకుంటున్న వేళ అభిమానులు ఉత్సాహంగా, డిజిటల్ వేదికల ద్వారా ఈ వరల్డ్ కప్ టోర్నమెంట్ కి అపూర్వ స్పందన లభించడంతో చరిత్ర నిలిచిపోనుంది.



షాలినీ పాండే
నేచురల్
బ్యూటీ
ఫోకస్

# హీరోగా తొలి ప్రయత్నంలో బ్లాక్ బాస్టర్ సక్సెస్ అందుకున్న డైరెక్టర్స్ వీళ్లే!







సినిమా ఇండస్ట్రీలో ఒక్కోసారి ఊహించని మలుపులు చోటుచేసుకుంటాయి. యాక్షన్ అని చెప్పే దర్శకులే మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చి హీరోలుగా మారడం మనం చూస్తూనే ఉంటాం. అయితే, డైరెక్షన్ సీటు వదిలి హీరోగా అదృష్టాన్ని పరీక్షించుకుని, మొదటి సినిమాతోనే బాక్సాఫీస్ దగ్గర బ్లాక్‌బస్టర్ హిట్లు కొట్టిన కొందరు టాలెంటెడ్ దర్శకుల గురించి మీకు తెలుసా? మెగాఫోన్ పట్టిన చేతులతోనే మెగా హిట్లు కొట్టి హీరోలుగా సెటిల్ అయిన ఆ స్టార్ డైరెక్టర్ల సక్సెస్ స్టోరీస్ ఇప్పుడు చూద్దాం..

**క్రేజీ కాన్సెప్ట్‌లతో కట్టిపడేసిన యంగ్ డైరెక్టర్స్:**

ప్రస్తుత తరం దర్శకుల్లో ప్రదీప్ రంగనాథన్ పేరు మారుమోగిపోతోంది. 'కోమాలి' సినిమాతో డైరెక్టర్‌గా సత్తా చాటిన ఈ కుర్రాడు, తన రెండో సినిమా 'లవ్ టుడే'తో హీరోగా మారిపోయాడు. యువతకు కనెక్ట్ అయ్యే కథతో వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి ఓవర్‌నైట్ స్టార్ అయ్యాడు. ఇక మన తెలుగు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ కూడా 'పెళ్లి చూపులు'తో సెన్సేషన్ క్రియేట్ చేసి, ఆ తర్వాత 'మీకు మాత్రమే చెప్తా' సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకున్నాడు. వీరు కేవలం డైరెక్షన్‌లోనే కాదు, యాక్టింగ్‌లో కూడా తమదైన మార్క్ చూపిస్తూ యూత్‌లో భారీ క్రేజ్ సంపాదించుకున్నారు.

**లెజెండరీ దర్శకుల సంచలన అడుగులు:**

ఒకప్పుడు డైరెక్టర్‌గా కల్ట్ క్లాసిక్ సినిమాలు తీసిన ఉపేంద్ర, ఎస్.జె. సూర్య వంటి వారు హీరోలుగా మారి సృష్టించిన ప్రభంజనం అంతా ఇంతా కాదు. కన్నడ ఇండస్ట్రీలో తన మార్క్ డైరెక్షన్‌తో షేక్ చేసిన ఉపేంద్ర, అప్పట్లో 'ఎ' సినిమాతో హీరోగా మారి సెన్సేషనల్ హిట్ అందుకున్నారు. ఇప్పటికీ ఆ సినిమా ఒక ట్రెండ్ సెట్టర్. అలాగే తమిళంలో 'వాలి', 'ఖుషి' వంటి బ్లాక్‌బస్టర్లు తీసిన ఎస్.జె. సూర్య, 'న్యూ' అనే సినిమాతో హీరోగా మారి తన విలక్షణ నటనతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక రీసెంట్‌గా అభిషన్ జీవింత్ 'టూరిస్ట్ ఫ్యామిలీ' తర్వాత 'జీవింత్ విత్ లవ్' చిత్రంతో హీరోగా మారి తొలి సినిమాతోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు.

**వారి సక్సెస్ సీక్రెట్ ఇదే:**

ఈ డైరెక్టర్లందరూ హీరోలుగా సక్సెస్ అవ్వడానికి ప్రధాన కారణం వారికి సినిమాపై ఉన్న ఇష్టం. కథలో ఏ ఎమోషన్ పండుతుందో, ఆడియన్స్‌కి ఏం కావాలో వారికి బాగా తెలుసు. అందుకే వారు హీరోలుగా మారినప్పుడు పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి ఆకట్టుకుంటున్నారు. ఇక వీరు కేవలం ఒక్క సినిమాకే పరిమితం కాకుండా హీరోలుగా వరుస అవకాశాలు అందుకుంటూ, అటు డైరెక్షన్‌ను ఇటు యాక్టింగ్‌ను బ్యాలెన్స్ చేస్తున్నారు. డైరెక్టర్ విజన్ కలిగిన హీరోలు కాబట్టే వీరి సినిమాలు నాచురల్ కు దగ్గరగా ఉంటూ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. దర్శకత్వం వహించడం ఒక ఎత్తు అయితే, కెమెరా ముందు నటిస్తూ మెప్పించడం మరో ఎత్తు. కానీ ఈ టాలెంటెడ్ డైరెక్టర్లు ఆ రెండు పడవల ప్రయాణాన్ని సక్సెస్ ఫుల్ గా సాగిస్తున్నారు. అటు మెగాఫోన్ పట్టినా.. ఇటు మేకప్ వేసినా.. వారి లక్ష్యం మాత్రం ప్రేక్షకులను అలరించడమే.



ఆశు రెడ్డి యొక్క అత్యంత ఆకర్షణీయ మైన మూమెంట్స్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965